PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 27 | విజయవాడ, మంగళవారం 27 ఆగస్టు 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 27 August 2024 | Rs

బస్సులు, ట్రక్కులు ఆపి, ప్రయాణికులను దింపి...

బెలూచిస్తాన్‌లో సాయుధుల దాడులు

7



మహిళా అథ్లెట్లు గత రికార్డులను బ్రేక్ చేస్తారా..?

- 32 మందితో భారత మహిళల బృందం
- పారా ఒలింపిక్స్ రేపటినుంచే..

8

జ్వరాల విజృంభణ

కీళ్ల నొప్పులు, దురదలతో అవస్థలు

వారం తరువాత కాళ్లవాపులు

ఇప్పటికీ స్క్రీనింగ్ చేయని ప్రభుత్వం



ముదినేపల్లి పిహెచ్‌సిలో చికిత్స పొందుతున్న జ్వర పీడితుడు.

ప్రజాశక్తి - యంత్రాంగం

రెండు రోజులు జ్వరం, వెంటనే కీళ్ల నొప్పులు, అనంతరం దురదలు, ఒళ్లు మంటలు, కాళ్ల వాపులు, మంచం దిగలేని దయనీయం. నొప్పులు భరించలేక మందులు వాడితే పెరుగుతున్న క్రియాటినిన్ లెవల్స్. అదొక భయం. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో పల్లెలో చూసినా ఇదే పరిస్థితి. తూర్పుగోదావరి, అనంతపురం, పశ్చిమగోదావరి, విశాఖ, కృష్ణా, ఎన్‌టిఆర్, అల్లూరి, ఏలూరు, గుంటూరు జిల్లాల్లో జ్వరాల సమస్య తీవ్రంగా ఉంది. ఈ జిల్లాల్లో ఇన్‌పేషెంట్ల సంఖ్య కూడా పెరుగుతోందని వైద్యాధికారులు తెలిపారు. రాష్ట్ర కేంద్రం ఉన్న మంగళగిరి నియోజకవర్గంలోని తుమ్మపూడిలో అ ఏకంగా 300మందికిపైగా జ్వరాల బారినపడ్డారు. పనులు చేసుకోలేక నానా అవస్థలూ పడుతున్నారు. నెలా పదిహేను రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఇప్పటి వరకు స్క్రీనింగ్ జరగలేదు. వైద్యులు, సిబ్బంది ఇంటింటికీ తిరిగి మందులు ఇస్తున్నా నొప్పులు భరించచలేకపోతున్నామని బాధితులు చెబుతున్నారు..

తూర్పుగోదావరి జిల్లాలో కలెక్టర్ తొమ్మిది గ్రామాలను తీవ్ర విషజ్వరాలున్న గ్రామంగా ప్రకటించాల్సి వచ్చింది. గైగోలుపాడు అనే గ్రామంలో తొమ్మిది మొబైల్ టీములను ఏర్పాటు చేసినా పరిస్థితి తీవ్రత తగ్గలేదు. తొలుత మంగళగిరి, విజయవాడ ఈస్ట్‌లోని కృష్ణలంక, నూజివీడు నియోజవకర్గాల్లో ఈ వైరల్ ఫీవర్‌ను గుర్తించారు. అధికారులు దోమల వల్ల వస్తోందని చెప్పి, మందులిచ్చి చేతులు దులుపుకుంటున్నారు తప్ప ఇంతవరకు కారణాన్ని గుర్తించలేదు. తమవద్దకు వస్తున్న రోగులు చికున్‌గున్యా లక్షణాలతో వస్తున్నారని, ఒకటీ రెండు టెస్టులు చేయించినా నెగెటివ్ వస్తుండటంతో అవి కూడా చేయించడం లేదని వైద్యులు తెలిపారు. నొప్పుల బాధభరించలేక ఎక్కువమంది ఆర్‌ఎంపి డాక్టర్లను ఆశ్రయిస్తుండటంతో వారు డైక్లోఫినాక్ ఇంజక్షన్ చేసి, పెయిన్ కిల్లర్లు ఇచ్చి తాత్కాలిక ఉపశమనం కలిగిస్తున్నారు. నొప్పుల బిళ్లలు వాడటంతో రక్తంలో క్రియాటినిన్ లెవల్స్ పెరుగుతున్నాయి.

జ్వరాల లక్షణాలు

- వైరస్ ప్రభావంతో రక్తంలో సిఆర్‌పి(సీరమ్ రియాక్టివ్ ప్రొటీన్) కొంతమందికి 50 శాతానికి చేరుతోంది
- జ్వరంతో బాధపడేవారికి గతంలో పోలిస్తే డీహైడ్రేషన్ సమస్య ఎక్కువగా ఉంటోంది
- రెండు రోజులకు దురద, శరీరంపై దద్దుర్లు వస్తున్నాయి
- ఎక్కువమందికి జ్వరం 15 రోజులు ఉంటోంది. 90 కిలోల పైబడి బరువున్న వారికి రెండు నెలలు ఉంటోంది.
- కొంతమందికి మూడు నెలల వరకూ తీవ్ర నొప్పులు ఉంటున్నాయి.

విజయవాడలో ...

విజయవాడలోని సాధారణ ప్రభుత్వ వైద్యశాలలో జ్వరం, కీళ్లనొప్పులు, వాపులతో వచ్చేవారి సంఖ్య రెట్టింపయింది. గతంలో 30 నుండి 40 మంది వస్తే ప్రస్తుతం 200 మంది వరకూ వస్తున్నారని అక్కడి వైద్యులు తెలిపారు. ఆర్‌ఎంపి డాక్టర్లకైతే ఖాళీ ఉండటం లేదు. మంగళగిరి నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లోనూ విషజ్వరాలు విజృంభించాయి.

ఏలూరు జిల్లా ముదినేపల్లిలో...

ఏలూరు జిల్లాలోని ముదినేపల్లి మండలంలో పెద్ద సంఖ్యలో ప్రజలు జ్వరాల బారిన పడ్డారు.ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దఎత్తున నీటి నిల్వలు ఏర్పడి, దోమలు పెరగడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని చెబుతున్నారు. మండల కేంద్రమైన ముదినేపల్లిలో పది వేల మంది జనాభా ఉన్నారు, ఇక్కడ ఒక పిహెచ్‌సితో పాటు నాలుగు ప్రైవేటు ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో జూన్ నెల వరకు ఒక్కో ఆస్పత్రికి పది మంది వరకు జ్వరపీడితులు వచ్చేవారు, ప్రస్తుతం ఒక్కో ఆస్పత్రికి 150 మందిదాకా వస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. ఇక్కడ ప్రతి ఇంట్లో ఒక జ్వరపీడితుడున్నారని వైద్యులు చెబుతున్నారు. చికిత్స చేసే వైద్యులకు కూడా జ్వరాలు వ్యాపిస్తున్నాయి, మండలంలోని దేవపూడి, గురిజ, ముదినేపల్లి గ్రామాల్లో పిహెచ్‌సిలకు జ్వరపీడితుల తాకిడి ఎక్కువగా ఉంది.

డెంగీతో చిన్నారి మృతి

అనంతపురం జిల్లా కణేకల్లు మండలం ఎర్రగుంట గ్రామానికి చెందిన 9 సంవత్సరాల చిన్నారి పి. మిస్బా కౌసర్ డెంగీ జ్వరంతో మృతి చెందింది. ఈ చిన్నారి రెండు రోజుల నుండి తీవ్ర జ్వరంతో బాధపడుతోంది. స్థానికంగా చికిత్స చేసినా ఫలితం లేకపోవడంతో ఆదివారం నాడు బళ్లారిలోని విమ్స్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్సపొందుతూ కౌసర్ మృతి చెందింది.

మరో ఇద్దరు మృతి

'సినర్జిన్' ప్రమాదంలో మూడుకు చేరిన సంఖ్య

సిఐటియు ఆందోళనతో మృతులకు రూ.కోటి పరిహారం


ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

అనకాపల్లి జిల్లా పరవాడ ఫార్మా సిటీలోని సినర్జిన్ కంపెనీలో ఈ నెల 22న అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో గాయపడ్డ వారిలో ఆదివారం రాత్రి జార్ఖండ్‌కు చెందిన లాల్‌సింగ్, సోమవారం ఉదయం విజయనగరం జిల్లా వంగర మండలం కోనంగిపాడు గ్రామానికి చెందిన కొవ్వాడ సూర్యనారాయణ (38) మృతిచెందారు. దీంతో ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి సంఖ్య మూడుకు చేరింది. ఇదే ఘటనలో క్షతగాత్రుడైన జార్ఖండ్‌కు చెందిన కార్మికుడు విశాఖలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రూ.కోటి చొప్పున పరిహారం

ఎసెన్షియా ఫార్మా మృతులకు ఇచ్చినట్టే రూ.కోటి నష్ట పరిహారం ఇవ్వాలని సిఐటియు ఆధ్వర్యాన ఇండస్ ఆసుపత్రి వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఫలితంగా మృతి చెందిన ముగ్గురి కార్మికుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున పరిహారం అందించనున్నట్టు సినర్జిన్ ఫార్మా కంపెనీ డైరెక్టర్ శ్రీనివాస్ ప్రకటించారు. అనకాపల్లి, విశాఖ జిల్లాల కలెక్టర్ల ఆదేశం మేరకు ఈ నష్ట పరిహారం మృతుల కుటుంబాలకు చేరవేస్తామన్నారు.

తొలుత ఆందోళననుద్దేశించి సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడారు. ఫార్మా సిటీ ప్రమాదాలన్నీ యాజమాన్యం హత్యలే అని పేర్కొన్నారు. ప్రమాదానికి కారణమైన యాజమా న్యాన్ని శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ఫార్మా సిటీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యదర్శి గనిశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సూర్యనారాయణ కుటుంబానికి పరిహారం చెక్కు, ఒప్పంద పత్రం అందజేస్తున్న సినర్జిన్ కంపెనీ డైరెక్టర్ శ్రీనివాస్

ప్రజల నుండి అర్జీలను పార్టీ కార్యాలయాల్లో కాదు


ప్రభుత్వ కార్యాలయాల్లో తీసుకోండి

- **సిపిఎం రాష్ట్ర కమిటీ**

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రజా సమస్యలపై అర్జీలను పార్టీ కార్యాలయాల్లో కాకుండా ప్రభుత్వ కార్యాలయాల్లో తీసుకోవాలని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది. ఈ మేరకు సోమవారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు తెలుగుదేశం, జనసేన, బిజెపి పార్టీ కార్యాలయాల్లో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులు ప్రజా సమస్యలపై అర్జీలను స్వీకరించే ప్రక్రియను విరమించుకోవాలని ఈ ప్రకటనలో సిపిఎం కోరింది. ప్రభుత్వ కార్యాలయాల్లో ఆ ప్రక్రియను నిర్వహించాలని సూచించింది. ప్రభుత్వానికి, రాజకీయ పార్టీలకు మధ్య ఉండాల్సిన విభజన రేఖను చెరిపేసే విధంగా రాష్ట్రంలోని అధికార కూటమి నాయకులు వ్యవహరించడం తగదని వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడం ప్రభుత్వం, అధికార పదవులు నిర్వహించే వారి బాధ్యతని తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏ రాజకీయ అభిప్రాయాలు లేనివారు, అనేక రాజకీయ అభిప్రాయాలు కలిగిన ప్రజలు అర్జీలు, ఫిర్యాదులు అందజేస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల నివేదనకు ప్రభుత్వ కార్యాలయాలే తగిన వేదికలని తెలిపారు.

ప్రజలు అర్జీలు, పిర్యాదులను ముఖ్యమంత్రి, మంత్రులు సచివాలయం లేదా నిర్దేశిత ప్రభుత్వ కార్యాలయాలు లేదా వారి క్యాంపు కార్యాలయాల్లో స్వీకరించాలని సూచించారు. పార్టీ కార్యాలయాలను అందుకు కార్యస్థానాలుగా ఎంచుకోవడం సబబుకాదన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలు, ఆ తరువాత విబేధాలు మరిచి అందరూ సమిష్టిగా అభివృద్ధికి తోడ్పడాలని ఉపన్యాసాలు చెప్పే కూటమి నాయకులు అధికారానికి వచ్చాక తమ పార్టీ కార్యాలయాలను ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించడం తగదని తెలిపారు. ప్రభుత్వం ప్రజలందరికీ చెందినదిగా వ్యవహరించాలని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నవారు ప్రజలందరి బాగోగులు చూడాలని, రాజకీయ అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా ప్రజా సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, ప్రజా ప్రతినిధులు పార్టీతో పాలనను, ఫిర్యాదులను కలగాపులగం చేయడం తగదన్నారు.



యుపిఐ తరహాలో యుఎల్ఐ

- **ఆర్‌బిఐ వెల్లడి**

న్యూఢిల్లీ : రుణాలు తీసుకోవడాన్ని సులభతరం చేస్తూ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నిర్ణయం తీసుకుంది. ఇందుకోసం యూనిఫైడ్ లెండింగ్ ఇంటర్‌ఫేస్ (యుఎల్‌ఐ)ను తీసుకురానున్నట్లు పేర్కొంది. గతేడాదే ఆగస్టు 17న ఫ్రిక్షన్‌లెస్ క్రెడిట్ పేరుతో ప్రారంభించిన పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలివ్వడంతో త్వరలో దీన్ని పూర్తి స్థాయిలో అందుబాటులోకి తేనున్నట్లు ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్ తెలిపారు. సోమవారం బెంగళూరులో శక్తికాంత ఓ సమావేశంలో మాట్లాడుతూ.. డిజిటల్ పేమెంట్ వ్యవస్థలో యుపిఐ ఏవిధమైన పాత్ర పోషిస్తోందో అదే తరహాలో రుణ వితరణలో యుఎల్‌ఐ కూడా దూసుకుపోనుందన్నారు. భూ రికార్డులు సహా ఇతర ముఖ్యమైన డిజిటల్ ఇన్ఫర్మేషన్ ఆధారంగా యుఎల్‌ఐ పని చేస్తుందన్నారు. దీంతో రుణ ఆమోద ప్రక్రియ సరళతరం కానుందని తెలిపారు. రుణం పొందేందుకు డాక్యుమెంటేషన్ ప్రక్రియ అవసరం ఉండదన్నారు.

గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఉధృతం

హిజ్బుల్లాల ప్రతిఘటనతో లెబనాన్‌పై వెనక్కి.. ● కాల్పుల విరమణ ఒప్పందానికి కొత్త షరతులు

జెరూసలెం : అమెరికా అండతో గాజాపై ఇజ్రాయిల్ దాడులను మరింత తీవ్రతరం చేసింది. లెబనాన్‌పై దాడికి హిజ్బుల్లాల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురుకావడంతో కొంచెం వెనక్కి తగ్గిన ఇజ్రాయిల్ సైన్యం గాజాపై మాత్రం తన ప్రతాపాన్ని చూపిస్తున్నాయి. గాజా సిటీ నుంచి ఖాళీ చేయాలని ఇజ్రాయిల్ మరో హుకుం జారీ చేయడంతో గాయాలతో నడవలేని స్థితిలో ఉన్న పాలస్తీనీయులు సెంట్రల్ గాజాలోని అల్ అక్సా ఆస్పత్రిలో తలదాచుకునేందుకు వెళ్తుండగా వారిపై ఇజ్రాయిల్ డ్రోన్లతో దాడులు చేసి ఏడుగురిని బలి తీసుకుంది. లెబనాన్ దక్షిణ సరిహద్దుపై భారీగా యుద్ధవిమానాలతో దాడి చేయగా, దీనికి హిజ్బుల్లాలు గట్టిగా సమాధానమిచ్చారు. దీంతో లెబనాన్‌పై దాడుల నుంచి కొంచెం వెనక్కి తగ్గింది.

కాల్పుల విరమణ, బందీల పరస్పర మార్పిడి కోసం ఈజిప్టు రాజధాని కైరోలో జరుగుతున్న చర్చలు ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా సాగుతున్నాయి. ఇజ్రాయిల్ విధించిన కొత్త షరతులను హమాస్ తిరస్కరించింది. ఐరాస భద్రతా మండలి, అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ చేసిన ప్రతిపాదనలకు ఇజ్రాయిల్ కట్టుబడి ఉండాలని హమాస్ డిమాండ్ చేసింది. లెబనాన్,




ఇజ్రాయిల్ మధ్య దాడులు ప్రతి దాడులతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఆదివారం రద్దు చేసిన తమ విమానాలను జోర్డానియన్ ఎయిర్‌లైన్స్ సోమవారం పునరుద్ధరించింది. గత 10 మాసాలుగా గాజాపై ఇజ్రాయిల్ అత్యంత పాశవికంగా సాగిస్తున్న దాడులను తాత్కాలికంగా నిలుపుచేసేందుకు జరుగుతున్న చర్చలు ఎలాంటి తుది ఒప్పందం కుదరకుండానే ముగిశాయి. గాజాలో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరితే తమ దాడులు ఆపేస్తామని హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రల్లా అంతకుముందు తెలిపారు. ఆదివారం నాటి ప్రతీకార చర్య సరిపోనట్లైతే తర్వాత స్పందించే హక్కును తాము అట్టిపెట్టుకున్నామని హమాస్ నేత ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు. ఇజ్రాయిల్, లెబనాన్‌లో పరిణామాలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించారు.

ఇజ్రాయిల్‌తో ఉద్రిక్తతలను పెంచాలనుకోవడం లేదు

ఇజ్రాయిల్‌తో ఉద్రిక్తతలను పెంచాలని భావించడం లేదని ఇరాన్ సోమవారం పేర్కొంది. టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ హత్యకు "ఖచ్చితమైన , నిశ్చయాత్మకమైన" ప్రతిస్పందన ఉంటుందని ఇరాన్ విదేశీ మంత్రి అబ్బాస్ అరాక్చీ తెలిపారు. ఇరాన్ ఉద్రిక్తతలను పెంచడానికి ప్రయత్నించదని, దాడులకు భయపడదని ఆ దేశ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాక్చీ ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటోనియో తజానీతో ఫోన్ సంభాషణలో పేర్కొన్నారు. టెహ్రాన్‌లో హమాస్ చీఫ్ ఇస్మాయిల్ హనియే జులై 31న ఇజ్రాయిల్ దాడిలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ చర్య ఇరాన్ భద్రత, సార్వభౌమాధికారాన్ని తీవ్రంగా ఉల్లంఘించడమేనని ప్రభుత్వ మీడియాలో అబ్బాస్ అరాక్చీ వ్యాఖ్యానించారు. హనియే హత్యకు బాధ్యత వహిస్తున్నట్లు ఇజ్రాయిల్ ప్రకటించలేదు.. తిరస్కరించలేదు.

రహదారులు రక్తసిక్తం

- **వేర్వేరు ప్రమాదాల్లో ఎనిమిది మంది మృతి**
- **గువ్వల చెరువు ఘాట్‌రోడ్డు ఐదుగురు.. దువ్వూరులో ముగ్గురు**



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ప్రజాశక్తి -చింతకొమ్మదిన్నె/చక్రాయపేట/దువ్వూరు

కడప జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఎనిమిది మంది మరణించారు. కారును కంటైనర్ ఢీకొనడంతో ఐదుగురు మరణించగా...అదుపు తప్పి కారు బోల్తా పడి ముగ్గురు మరణించారు. పోలీసుల వివరాల మేరకు..

కడప జిల్లా చక్రాయపేట మండలం కుప్పం పంచాయతీ కొండుగారిపల్లె వడ్డేపల్లి గ్రామానికి చెందిన వల్లెపు చిన్న వెంకటమ్మ (50) భర్త ఇటీవల మృతిచెందాడు. పెద్ద ఖర్మ కార్యక్రమం అనంతరం ఆమె తన తల్లి ఇల్లు గువ్వల చెరువుకు తన కోడలు పల్లెపు నాగలక్ష్మి (35), కుమారుడు గుజ్జుగారినాగయ్య (46), చక్రాయపేట మండల ఉప్పలవారిపల్లె గ్రామానికి చెందిన ఖాదుమియ్య (38)తో కలిసి కారులో బయలు దేరారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కంటైనర్ కారును వేగంగా ఢీకొట్టింది. అదుపుతప్పి కంటైనర్ లోయలో పడిపోయింది. ఈ ఘటనలో కారులోని నలుగురితోపాటు, కంటైనర్ డ్రైవర్ మహబూబ్ షరీఫ్ (38) అక్కడికక్కడే మృతిచెందారు. క్లీనర్ పరిస్థితి విషమంగా ఉంది.

కర్నూలుకు ఓ చెందిన కుటుంబం తమ పాప పుట్టెంట్రుకలు కోసం తుపాను వాహనంలో తిరుమలకు బయలుదేరారు. కడప జిల్లా దువ్వూరు మండలం చింతకుంట వద్దకు రాగానే వారి వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కియాన్‌సింగ్ (9నెలలు), భగత్‌సింగ్ (34), నాగలక్ష్మి (55) మృతిచెందారు. యుగంధర్, ఉమామహేశ్వరి, సాయి, కల్యాణ్‌సింగ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగ్రాతులను ప్రొద్దుటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య 3

ఇంజినీరింగులో 23,155 సీట్లు ఖాళీ

- ముగిసిన తుది దశ కౌన్సెలింగు 3

రైతుల ఆందోళనపై బిజెపి ఎంపి కంగనా చౌకబారు వ్యాఖ్యలు

- క్షమాపణలు చెప్పాల్సిందేనన్న ఎస్‌కెఎం

7

పాత పెన్షనే కావాలి

- **మరో పథకాన్ని అంగీకరించం**
- **30న నిరసన ప్రదర్శనలకు యుటిఎఫ్ పిలుపు**

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాత పెన్షన్ పథకం తప్ప మరే పెన్షన్ స్కీంను అంగీకరించబోమని యుటిఎఫ్ వెల్లడించింది. పాత పెన్షన్ పునరుద్ధరించాల్సిన కేంద్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేయకుండా యూనిఫైడ్ పెన్షన్ (యుపిఎస్)పేరుతో తీసుకురావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్‌ఎస్ ప్రసాద్ ఖండించారు. ఫెడరేషన్ ఆఫీస్ బేరర్ల సమావేశం సోమవారం ఫెడరేషన్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 30న అన్ని తాలూకా కేంద్రాల్లో ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దయెత్తున ఈ నిరసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎస్‌ను రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలా యుపిఎస్‌ని ముందుకు తీసుకురావడం తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు. సిపిఎస్ విధానం తప్ప మెరుగైన విధానం అంటూ యుపిఎస్‌ని అంకెల గారడీ చేసిందని విమర్శించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధం లేకుండా అన్ని రకాల సదుపాయాలు ఉండే పాత పెన్షన్ కంటే మరేదీ అంగీకారం కాదని స్పష్టం చేశారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న సిపిఎస్ స్థానంలో జిపిఎస్ విధానాన్ని ముందుకు తీసుకొచ్చిందని గుర్తుచేశారు.

దీనిని యుటిఎఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయన్నారు. ప్రస్తుత ప్రభుత్వ కాలంలో జిపిఎస్ చట్టం అమలు ముందుకొస్తే యుటిఎఫ్ తీవ్రంగా వ్యతిరేకించి నిరసన తెలిపిందన్నారు. దీని ఫలితగా తాత్కాలికంగా జిపిఎస్ చట్టాన్ని అబియన్స్‌లో పెట్టిందని వివరించారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ ఏదైనా పెన్షన్ ఉద్యోగుల హక్కు, భిక్షకాదని చెప్పిన సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నమైందని తెలిపారు. కార్పొరేట్‌లకు, షేర్ మార్కెట్ మాయాజాలానికి ఉపయోగపడే సిపిఎస్, యుపిఎస్ అమలు చేయడం ఆపి పాత పెన్షన్ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సిఆర్‌డిఎకు 29 మంది సర్వేయర్లు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి ప్రాంతంలో పనులు తిరిగి ప్రారంభమైన నేపథ్యంలో సర్వేయర్ల కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం పలువురు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే విలేజ్ సర్వేయర్లను డిప్యూటేషన్‌పై నియమించింది. ఈ మేరకు సోమవారం సర్వే సెటిల్‌మెంట్స్ అండ్ ల్యాండ్ రికార్డ్సు శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. డిప్యూటేషన్‌పై బదిలీ చేసిన వారిలో ఇబ్రహీంపట్నం, నందిగామ మండల సర్వేయర్లు శీలం భాను మంగేష్కర్, అదోతు చిన్నమ్ రామ్ బోయ నాయక్ ఉన్నారు. వీరితోపాటు గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సర్వేయర్లు 27 మందిని సిఆర్‌డిఎకు డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. సిఆర్‌డిఎ కమిషనరు వినతి మేరకు డిప్యూటేషన్‌పై బదిలీ చేసినట్లు సర్వే సెటిల్‌మెంట్ శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది.

బ్రాహ్మణ సంక్షేమానికి కృషి

- మంత్రి ఆనం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆలయాల అభివృద్ధికి, బ్రాహ్మణ సంక్షేమానికి టిడిపి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. దేవాదాయశాఖ అధికారులతో మంత్రి సోమవారం సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆలయాల పటిష్టత కోసం తాము అన్ని విధాలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు చేయడంతో పాటు బ్రాహ్మణ సంక్షేమానికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. సిఎం చంద్రబాబు దేవాదాయశాఖపై మంగళవారం సమీక్ష నిర్వహించనున్న నేపథ్యంలో ముందస్తుగా ఈ సమావేశం నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..
స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

గ్రామాల్లోనే భూ సమస్యలకు పరిష్కారం

- మంత్రి మండిపల్లి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గ్రామాల్లోనే భూ సమస్యలు పరిష్కారమవుతాయని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన భూ దోపిడీలు, ఆన్‌లైన్ ట్యాంపరింగ్‌లు, రికార్డుల తారుమారు వంటి సమస్యలను గ్రామాల్లోకి వచ్చే అధికారులకు తెలియజేయాలని వెల్లడించారు. టిడిపి కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల వినతులు, ఫిర్యాదులను మంత్రితో పాటు శాసనమండలి మాజీ చైర్మన్ ఎంఎ షరీఫ్, ఎమ్మెల్సీ అశోక్ బాబు, టిడిపి నేత శ్రీరామ్ చిన్నబాబు స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. గ్రామాల్లో వచ్చే నెల ఒకటి నుంచి రెవెన్యూ సదస్సులు జరుగుతాయని, ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విఆర్‌ఒ నుంచి కలెక్టరు వరకు అధికారులందరూ గ్రామాల్లోనే ఉండి బాధితుల నుంచి వినతులు స్వీకరించి సమస్యలను పరిష్కరిస్తారని వెల్లడించారు. ఎంబిఎ చదువుకునేందుకు సహాయం చేయాలని కోరిన రూపశ్రీ అనే వికలాంగ విద్యార్థినికి మంత్రి రూ.20 వేలు ఆర్థికసాయం చేశారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఆసుపత్రిలో మంటలు

- భయంతో పరుగులు తీసిన బాలింతలు, రోగులు

ప్రజాశక్తి-చింతపల్లి (అల్లూరి జిల్లా)

స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తుండగా ఒక్కసారిగా షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విద్యుత్ సహాయకుడు లక్ష్మణరావుకు గాయాలయ్యాయి. ఆసుపత్రిలో మంటలు చెలరేగడంతో పాటు దట్టంగా పొగ కమ్ముకోవడంతో ఆస్పత్రి సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేశారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆసుపత్రిలో పొగ కమ్ము కోవడంతో బాలింతలు, రోగులు భయంతో పరుగులు తీశారు. విద్యుత్ మరమ్మత్తు పనులు నిర్వహిస్తున్న విద్యుత్తు సహాయకుడు గుల్లేలి లక్ష్మణరావు తీవ్రంగా గాయపడ్డారు. విద్యుత్ షాక్ కు గురైన లక్ష్మణరావుకు స్థానిక ఆసుపత్రి వైద్యాధికారులు ప్రథమ చికిత్స అందించారు. ఇదిలా ఉండగా బ్రిటీష్ కాలం నాటి ఆసుపత్రి కావడంతో ప్రతిసారి విద్యుత్ మరమ్మత్తులకు గురవుతోంది. దీంతో మరమ్మత్తులు చేస్తూ విద్యుత్ సహాయకులు ప్రమాదాలకు గురవుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ అయిన ప్రదేశానికి సమీపంలోనే నవజాత శిశువుల వార్డు ఉంది. ఇటువంటి సంఘటనలు పునరావృతమయితే నవజాత శిశువుల వార్డులోని శిశువులతో పాటు బాలింతలు, సహాయకులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిచ్చుకలపై బ్రహ్మాస్త్రాలా?

- అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్లు
- కెజిబివిల్లో చిరుద్యోగుల తొలగింపు
- ఫీల్డ్ అసిస్టెంట్లపైనా వేధింపులు

ప్రజాశక్తి - సాలూరు (పార్వతీపురం మన్యం జిల్లా)

ప్రభుత్వాలు మారినప్పుడు నిరుద్యోగులపై ప్రతాపం చూపించడం అలవాటుగా మారుతోంది. పిచ్చుకలపై బ్రహ్మాస్త్రంలా అధికారపార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి పెంచి అవుట్ సోర్సింగ్, డైలీ వేజ్ ఉద్యోగుల తొలగింపు కొనసాగుతోంది. బతుకు తెరువు కోసం చిన్నా చితకా ఉద్యోగాలు చేసుకొనే వారి పొట్టకొట్టడం అధికార పార్టీ నాయకుల ఆధిపత్యానికి పరాకాష్టగా కనిపిస్తోంది. మన్యం జిల్లాలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంతవరకు కస్తూరిబాయి బాలికల పాఠశాలల్లో పనిచేస్తున్న ఏడుగురు చిరుద్యోగులను తొలగించారు. వీరిలో ఎక్కువ మంది గత ప్రభుత్వం హయాంలో నియమించబడిన వారు కూడా వుండొచ్చు. ప్రభుత్వం ఏదైనా నియామకమైన నిరుద్యోగిని అకారణంగా తొలగించడం వివాదాస్పదమవుతోంది. కేవలం వైసిపి ప్రభుత్వ హయాంలో అప్పటి నాయకుల సిఫార్సు మేరకు నియమించారనే సాకు తప్ప మరే ఇతర కారణాలూ లేకుండా జిల్లాలోని కస్తూరీ బాయి బాలికల పాఠశాల్లో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వారి స్థానాల్లో స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రులు సిఫార్సు చేసిన వారిని నియమించుకున్నారు. కేవలం రాజకీయ కారణాలతో ఇప్పటి వరకు పని చేస్తున్న వారిని తొలగించి కొత్త వారిని నియమించడం, దీనికి అధికారులు కూడా వంతపాడడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాక్ష్యాత్తూ గిరిజన సంక్షేమ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ఇలాకాలోనూ నలుగురు నిరుద్యోగులపై వేటు పడింది. మంత్రి అనుమతి లేకుండా నియోజకవర్గ పరిధిలో గల కస్తూరీ బాయి బాలికల పాఠశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించరు. ఖాళీగా వున్న ఉద్యోగాల్లో గాని, కొత్త గా మంజూరైన ఉద్యోగాల్లో గాని టిడిపి నాయకుల సిఫార్సు మేరకు నియమించుకుంటే ఎవరూ తప్పు పట్టలేరు. కానీ రెండు, మూడేళ్లుగా పని చేస్తున్న వారిని నోటిమాటతో తొలగించడం పెద్ద చర్చనీయాంశమవుతోంది. పాచిపెంట కస్తూరి బాయి బాలికల పాఠశాలలో పని చేస్తున్న కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్, నైట్ వాచ్ వుమెన్‌లను, మక్కువ కెజిబివిలో పని చేస్తున్న స్వీపర్,



డిఆర్‌ఒకు వినతిని అందజేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు (ఫైల్)

కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్‌లను తొలగించారు. ఒక మహిళా మంత్రిగా సాటి మహిళలనే సానుభూతి లేకుండా తొలగించడం పై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. తొలగించిన మహిళా ఉద్యోగుల్లో ఎక్కువ మంది పిల్లలతో ఉన్నవారే కావడం విశేషం. కొమరాడ కెజిబివిలో పని చేస్తున్న డైలీ వేజ్ కుక్, జోగింపేట కెజిబివిలో పని చేస్తున్న కంప్యూటర్ ఇన్ స్ట్రక్టర్, డైలీ వేజ్ కుక్‌లను స్థానిక ఎమ్మెల్యేల సిఫార్సు మేరకు తొలగించారు. అధికారపార్టీ నాయకుల ఒత్తిళ్ల కారణంగా నిరుద్యోగుల తొలగింపుపై కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన వారు జిల్లా కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశారు. జిల్లా కలెక్టర్ తమకు న్యాయం చేస్తారనే ఆశతో వారు ఎదురు చూస్తున్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపైనా వేధింపులు

మన్యం జిల్లా లో ఉపాధి హామీ చట్టంలో పని చేస్తున్న కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లపైనా రాజకీయ వేధింపులు మొదలయ్యాయి. గత ప్రభుత్వం హయాంలో కొన్ని చోట్ల కొంతమంది ఫీల్డ్ అసిస్టెంట్లు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని సాకు చూపి వారిపై వేటు వేయాలనే వ్యూహంతో అధికారపార్టీ నాయకులు ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా పరిశీలిస్తే ఉపాధి హామీ చట్టంలో అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తూ వస్తున్నది అధికారులే. వారిని కాపాడుకుంటూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కింద స్థాయి ఉద్యోగులను బలి చేయాలని చూడడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి. ఇప్పటికే మండలంలోని పెదపదం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ జరిగింది. అదేదారిలో మరికొంత మంది ఫీల్డ్ అసిస్టెంట్లపైనా విచారణ జరిపి చర్యలు తీసుకోవాలనే ఆలోచనలో అధికారపార్టీ నాయకులు వున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.

తొలగింపు అన్యాయం

- బివి రమణ, జిల్లా కన్వీనర్, కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

కాంట్రాక్టు, డైలీ వేజ్ పద్ధతిలో పని చేస్తున్న చిరుద్యోగులను అకారణంగా తొలగించడం అన్యాయం. కేవలం గత ప్రభుత్వ హయాంలో నియామకమయ్యారనే కారణంతో కెజిబివిల్లో చిరుద్యోగులను తొలగించడం, దీనికి అధికారులు మద్దతుగా నిలబడడం దారుణం. తొలగించినవారిని వెంటనే నియమించాలి.

ఏ తప్పూ చేయలేదు..

- మంచాల కుమారి, నైట్ వాచ్ వుమెన్,పాచిపెంట

2022 ఫిబ్రవరిలో కస్తూరిబా బాలికల పాఠశాలలో నైట్ వాచ్‌వుమెన్‌గా చేరాను. నాకు ఇద్దరు పిల్లలు. ఇదే నా కుటుంబానికి ఆధారంగా భావించాను. నేను ఏ తప్పూ చేయలేదు. నన్ను తొలగించి కొత్త మహిళను నియమించారు.

కంగనా రనౌత్ వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- ఎపి రైతు, కౌలురైతు సంఘాల డిమాండ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రైతు ఉద్యమంపై సినీ నటి, ఎంపి కంగనా రనౌత్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని, రైతులకు ఆమె బేషరతుగా క్షమాపణలు చెప్పాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. కంగనా రనౌత్‌పై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేసి శిక్షించాలని సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మొదటి నుంచి వివాదాస్పదంగా మాట్లాడటం ఆమెకు అలవాటుగా మారిందని, ప్రధాని మోడీ ఆమెను అదుపుచేయాలని వారు డిమాండ్ చేశారు. రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలన్నారు. కంగనా రనౌత్ వ్యాఖ్యలను ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు తీవ్రంగా ఖండించారు.

క్రీడాకారులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ



ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఈ నెల 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డిఎస్ఎ) ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ నిర్వహించారు. క్రీడాకారులతో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి, డిఎస్‌డిఒ ఎస్ఎ అజీజ్, డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ కోచ్‌లు ప్రతిజ్ఞ చేయించారు. "చురుకైన, ఆరోగ్యకరమైన జీవన శైలిని పెంపొందించడానికి నా ఫిట్నెస్, ఆరోగ్యం కోసం ప్రతిరోజు 30 నిమిషాలు కేటాయిస్తాను.. నా కుటుంబ సభ్యులు, ఇరుగుపొరుగు వారిని ఫిట్‌గా, ఆరోగ్యంగా ఉండేలా ప్రోత్సహిస్తాను" అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఎన్‌టిఆర్ జిల్లా కోచ్‌లు పి.రవికుమార్, పలు విభాగాల కోచ్‌లు పాల్గొన్నారు.



ఉక్రెయిన్ ఇంధన సదుపాయాలపై రష్యా క్షిపణి దాడులు

మాస్కో : రష్యా సరిహద్దుల్లో ఉక్రెయిన్ దాడులను తీవ్రతరం చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన మాస్కో ఎదురు దాడికి దిగింది. సోమవారం ఉక్రెయిన్ గ్రిడ్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులను ఉధృతం చేసింది. ఉక్రెయిన్ రాజధాని కీవ్‌తో సహా డ్నిప్రో, క్రోపివ్నిట్స్కి, విన్నిట్సియా, క్రివీ రిహ్, ఖార్కివ్ వంటి నగరాలపై దాడులను రష్యా కొనసాగించింది. ఉక్రెయిన్‌కు చెందిన కీలకమైన ఇంధన మౌలిక సదుపాయాలపై దాడిని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ ధ్రువీకరించింది. కచ్చితమైన, దీర్ఘ శ్రేణి ఆయుధాలతో ఈ దాడిని ప్రారంభించినట్లు తెలిపింది. నిర్ధేశించిన అన్ని లక్ష్యాలను చేధించినట్లు తెలిపింది. గత 24 గంటల్లో రెండు ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ స్టేషన్లు, నాలుగు ఫీల్డ్ మందుగుండు డిపోలు ధ్వంసమైనట్లు తెలిపింది. అలాగే, గత కొన్ని రోజులుగా జరిపిన దాడుల్లో ఉక్రెయిన్‌కు చెందిన 90 మంది సైనికులు మృతి చెందినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌కు చెందిన పలు సైనిక బృందాలపై ఈ దాడులు నిర్వహించినట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. దాదాపు 100 క్షిపణులు, 100 డ్రోన్లతో రష్యా దాడి చేసినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. తాజా ఘర్షణల్లో రష్యా చేసిన అతిపెద్ద దాడుల్లో ఒకటిగా తెలిపారు. అలాగే ఈ దాడి వలన ఉక్రెయిన్ ఇంధన రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని చెప్పారు. అయితే ప్రస్తుతం సౌకర్యాలను పునరుద్ధరిస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణ సిఎంఆర్‌ఎఫ్‌లో చీటింగ్..!

- వైద్యం చేయకుండానే నిధులు మాయం
- నకిలీ బిల్లులతో హాస్పిటల్స్ దందా
- రాష్ట్రవ్యాప్తంగా 28 దవాఖానలపై కేసు
- ఖమ్మంలోనే అధికం.. 10 ఆస్పత్రుల్లో గల్లంతు
- కొనసాగుతున్న సిఐడి విచారణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిరుపేద రోగుల సహాయార్థం ఉద్దేశించిన ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) సొమ్ము దుర్వినియోగం అయింది. రాష్ట్రవ్యాప్తంగా 28 ఆస్పత్రుల్లో వైద్యం చేయకుండానే నకిలీ బిల్లులతో నిధులు డ్రా చేసినట్టు ఆరోపణలు వస్తున్నాయి. వీటిలో 10 హాస్పిటల్స్ ఖమ్మం నగరానికి చెందినవే కావడం చర్చనీయాంశంగా మారింది. సంబంధిత హాస్పిటల్స్‌పై సిఐడి అధికారులు కేసులు నమోదు చేశారు. ఈ ఆస్పతులన్నీ ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్, వరంగల్, నల్లగొండ, మహబూబాబాద్, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాకు చెందినవిగా గుర్తించారు. వాటిపై విచారణ కొనసాగుతోంది. కొన్ని ఆస్పత్రుల్లో అయిన బిల్లుల కంటే అదనంగా రశీదులు సమర్పించి నిధులు నొక్కిసినట్టు తెలుస్తోంది.

గత ప్రభుత్వ హయాంలో ఈ నిధుల దుర్వినియోగం జరిగిన నేపథ్యంలో నూతనంగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకత కోసం సిఎంఆర్‌ఎఫ్ స్కీమ్ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించేలా కొద్దిరోజుల క్రితం మార్పులు చేసింది.

నకిలీ బిల్లులతో నిధులు డ్రా

రాష్ట్ర సచివాలయంలో సిఎంఆర్‌ఎఫ్ విభాగంలో సెక్షన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న డిఎస్‌ఎన్ మూర్తి ఫిర్యాదు మేరకు ఈ విచారణ కొనసాగుతోంది. నకిలీ బిల్లులతో నిధులు డ్రా చేసిన వ్యవహారంలో ఎవరి ప్రమేయం ఉంది? ఆ హాస్పిటల్‌లో పనిచేసే సిబ్బంది పేరుతో ఏమైనా డ్రా చేశారా? లేదంటే హాస్పిటల్ యాజమాన్యం కండ్లు గప్పి సిబ్బందే ఏమైనా నకిలీ బిల్లులు సృష్టించారా? బయటి వ్యక్తులను ఇందు కోసం వినియోగించుకున్నారా? ఇందు కోసం ప్రత్యేకంగా దళారులు ఏమైనా ఉన్నారా? లేదంటే గత ప్రభుత్వంలోని నాయకులే హాస్పిటల్స్ యాజ మాన్యంతో కుమ్మక్కై ఈ దందాకు పాల్పడ్డారా? ఈ దందా కోసం ఏమైనా ప్రత్యేకంగా ముఠాలు పనిచేశా యా..? అనే కోణంలో సిఐడి దర్యాప్తు చేస్తోంది. ఆరోపణ లు వచ్చిన ఈ 28 ఆస్పత్రుల యజమానులతో పాటు సిబ్బందిని కూడా విచారించేందుకు సిఐడి రంగంలోకి దిగింది. అయితే ఈ వ్యవహారంపై తెలంగాణ సిఐడి అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడం గమనార్హం.

ఫిర్యాదులోని హాస్పిటల్స్ ఇవే

సిఐడికి అందిన ఫిర్యాదు ప్రకారం రాష్ట్రవ్యాప్తంగా 28 హాస్పిటల్స్‌కు చెందిన 500 దరఖాస్తులపై అనుమానాలు నెలకొన్నాయి. ఖమ్మంలోని శ్రీకర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, గ్లోబల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి, డాక్టర్ జేఆర్ ప్రసాద్ హాస్పిటల్, శ్రీ వినాయక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, శ్రీ సాయి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్, వైష్ణవి హాస్పిటల్, సుజాత హాస్పిటల్, న్యూ అమృత హాస్పిటల్, ఆరెంజ్, మేఘశ్రీ హాస్పిటల్స్ ఉన్నాయి. వీటితో పాటు రంగారెడ్డి జిల్లాకు చెందిన మీర్‌పేటలోని హిరణ్య హాస్పిటల్, బీఎన్‌రెడ్డి నగర్‌లోని శ్రీ రక్ష హాస్పిటల్, హస్తినాపురంలోని డెల్టా హాస్పిటల్, సాగర్ రింగ్‌రోడ్డులోని ఎంఎంఎస్ హాస్పిటల్, రామంతాపూర్‌లోని ఏడీఆర్ఎం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, కొత్తపేటలోని ఎంఎన్‌వీ ఇందిరా మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, బైరామల్‌గూడలోని శ్రీసాయి తిరుమల హాస్పిటల్, హైదరాబాద్ ఐఎస్ సదన్‌లోని అరుణశ్రీ మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్, సైదాబాద్‌లోని శ్రీ కృష్ణ హాస్పిటల్, జనని హాస్పిటల్, నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని నవీన మల్టీ స్పెషాలిటీ, మహేశ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్, నల్లగొండ రైల్వేస్టేషన్ రోడ్డులోని అమ్మ హాస్పిటల్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా జమ్మికుంటలోని సప్తగిరి హాస్పిటల్, పెద్దపల్లిలోని శ్రీసాయి హాస్పిటల్, ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండలోని రోహిణి మెడికల్ ప్రయివేట్ లిమిటెడ్, మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీ సంజీవని, సిద్ధార్థ హాస్పిటల్స్ ఫిర్యాదులో ఉన్నాయి.

ఏడాది క్రితం మంచిర్యాల జిల్లాలోనూ..

ఏడాదిన్నర క్రితం మంచిర్యాల జిల్లాలోనూ ఇలాంటి కుంభకోణం వెలుగు చూసింది. దీనిపై అక్కడి సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. సిఎంఆర్‌ఎఫ్ నిధులు డ్రా చేసేందుకు లేని దవాఖానలను కూడా నిందితులు సృష్టించారు. ఆ జిల్లాలో ఓ మహిళ పేరుతో చెక్ మంజూరైంది. దానిని తీసి తనకు ఇవ్వాలని ఓ ప్రజాప్రతినిధి ఆమెపై ఒత్తిడి చేశారు. దీనిపై ఆమె ఆరా తీయడంతో అసలు విషయం బయటకు వచ్చింది. దీనిపై అప్పటి నుంచే సిఐడి దృష్టి సారించింది. ఈ క్రమంలో 500 దరఖాస్తులపై అనుమానాలు ఉన్నట్టు గుర్తించింది. ఆస్పత్రి సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వారి అనుచరుల ప్రమేయంతోనే రూ.కోట్లలో ఈ స్కామ్ జరిగినట్టు తెలుస్తోంది. అయితే సిఐడి అధికారికంగా దీన్ని ధ్రువీకరించాల్సి ఉంది.

ఉద్యోగులను మోసగించడానికే!

- యుపిఎస్‌పై సిఐటియు విమర్శ
- పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్

న్యూఢిల్లీ : ఉద్యోగులను మోసగించే మరో బూటకపు ప్రయత్నమే ఈ ఏకీకృత పెన్షన్ పథకం (యుపిఎస్) అని సిఐటియు తీవ్రంగా విమర్శించింది. పాత పెన్షన్ పథకాన్ని (ఒపిఎస్) తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఈ నెల 24న కేంద్ర కేబినెట్ ఆమోదించిన యుపిఎస్ పథకాన్ని సిఐటియు తీవ్రంగా నిరసించింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఒక ప్రకటన చేశారు. పాత పెన్షన్ పథకం నాన్ కంట్రిబ్యూటరీ, పైగా సెంట్రల్ సివిల్ సర్వీస్ రూల్స్ -1972 ప్రకారం ప్రస్తుత పెన్షన్‌కు హామీ కల్పించబడుతుంది. 2004లో వాజ్‌పేయి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం జాతీయ పెన్షన్ పథకాన్ని (ఎన్‌పిఎస్) జిఓ ద్వారా రహస్యంగా తీసుకువచ్చింది. 2004 జనవరి 1 నుండి రిక్రూట్ అయినవారికి ఇది వర్తిస్తుందని పేర్కొంది. ఆరోజు నుండీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర కార్మిక సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తున్నాయి. కొత్త పెన్షన్ పథకాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని కోరుతూ వారు పోరాట బాట చేపట్టారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ యాక్ట్ - 2013 ఎన్‌పిఎస్‌కు చట్టబద్ధమైన ప్రాతిపదిక కల్పించేందుకు వీలుగా 2014 ఫిబ్రవరిలో నోటిఫై చేసింది.

పాత పెన్షన్ పథకం (ఒపిఎస్) పునరుద్ధరించాలని కోరుతూ ప్రభుత్వ ఉద్యోగులు అనూహ్యమైన రీతిలో చేసిన పోరాటాలు, అటువంటి పోరాటాలకు కేంద్ర కార్మిక సంఘాలు, సమాఖ్యల సంయుక్త వేదిక మద్దతునివ్వడంతో బిజెపి ప్రభుత్వం ఎన్‌పిఎస్‌కు కట్టుబడాలన్న వైఖరిని మార్చుకోవాల్సి వచ్చింది. కానీ యుపిఎస్ పేరుతో ఉద్యోగులకు కేంద్రం ఇవ్వచూపిన ప్యాకేజీని చూస్తుంటే ప్రభుత్వ ఉద్యోగులకు పెన్షన్ రూపంలో తమకు రావాల్సిన చట్టబద్ధమైన బకాయిలను రాకుండా చేయడానికి అదే మోసపూరితమైన కుట్ర పన్నినట్లు స్పష్టమవుతోంది. అనేక రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తిరిగి ఒపిఎస్‌కు మళ్ళాయి. పిఎఫ్‌ఆర్‌డిఎకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చెల్లించే కాంట్రిబ్యూషన్‌లో తమ వాటాను రాష్ట్ర ప్రభుత్వాలకే తిరిగి ఇవ్వాలంటూ కోరుతున్నారు. ఒపిఎస్‌కు మళ్లిన రాష్ట్ర ప్రభుత్వాలు చేస్తున్న అటువంటి అభ్యర్థనలన్నింటినీ మోడీ సర్కార్ తిరస్కరించింది. ఉద్యోగులు, కార్మిక సంఘాలు అవిశ్రాంతంగా చేసే పోరాటాలను కేంద్రం వ్యతిరేకిస్తోంది. అందువల్లే మోసపూరితమైన యుపిఎస్ పేరుతో మోడీ నేతృత్వంలోని ఎన్‌డి కూటమి ఈ బూటకపు ప్రయత్నాన్ని చేపట్టింది, ఎన్‌పిఎస్‌ను అనేక ఉద్యోగ సమాఖ్యలు



బహిష్కరించాయి. ఎన్‌పిఎస్‌లో మార్పులను అధ్యయనం చేయడానికి ఆర్థిక శాఖ కార్యదర్శి టి.వి.సోమనాథన్ కమిటీ చేసిన సిఫార్సులను ఈ బూటకపు యుపిఎస్ ప్రయత్నానికి వాడుకున్నారు. ఎన్‌పిఎస్, కత్తిరించబడిన ఒపిఎస్‌ల మిశ్రమమే యుపిఎస గా వుంది. దీన్ని కేంద్ర కేబినెట్ ఈ నెల 24న ఆమోదించింది.

ఆశ్రిత పెట్టుబడిదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు నయా ఉదారవాద పంథాను అనుసరించే మోడీ నేతృత్వంలోని ఎన్‌డి ప్రభుత్వం, లబ్ధి చేకూర్చే కొన్ని మార్పులను చేర్చి ఈ యుపిఎస్‌తో ముందుకు వచ్చింది. ప్రభుత్వం అదనంగా ఇచ్చే 4.5శాతం కంట్రిబ్యూషన్, 31-7-2024నాటికి ఎన్‌పిఎస్ కింద గల 99,77,165 మంది ఉద్యోగులు షేర్ మార్కెట్‌లో రూ.10,53,850 కోట్ల మేరకు పెట్టే పెన్షన్ నిధుల పెట్టుబడుల (అసెట్ అండర్ మేనేజ్‌మెంట్-ఎయుఎం)కు పెంపు మాత్రమే.

జిపిఎస్ (గ్యారంటీడ్ పెన్షన్ స్కీమ్) పేరుతో ఎన్‌పిఎస్ స్థానంలో యుపిఎస్ మాదిరిగా లేదా అంతకన్నా కొంత మెరుగైన పథకాన్ని గత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. కనీసం పదేళ్ల సర్వీస్ గల వారు, పదవీ విరమణ చేయడానికి ముందు నెల జీతంలో 50శాతం మొత్తాన్ని పెన్షన్, 40శాతం యాన్యూటీ కొనుగోలుగా నిర్వచించారు. దీనిని ఎపి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ తీవ్రంగా తిరస్కరించారు. ఒపిఎస్ మినహా మరేదీ ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం అటువంటిదే లేదా అంతకన్నా తక్కువ లబ్ధి కలిగించే పథకాన్ని, ఎన్‌పిఎస్‌లో కొన్ని మార్పులతో తీసుకువచ్చింది. మెజారిటీ ఉద్యోగులు దీన్ని కూడా నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి. ఒపిఎస్ కన్నా తక్కువగా మరి దేన్నీ ఆమోదించేది లేదని చెప్పాలి.

ఉద్యోగుల నుండి 10శాతం కంట్రిబ్యూషన్లు, ప్రభుత్వం నుండి ప్రస్తుతమున్న 14శాతానికి బదులుగా 18,5శాతానికి పెంచిన కంట్రిబ్యూషన్ల ప్రాతిపదికన యుపిఎస్‌ను రూపొందించారు. ఎన్‌పిఎస్‌లో వినియోగదారుడు 60శాతం మొత్తాన్ని తీసేసుకోవచ్చు, మిగిలిన 40శాతం మొత్తాన్ని యాన్యుటీలో పెట్టుబడిగా పెట్టి పెన్షన్‌గా తీసుకోవచ్చు. యుపిఎస్ కింద మొత్తం పెన్షన్ నిధి అంతా ప్రభుత్వానికి ముందుగానే వెళ్లిపోతుంది. అందుకు అనుగుణంగా సర్వీసు పూర్తి చేసిన ప్రతి ఆరు మాసాలకు ఒకసారి ఉద్యోగికి పది శాతం ప్రభుత్వం ఇవ్వాల్సి వుంటుంది. అంటే బేసిక్ పే ప్లస్ డిఎగా ఇవ్వాలి. 25 ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగికి 5నెలల వేతన ప్రయోజనాలు, పదేళ్ల సర్వీసు పూర్తి చేసిన వారికి రెండు మాసాల వేతన ప్రయోజనాలను రిటైరైన తర్వాత ఇస్తారు. గ్రాట్యుటీకి అదనపు ప్రయోజనంగా ఇది వుంటుంది.

యుపిఎస్‌లో, సాధారణ స్థాయిలో 25ఏళ్ల సర్వీసు పూర్తితో, 60 ఏళ్లకు రిటైరైతే సదరు ఉద్యోగి 12 నెలల సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని పెన్షన్‌గా పొందుతాడు. ఇది 1-4-2025 నుండి అమల్లోకి వస్తుంది. అంటే 31-3-2025నాడు రిటైరైన వారికి ఇది వర్తిస్తుంది. దీని కన్నా ముందు రిటైరైన వారికి ఇది వర్తించదు. ఒపిఎస్‌లో పదేళ్ల సర్వీసు వుంటే చివరి నెల వేతనంలో 50 శాతం పెన్షన్‌గా వస్తుంది. 20ఏళ్ల సర్వీసు పూర్తి చేసిన ఉద్యోగి స్వచ్ఛంద పదవీ విరమణ చేస్తే 50శాతం పెన్షన్‌గా వస్తుంది.

25ఏళ్ల కన్నా తక్కువ సర్వీసు చేసిన ఉద్యోగి యుపిఎస్‌లో తక్కువ పెన్షన్ పొందుతారు. 20ఏళ్ల సర్వీసు కలిగిన ఉద్యోగి 12నెలల సగటు బేసిక్ పేలో కేవలం 40శాతం మాత్రమే పెన్షన్‌గా పొందుతాడు. పదేళ్ల సర్వీసు చేసిన ఉద్యోగులు కేవలం సగటు బేసిక్ పేలో 20శాతం మాత్రమే పెన్షన్‌గా పొందుతారు. 25ఏళ్ల కన్నా తక్కువగా, పదేళ్ల సర్వీసు వరకు దామాషా పెన్షన్ కేసులో రూ.10వేలు కనీస పెన్షన్‌గా ఇవ్వాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ఒపిఎస్‌లో కనీస పెన్షన్ రూ.9వేలు ప్లస్ డిఎ (1-4-2025 నాటికి 57శాతంగా వుంటుంది. అంటే రూ.5130), అంటే కనీస పెన్షన్ 1-4-2025 నాటికి రూ.14,130 అవుతుంది. అందువల్ల, ప్రతిపాదిత రూ.10వేల పెన్షన్ ఒపిఎస్‌లో సగంగా వుంటోంది. పదేళ్ల సర్వీసు కన్నా తక్కువ వున్న వ్యక్తి, పదవీ విరమణ వయస్సు వచ్చే సమయానికి ఆ ఉద్యోగి ఏ పెన్షన్‌కూ అర్హుడు కాడు.

యుపిఎస్ కుటుంబ పెన్షన్ కింద 60శాతం పెన్షన్ అంటే 50శాతంలో 60శాతం. అంటే 25ఏళ్ల సర్వీసు కలిగిన వ్యక్తి రిటైరైతే చివరి వేతనంలో 30శాతం అని అర్థం. కనీస పెన్షన్ రూ.10వేలు కలిగిన ఉద్యోగులకు అందులో 60శాతం వుంటుంది. అంటే రూ.6వేలు వస్తుంది. కనీస పెన్షన్ రూ.10వేలు అనేది కేవలం పదవీ విరమణ చేసే వారికి మాత్రమే వర్తిస్తుంది. అది కుటుంబ పెన్షన్‌గా రాదు. కానీ పెన్షనర్ రిటైరైన తర్వాత ఏడేళ్ళు లోగా లేదా 67ఏళ్ళ వయస్సుకు ముందుగా మరణిస్తే ఆ వ్యక్తి చివరి వేతనంలో 50శాతం కుటుంబ పెన్షన్‌గా ఒపిఎస్ కింద వస్తుంది. ఆ తర్వాత కుటుంబ పెన్షన్ చివరి వేతనంలో 30శాతంగా వుంటుంది. 1-4-2025 నాటికి కనీస పెన్షన్ రూ.14,130గా వుంటుంది. యుపిఎస్ కనీస కుటుంబ పెన్షన్ మాత్రం రూ.6వేలుగానే వుంటుంది.

సర్వీసులో వున్న ఉద్యోగుల విషయంలో వినియోగదారుల సూచీ ప్రాతిపదికన డిఎ లేదా డిఆర్ అస్యూర్డ్ పెన్షన్ లేదా కనీస పెన్షన్ లేదా కుటుంబ పెన్షన్‌గా ఇవ్వబడుతుంది. 1-4-2025 నుండి కొత్త బేస్ ఇండెక్స్ ప్రారంభిస్తారా లేక సర్వీసులో వున్నవారికి, ఒపిఎస్ పెన్షనర్లకు అదే శాతం డిఎ లేక డిఆర్ మంజూరు చేస్తారా అనేది ఇంకా వివరించలేదు. ఒపిఎస్‌లో పెన్షనర్ లేదా కుటుంబ పెన్షనర్ 80 ఏళ్ల వయస్సు పూర్తి చేసుకుంటే అదనంగా 20శాతం పెన్షన్ 85ఏళ్లు పూర్తి చేసుకుంటే 30శాతం, 90ఏళ్లు పూర్తి చేసుకుంటే 40శాతం, 95ఏళ్లు పూర్తి చేసుకుంటే 50శాతం, వందేళ్లు పూర్తి చేసుకుంటే వంద శాతం ఇస్తారు. అదనపు పెన్షన్‌కు అదే డిఎ కూడా ఇస్తారు. యుపిఎస్‌లో ఈ అదనపు పెన్షన్ అందుబాటులో లేదు. వేతన కమిషన్ సిఫార్సులు అమలు జరిగినప్పుడల్లా ఒపిఎస్‌లో పెన్షన్, కుటుంబ పెన్షన్, కనీస పెన్షన్ సవరించబడుతుంది. యుపిఎస్‌లో ఇలాంటి హామీ లేదు. పెన్షన్ కమ్యూటేషన్ అంటే 40శాతం పెన్షన్‌ను ముందుగానే తీసుకోవడం ఒపిఎస్‌లో వుంది. యుపిఎస్‌లో లేదు. మరణించిన లేదా ఇన్‌వాలిడ్‌గా మారిన ఉద్యోగులందరూ ఎన్‌పిఎస్‌లో అన్‌ఫిట్ అవుతారు. ఒపిఎస్‌లో వారికి ఇప్పటికే వర్తిస్తుంది. ఉద్యోగులు యుపిఎస్‌ను లేదా ఎన్‌పిఎస్‌ను ఎంచుకోవచ్చు. ఒకసారి ఎంచుకుంటే ఇక అదే ఖరారవుతుంది.

యుపిఎస్‌లో ఇంకా చాలా లొసుగులు, లోపాలు వుండవచ్చు, యుపిఎస్ పూర్తి వివరాలు బయటకు వచ్చిన తర్వాత అవి తెలియవచ్చు. అందువల్ల యుపిఎస్‌ను సిఐటియు తీవ్రంగా నిరసిస్తోంది. నాన్ కంట్రిబ్యూటరీ డిఫైన్డ్ అస్యూర్డ్ పాత పెన్షన్ పథకాన్ని పునరుద్ధరించాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని పోరాడే ప్రభుత్వ ఉద్యోగులకు సంపూర్ణ మద్దతునిస్తామని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆ ప్రకటనలో తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి (అనంతపురం జిల్లా)

అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా గుత్తి రైల్వే జంక్షన్ ఉప్పార్లపల్లి- పగిడిరాయి గ్రామాల మధ్య సోమవారం ఉదయం చోటుచేసుకుంది. జిఆర్‌పిఎఫ్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామానికి చెందిన వారాది పెద్ద పాపన్న (54) తనకున్న ఆరు ఎకరాల పొలంలో వేరుశనగ, కంది పంటలను సాగు చేస్తున్నారు. పంటల సాగు కోసం బ్యాంకులు, ప్రయివేటు వ్యక్తుల వద్ద దాదాపు రూ.5 లక్షల వరకు అప్పు చేశారు. వర్షాభావం వల్ల పంటలు చేతికందకుండా పోయాయి. దీంతో అప్పులు తీర్చడం కష్టమవ్వడంతో తీవ్ర మనస్తాపం చెందారు. ఈ క్రమంలో ఉప్పర్లపల్లి గ్రామ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. పాపన్నకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. ఘటన స్థలాన్ని జిఆర్‌పిఎఫ్ ఎస్‌ఐ నాగప్ప, కానిస్టేబుల్ వాసు, ఆర్‌పిఎఫ్ అధికారులు పరిశీలించారు.

నెల్లూరులో రౌడీ షీటర్ దారుణ హత్య

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరులో ఓ రౌడీషీటర్ దారుణ హత్యకు గురయ్యారు. ఈ సంఘటన బాలాజీనగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని రామలింగాపురం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జనశక్తినగర్ ప్రాంతానికి చెందిన గుంజి రవి (40) తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నాడు. ఓ హత్య కేసులో జైలుకెళ్లి ఇటీవలే విడుదలయ్యారు. నెల్లూరుకు వచ్చిన రవిని పాతకక్షల నేపథ్యంలో నగరానికి చెందిన చింటూ, సాయి, వెంకటరమణ మరి కొందరు కత్తులతో పొడిచి హతమార్చారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

శ్రీసిటీకి 'బ్రాండ్ ఆఫ్ ది డికేడ్' అవార్డు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం (తిరుపతి)

శ్రీసిటీ మరో ప్రతిష్టాత్మక అవార్డును సొంతం చేసుకుంది. హెరాల్డ్ గ్లోబల్ ఇంటర్నేషనల్ బ్రాండ్ అడ్వర్టైజింగ్ రీసెర్చ్ అండ్ కన్సల్టింగ్ (బిఎఆర్‌సి) ముంబైలో నిర్వహించిన గోల్‌ఫెస్ట్ కాన్‌క్లవ్ 2024లో ఈ దశాబ్దపు అత్యుత్తమ బ్రాండ్ (బ్రాండ్ ఆఫ్ ది డికేడ్) అవార్డుతో శ్రీసిటీని సత్కరించింది. దశాబ్ద కాల పారిశ్రామిక వృద్ధికి గుర్తింపుగా ఈ అవార్డు దక్కినట్లు శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ (మార్కెటింగ్) ఆర్ శివశంకర్, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ తెలిపారు. అత్యుత్తమ వ్యాపార పద్ధతుల పట్ల తమ నిబద్ధతకు ఇది అద్దం పడుతుందని శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అన్నారు.

పర్యాటక అభివృద్ధికి కృషి : మంత్రి దుర్గేష్

- పిచ్చుకలంకలో ఒబెరాయ్ ప్రతినిధుల పర్యటన

ప్రజాశక్తి - ఆత్రేయపురం(డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా)

సహజ సిద్ధమైన ప్రకృతి రమణీయత గల పిచ్చుకలంకను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. డాక్టర్ బిఆర్ అంబద్కేర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో ఒబెరాయ్ గ్రూపు ప్రతినిధులు ఆర్.శంకర్, నవీన్‌గోస్వామిలతో కలిసి మంత్రి దుర్గేష్ సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యాటక రంగం అభివద్ధిలో భాగంగా ఒబెరాయ్ హోటళ్ల ప్రతినిధులు క్షేత్రస్థాయి పరిశీలనకు వచ్చారన్నారు. ఇటీవల విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో ఒబెరాయ్ ప్రతినిధులు పర్యాటక అభివృద్ధిపై చర్చించారని తెలిపారు. ఆ సమయంలో పిచ్చుకలంక గురించి వారి వద్ద ప్రస్తావించానని చెప్పారు. దీంతో ఒబెరాయ్ బృందం పిచ్చుకలంకకు సందర్శన నిమిత్తం వచ్చిందని తెలిపారు. ఇక్కడ రిసార్ట్స్ నిర్మిస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కోనసీమ జిల్లాలో కేరళను తలపించే విధంగా ప్రకృతి అందాలు ఉన్నాయని తెలిపారు. ఇక్కడ కడియం నర్సరీ ఆసియాలోనే ద్వితీయ స్థానాన్ని ఏర్పరచుకుందన్నారు. ఈ ప్రాంతంలో పర్యాటక రంగం అభివద్ధికి ఒబెరాయ్ సంస్థ భాగస్వామ్యం అవుతుందని వెల్లడించారు. వారి వెంట ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, బండారు సత్యానందరావు, కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, పర్యాటక శాఖ ప్రాంతీయ సంచాలకులు వి.స్వామినాయుడు, జిల్లా పర్యాటక అభివృద్ధికారి పి.వెంకటాచలం ఉన్నారు.



ఒబెరాయ్ ప్రతినిధులతో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

మదనపల్లెలో సిఐడి అధికారులు

- ఫైళ్ల దగ్ధం కేసులో విచారణ ప్రారంభం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ (అన్నమయ్య జిల్లా)

అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్ కలెక్టరేట్లో ఫైళ్ల దగ్ధం కేసును విచారించేందుకు సిఐడి అధికారులు రంగంలోకి దిగారు. కేసు విచారణలో భాగంగా సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌కు వచ్చారు. అడిషనల్ ఎస్‌పి రాజ్ కమల్, సిఐడి డిఎస్‌పి వేణుగోపాల్, మదనపల్లె డిఎస్‌పి కొండయ్య నాయుడు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. నిమ్మనపల్లి విఆర్‌ఎ రమణయ్యతో పాటు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గౌతమ్ తేజ్‌లను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. మంగళవారం ఉదయం 11.30 గంటలకు మదనపల్లి సబ్ కలెక్టర్ కార్యాలయానికి సిఐడి చీఫ్, అడిషనల్ డిజి రవిశంకర్ కూడా వస్తున్నట్లు సమాచారం. ఫైళ్ల దగ్ధం కేసు మరుగున పడిపోయిందనుకున్న తరుణంలో సిఐడి అధికారులు మళ్లీ విచారణ ప్రారంభించడంతో నిందితులతోపాటు ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురి నేరస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటివరకు ఈ కేసులో మదనపల్లె పాత ఆర్‌డిఒలు మురళి, హరి ప్రసాద్, మదనపల్లి మాజీ ఎమ్మెల్యే నవాజ్‌బాష, వైసిపి నాయకులు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి అనుచరుడు రైస్‌మిల్ మాధవరెడ్డి, రిటైర్డ్ పోస్టల్ రమణారెడ్డిలతో పాటు మరికొందరిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే.

వలస కార్మికులకు భద్రత కరువు : సిఐటియు

- పుష్పిత్ కంపెనీలో వరుస ఘటనలపై నిరసన

ప్రజాశక్తి - ఏర్పేడు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం మేర్లపాక పంచాయతీ పుష్పిత్ కంపెనీలో గతనెల జులై 19న ఝార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వెల్డింగ్ కార్మికుడు మృతిచెందిన ఘటన మరువక ముందే బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు పది రోజుల క్రితం అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం పట్ల పుష్పిత్ కర్మాగారం ముందు సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ.. పుష్పిత్ కంపెనీలో 15 రోజుల వ్యవధిలోనే రెండు ఘటనలు జరిగాయని, బీహార్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు అనుమానాస్పద రీతిలో మృతిచెందడాన్ని ప్రశ్నించారు. సమగ్ర విచారణ చేపట్టి, మృతుని కుటుంబానికి రూ. కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియో ఇవ్వాలని డిమాండ్ చేశారు. వలస కార్మికులకు భద్రత కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు గంధం మణి, పెనగడం గురవయ్య, రంగయ్య, ధర్మారెడ్డి, విలివేంద్రం పాల్గొన్నారు.

డ్రోన్స్ రంగంలోకి రామ్ ఇన్ఫో

హైదరాబాద్ : కిసాన్ డ్రోన్స్ ప్రయివేటు లిమిటెడ్‌ను ప్రారంభించినట్లు టెక్నాలజీ కంపెనీ రామ్‌ఇన్ఫో లిమిటెడ్ తెలిపింది. ఇది వ్యవసాయ రంగం వైపు ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొంది. "అధునాతన సాంకేతికత ద్వారా వ్యవసాయ రంగానికి సాధికారత కల్పించడం కోసం మేం చేస్తున్న ప్రయాణంలో ఒక ముఖ్యమైన మెట్టు కిసాన్ డ్రోన్స్ ప్రైవేట్ లిమిటెడ్. వచ్చే రెండేళ్లలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశాలో 100 కేంద్రాలను ప్రారంభించాలని ఈ ఇన్షియేటివ్ యోచిస్తోంది." అని రామ్ ఇన్ఫో ఎండి ఎల్ శ్రీనాథ్ రెడ్డి తెలిపారు.

కోనో కార్పస్ చెట్లను కొట్టేయొద్దు

హైకోర్టులో పిల్ దాఖలు

ప్రజాశక్తి-అమరావతి

రాష్ట్రంలోని కోనో కార్పస్ చెట్లలను కొట్టేయకుండా ఉత్తర్వులివ్వాలంటూ హైకోర్టులో పిల్ దాఖలైంది. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు లక్ష్మణరెడ్డి, నాగార్జున యూనివర్సిటీ బోటనీ అండ్ ఎన్విరాన్మెంటల్ సైన్సెస్ రిటైర్డు ప్రొఫెసర్ కె బయపురెడ్డి, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ప్లాంట్ ప్రొఫెసర్ కె రామచంద్రారెడ్డి పిల్ వేశారు. ఇందులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, నెల్లూరు, కాకినాడ జిల్లాల కలెక్టర్లను ప్రతివాదులుగా చేర్చారు. 'కోనో కార్పస్ మొక్కల వల్ల మానవాళికి, పర్యావరణానికి ముప్పు ఉందో లేదో తేల్చేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటుకు ఉత్తర్వులు ఇవ్వాలి. ఆ చెట్ల వల్ల నష్టమని శాస్త్రీయంగా నిరూపణ కాలేదు. ఆ చెట్లపై దుష్ప్రచారం జరుగుతోంది. అనేక దేశాల్లో ఈ మొక్కలు ఉన్నాయి. ప్రతికూల వాతావరణంలో కూడా వాటిని నిర్వహించేందుకు వీలుంటుంది. కాకినాడ జిల్లాలో 4,600 లకుపైగా చెట్లను కొట్టేశారు. నెల్లూరు జిల్లాలోనూ అదే పరిస్థితి ఉంది' అని పిల్‌లో పేర్కొన్నారు.

ఇ-క్రాప్ నమోదులో జాప్యం

- ఎపి కౌలు రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇ-క్రాప్ నమోదులో జాప్యాన్ని నివారించాలని, విఆర్‌ఒ, విఎస్‌ను కూడా ఇ-క్రాప్ నమోదుకు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. పంట వేసిన ప్రతి రైతు, కౌలు రైతు పొలాల్లోకి వెళ్లి వారి ఫొటోలు తీసి ఇ-క్రాప్ నమోదు చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఈ మేరకు కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయశాఖ విఎఎలను ఇందుకోసం నియమించిందని, కాని ఫీల్డ్‌లో ఇ-పంట నమోదు సమయంలో యాప్ సరిగ్గా పనిచేయకపోవడం, మహిళా ఉద్యోగులు ఫీల్డ్‌కు వెళ్లడానికి సరైన సౌకర్యం లేకపోవడం, రీసర్వే పూర్తయిన గ్రామాల్లో ల్యాండ్ డేటా ఇ-పంట యాప్‌లో పూర్తిగా రాకపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. అంతేకాకుండా యాప్‌లో తక్కువ విస్తీర్ణం చూపిస్తోందని పేర్కొన్నారు. జియో ఫెన్సింగ్ మాగాణిలో 500 మీటర్లు, మెట్టలో 250 మీటర్లకు పెంచాలని, లేనిపక్షంలో రైతులు, కౌలు రైతులు ఇ-పంట నమోదుకాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఉదయం పూట సర్వర్, యాప్ సరిగ్గా పనిచేసేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇ-క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయ్యే వరకు సమయం ఇవ్వాలని, విఎఎలకు సహాయంగా గతంలో ఇ-పంట ఇకెవైసికి విత్తనాల పంపిణీకి ఎలా ఐతే మహిళా కార్యదర్శులు, వెల్ఫేర్ కార్యదర్శులను కేటాయించారో అదే విధంగా ప్రస్తుతం కూడా వారిని కేటాయించి ఈ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. విఆర్‌ఒ, విఎస్‌లు పంట నమోదుకు పూర్తి సహకారం అందించే విధంగా ప్రభుత్వం ఆదేశించాలని వారు విజ్ఞప్తి చేశారు.

నెల్లూరు మైనింగ్ శాఖ కార్యాలయంపై ఎసిబి దాడులు

- పలు ఫైళ్లు స్వాధీనం

ప్రజాశక్తి-నెల్లూరు

నెల్లూరు నగరంలో మైనింగ్ శాఖ కార్యాలయంపై అవినీతి నిరోధక శాఖ అధికారులు సోమవారం దాడులు చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో జిల్లాలో భారీగా అక్రమ మైనింగ్ కార్యకలాపాలు చోటు చేసుకున్నాయని, ఈ అక్రమ వ్యవహారం మైనింగ్ శాఖ అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో ఎసిబి అధికారులు మైనింగ్ శాఖ కార్యాలయంపై ఆకస్మిక దాడులు చేసి పలు ఫైళ్లను స్వాధీనం చేసుకున్నారని తెలుస్తుంది. ఎవరినీ కార్యాలయంలోకి ఎవ్వరినీ రానివ్వకుండా తనిఖీలు చేపట్టారు.

టిడిఆర్ బాండ్ల అక్రమాలు తేలుస్తాం

- మంత్రి నారాయణ

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

రాష్ట్రంలో టిడిఆర్ బాండ్ల అవినీతిని తేల్చి, సెప్టెంబర్ చివరి నాటికి అర్హులందరికీ బాండ్లు ఇప్పిస్తామని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ అన్నారు. తిరుపతిలోని తుడా సమావేశ మందిరంలో తుడా, మున్సిపల్, కార్పొరేషన్ అధికారులతో ఆయన సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మంత్రి నారాయణ విలేకరులతో మాట్లాడుతూ.. టిడిఆర్ బాండ్లలో వేల కోట్ల రూపాయలు పక్కదారి పట్టాయని ఆరోపించారు. రాష్ట్రంలో విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో వేలాది ఎకరాల భూములు తీసుకుని రోడ్లు వేశారని, భూములు కోల్పోయిన వారిలో అర్హులకు కాకుండా వైసిపికి అనుకూలంగా ఉండే వారికి టిడిఆర్ బాండ్లు ఇచ్చారని తెలిపారు. దీనిపై ఓ కమిటీ వేశామని, వచ్చే నెలలో టిడిఆర్ బాండ్ల అక్రమాలు తేలుస్తామని తెలిపారు. సింగిల్ డెస్క్ పద్ధతిలో భవనాలకు అనుమతులు ఇస్తామన్నారు. వైసిపి పాలనలో రాష్ట్రం అస్తవ్యస్తంగా తయారైందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు రూ.454 కోట్ల నిధులను విడుదల చేసినట్లు తెలిపారు. చెవిరెడ్డి హయాంలో తుడాలో జరిగిన అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని ఎమ్మెల్యే పులివర్తి నాని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



గిరిజనులతో మాట్లాడుతున్న సత్యనారాయణ, గంగారావు

కుసులవాడలో మైనింగ్ అనుమతులు రద్దు

- గిరిజన ఉద్యోగుల సంఘం డిమాండ్

ప్రజాశక్తి - ఆనందపురం (విశాఖపట్నం)

విశాఖ జిల్లా ఆనందపురం మండలం కుసులవాడ పంచాయతీ చిన్నమెట్ట కొండకు ఇచ్చిన మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె.సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ నెల 28న మైనింగ్ కోసం జరిగే ప్రజాభిప్రాయ సేకరణలో గిరిజనులు, ప్రజలు తమ గళం విప్పాలని కోరారు. సోమవారం కుసులువాడ పంచాయతీ గ్రామాలలో సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కోటి, సిఐటియు నాయకులు రవ్వ నర్సింగరావు పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా గిరిజనులపై చిన్నచూపు కొనసాగుతోందన్నారు. గిరిజన ప్రాంత ప్రజలకు ఎటువంటి భూ పట్టాలూ లేకపోవడంతో వారేమీ చేయలేరని భావించి ప్రభుత్వాలు ఇష్టానుసారంగా మైనింగ్‌కు అనుమతులు జారీ చేస్తున్నాయని తెలిపారు. హక్కులను కాపాడుకోవడానికి అందరూ ఐక్యంగా ఉద్యమించాలన్నారు. మైనింగ్‌తో కుసులవాడ పరిసర ప్రాంతాలన్నీ కలుషితమవుతాయని తెలిపారు. అనంతరం కుసులవాడ, గొల్లపాలెం, రేగానిగూడెం, చిన్నయ్యపాలెం, ఇచ్చాపురం గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచి పెట్టారు. 28న జరిగే ప్రజాభిప్రాయ సేకరణను వ్యతిరేకించాలని కోరారు. చిన్న మెట్ట కొండను సిపిఐ నాయకులు పరిశీలించారు. అనుమతులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు అత్తిలి విమల, కసిరెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంజినీరింగులో 23,155 సీట్లు ఖాళీ

- ముగిసిన తుది దశ కౌన్సెలింగు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇంజినీరింగు కోర్సుల్లో 23,155 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ ప్రవేశాలకు సంబంధించిన ఇఎపిసెట్-2024 తుది దశ కౌన్సెలింగు సోమవారంతో ముగిసింది. సీట్ల కేటాయింపులు పూర్తి చేసినట్లు సెట్ ప్రవేశాల కన్వీనర్, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ గుమ్మల గణేష్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. మూడు దశల కౌన్సెలింగులో 1,33,290 మంది విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. ఈ నెల 19 నుంచి ప్రారంభమైన తుది కౌన్సెలింగ్‌లో 733 మంది కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మూడో దశలో కొత్తగా 29,080 మంది విద్యార్థులు ఆప్షన్లు ఎంపిక చేసుకోగా, వీరిలో కొత్తగా 5,707 మంది అడ్మిషన్లు పొందారు. మొత్తం 248 ఇంజినీరింగు కళాశాలల్లో కన్వీనర్ కోటాలో 1,39,488 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిల్లో 1,16,333 భర్తీ కాగా, 23,155 సీట్లు భర్తీ కాలేదు. అడ్మిషన్లు పొందిన విద్యార్థులు ఈ నెల 30వ తేదీ కల్లా సీటు పొందిన కళాశాలల్లో ఆన్‌లైన్‌తో పాటు వ్యక్తిగతంగా రిపోర్టు చేయాలి.

ఏనుగుల దాడిలో రైతు మృతి

ప్రజాశక్తి- కొమరాడ

ఏనుగుల గుంపు దాడిలో మరో రైతు మృతి చెందారు. పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ మండలం వన్నాం గ్రామంలో పొలం పనులు చేస్తున్న రైతుపై ఏనుగులు దాడి చేశాయి. అటవీశాఖ అధికారులు, స్థానికుల సమాచారం మేరకు.. వన్నాం గ్రామానికి చెందిన వాన శివున్నాయుడు (69) తన కొబ్బరి తోటలో పనిచేస్తుండగా ఒక్కసారిగా ఏనుగుల గుంపు వచ్చి దాడి చేశాయి. కిందపడేసి తొక్కేయడంతో ఆయన అక్కడికక్కడే మరణించారు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు సంఘటన స్థలానికి చేరుకొని అటవీ శాఖ అధికారులకు, పోలీసులకు సమాచారమిచ్చారు. అటవీశాఖ, పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి మృతదేహాన్ని తరలించారు. మృతుని కుటుంబానికి పరిహారం చెల్లించి ఆదుకోవాలని ఎపి రైతుసంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. దీంతో ఇప్పటివరకు ఏనుగుల దాడిలో మృతి చెందిన వారి సంఖ్య 19కి చేరుకుంది.

శేఖర్ శర్మ ఐపిఒ నిబంధనల ఉల్లంఘన...!

- పేటియం షేర్లలో కుదుపు



ముంబయి : పేటియం ప్రమోటర్, సిఇఒ విజయ్ శేఖర్ శర్మ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు సంబంధించి ప్రమోటర్ క్లాసిఫికేషన్ నిబంధనలు ఉల్లంఘించారని మార్కెట్ రెగ్యులేటర్ సెబీ నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. శేఖర్ శర్మతో పాటు మాజీ బోర్డు మెంబర్లకు కూడా ఈ నోటీసులు అందినట్లు మనీకంట్రోల్ ఓ కథనం వెల్లడించింది. దీంతో సోమవారం పేటియం షేర్లు ఓ కుదుపునకు గురైయ్యాయి. ఓ దశలో ఆ సంస్థ షేర్లు 8.8 శాతం పతనమై రూ.505.25కు దిగజారగా.. అనంతరం కొంత కోలుకుని తుదకు 4.48 శాతం నష్టంతో రూ.530 వద్ద ముగిసింది.

మీడియా రిపోర్ట్స్ ప్రకారం.. పేటియం మాతృసంస్థ వన్ 97 కమ్యూనికేషన్ 2021 నవంబర్‌లో ఐపిఒకు వచ్చినప్పుడు క్లాసిఫికేషన్ నిబంధనలు పాటించలేదు. సెబీకి ఐపిఒ పత్రాలు సమర్పించినప్పుడు విజయ్ శేఖర్ శర్మ ఆ సంస్థ ఉద్యోగిగా కాకుండా ప్రమోటర్‌గా యాజమాన్య నియంత్రణ కలిగి ఉన్నట్లు తెలిపారు. పేటియం వైఖరిని బోర్డు సభ్యులు ఆమోదిస్తున్నారా? లేదా? తెలుపాలంటూ వారికీ సెబీ నోటీసులు జారీ చేసింది. ఐపిఒలో విజయ్‌శేఖర్ శర్మను లార్జ్ షేర్ హోల్డర్ అని పేర్కొన్నారు. సెబీ నిబంధనల ప్రకారం.. ప్రమోటర్లు ఐపిఒ తర్వాత ఉద్యోగి స్టాక్ ఆప్షన్లు అందుకోవడంపై నిషేధం. దీనిపై స్పష్టత ఇవ్వాలని ఎక్స్ఛేంజీలు సైతం వివరణ కోరినట్లు తెలుస్తోంది. 2021లో ఐపిఒకు వెళ్లడానికి ముందే పేటియం సిఇఒ విజయ్ శేఖర్ శర్మ తన వాటాలో 5 శాతం తన కుటుంబ ట్రస్ట్ విఎస్ఎస్ హోల్డింగ్ ట్రస్ట్‌కు బదిలీ చేశారు. అనంతరం ఆయన వాటా 9.6 శాతానికి తగ్గింది. దీంతో కంపెనీ నిర్వహణ బాధ్యతలు నిర్వహించవచ్చునని పేటియం వర్గాలు తెలిపాయి. 10 శాతం లోపే వాటా గల వాటాదారులు కంపెనీని ప్రొఫెషనల్‌గా మేనేజ్ చేయొచ్చునని తెలుస్తోంది.

2021లో పేటియం ఇష్యూ ధర రూ.2150 కాగా.. 9 శాతం డిస్కౌంట్‌తో రూ.1995 వద్ద షేర్లు లిస్టయ్యాయి. ఆ తర్వాత ఎప్పుడు కూడా ఆ స్థాయికి చేరలేదు. మదుపర్లకు భారీ నష్టాలను మిగిలిచ్చింది. పేటియం తన విలువను పెంచి చూపిందనే విమర్శలు ఉన్నాయి. మరోవైపు నిబంధనలు ఉల్లంఘించి సరైన డాక్యుమెంట్లు లేకపోయిన వేలాది ఖాతాలు జారీ చేయడంతో పేటియం పేమెంట్స్ బ్యాంక్‌పై ఆర్‌బిఐ ఇటీవల చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ ఏడాది ఆ సంస్థ షేరు ధర రూ.310 వద్ద కనిష్టాన్ని తాకింది. ఇటీవలే కోలుకుంటున్న పేటియంపై మళ్లీ సెబీ పిడుగు పడింది. సెబీ నోటీసులపై పేటియం స్పందిస్తూ.. ఇదేం కొత్త విషయం కాదని పేర్కొంది. మార్చి 31, జూన్ 30తో ముగిసిన త్రైమాసిక ఫలితాల్లోనూ స్టాక్ ఆప్షన్ వివరాలు వెల్లడించామని పేర్కొంది. సెబీకి కూడా ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నామని తెలిపింది.

పేరుకుపోతున్న కార్ల నిల్వలు

న్యూఢిల్లీ : దేశంలో వాహన అమ్మకాలకు డిమాండ్ సన్నగిల్లింది. దీంతో రిటైల్ డీలర్ల వద్ద అధిక సంఖ్యలో ప్యాసింజర్ వాహనాలు పేరుకుపోతున్నాయి. దేశీయంగా డీలర్ల వద్ద ఏకంగా ఏడు లక్షల కార్ల యూనిట్లు పేరుకుపోయి ఉన్నాయని ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ (ఫాడా) వెల్లడించింది. వీటి విలువ సుమారు రూ.73,000 కోట్లు ఉంటుందని అంచనా వేసింది. జులై 2024 ప్రారంభంలో 65-67 రోజులుగా ఉన్న ఇన్వెంటరీ క్లియరెన్స్ సమయం, ప్రస్తుతం 70-75 రోజులకు పెరిగిందని వెల్లడించింది. పండగల సీజన్ రాబోతుండడంతో వీటిలో కొంతమేర విక్రయాలు జరిగే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేసింది.



అమెజాన్ పేకు 10 కోట్ల ఖాతాదారులు

న్యూఢిల్లీ : డిజిటల్ చెల్లింపుల వేదిక అమెజాన్ పే ఇండియా దేశంలో 10 కోట్ల ఖాతాదారులకు చేరినట్లు ప్రకటించింది. కేవలం 3.5 సెకన్లలోనే చెల్లింపులు పూర్తి అవుతున్నాయని తెలిపింది. 2019లో భారత మార్కెట్లోకి ప్రవేశించింది. తమ యాప్‌ను ఎక్కువగా 18-24 ఏళ్ల లోపు వారు ఎక్కువగా అనుసరిస్తున్నారని అమెజాన్ పే ఇండియా సిఇఒ వికాస్ బన్సల్ తెలిపారు. తమ యాప్‌ను ఎక్కువగా మొబైల్ రీఛార్జీలు, యుటిలిటి బిల్లు చెల్లింపులు, ఇ- కామర్స్ లావాదేవీలకు విస్తృతంగా ఉపయోగిస్తున్నారన్నారు.

వృద్ధి 7.10 శాతంగా ఉండొచ్చు

- ఎస్‌బిఐ రీసెర్చ్

ముంబయి : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికం (క్యూ1)లో భారత జిడిపి 7.10 శాతం వృద్ధిని నమోదు చేసే అవకాశాలున్నాయని ఎస్‌బిఐ రీసెర్చ్ నివేదిక అంచనా వేసింది. 2024-25లో స్థూలంగా 7.20 శాతం వృద్ధి ఉండొచ్చని ఆర్‌బిఐ ఇటీవలి ద్రవ్య విధాన సమీక్షాలో పేర్కొంది. ఆగస్టు 30న జిడిపి గణంకాలను కేంద్రం వెల్లడించనుంది. ప్రపంచ సరుకు రవాణా, కంటైనర్ ఖర్చులు, సెమీకండక్టర్ కొరతతో సహా అనేక ఒత్తిళ్లు, సవాళ్లు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ నిలకడగానే ఉందని ఎస్‌బిఐ రీసెర్చ్ గ్రూప్ చీఫ్ ఎకనామిక్ అడ్వైజర్ సౌమ్య కాంతి ఘోష్ పేర్కొన్నారు.



విజయవాడలో వివరాలు వెల్లడిస్తున్న డిసిపి హరికృష్ణ

473.5 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి-కొత్తవలస (విజయనగరం జిల్లా)/విజయవాడ

వేర్వేరు చోట్ల పోలీసులు దాడులు జరిపి 473.5 కిలోల గంజాయిని పట్టుకున్నారు. గంజాయిని తరలిస్తున్న ఓ వ్యాను, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. 11 మంది నిందితులను అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా కొత్తవలస వద్ద వ్యానులో అక్రమంగా గంజాయిని తరలిస్తుండగా సోమవారం తెల్లవారుజామున పోలీసులు పట్టుకున్నారు. 450 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అరకు- విశాఖ జాతీయ రహదారిలో కొత్తవలస మండలం అప్పన్నపాలెం సమీపంలో మధ్యప్రదేశ్ రిజిస్ట్రేషన్ గల వ్యాన్‌లో పండ్లు, కూరగాయల బాస్కెట్‌ల మాటున గంజాయిని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు బొడ్డవర చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. గంజాయి తరలిస్తున్న వాహనాన్ని చెక్‌పోస్టు వద్ద అడ్డగించగా వ్యాను డ్రైవర్ ఆపకుండా వేగంగా వెళ్లిపోయాడు. అప్రమత్తమై పోలీసులు ఎల్.కోట పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించారు. ఎల్.కోట పోలీసుల నుంచి తప్పించుకునే క్రమంలో కొత్తవలస మండలం అప్పన్నపాలెం వద్ద వాహనాన్ని నిలిపి దుండగులు పరారయ్యారు. పోలీసులు వాహనాన్ని తనిఖీ చేయగా 16 మూటల్లో సుమారు 450 కేజీల గంజాయి ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు కొత్తవలస సిఐ షణ్ముఖరావు తెలిపారు. ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడ నగరంలోని వివిధ ప్రదేశాలలో అనుమానంగా తిరుగుతున్న 11 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుండి సుమారు 23.5 కిలోల గంజాయిని, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. కొత్తపేటకు చెందిన కొండ రమేష్, అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన నేలటూరి ప్రవీణ్, ముగ్గురు బాలురు, ఏలూరు జిల్లా నూజివీడు చెందిన గురవర్తి నాగరాజు, షేక్ సిద్దిక్ హుస్సేన్ భాష, చుడిమేల్ల గ్రామానికి చెందిన పసుపులేటి వెంకటేష్, ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లాకు చెందిన సుమన్ బిసోయ్, సాగర్ జెనా, కృష్ణా జిల్లా గంగూరుకు చెందిన పటాన్ జియాఖాన్ ఉన్నారన్నారు. వీరంతా ఏజెన్సీ ప్రాంతాల్లో తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి అధిక డబ్బులకు విజయవాడ తదితర ప్రాంతాల వారికి అమ్మి సొమ్ము చేసుకుంటున్నారని డిప్యూటీ పోలీసు కమిషనర్ టి.హరికృష్ణ తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.రూ.2.60 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

ఆఫీసుల్లో మంచి వాతావరణం

- ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రెవెన్యూ కార్యాలయాల్లో ఉద్యోగులు ప్రశాంతంగా పనిచేసే వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని ఎపి రెవెన్యూ సర్వీసెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు వెంకటేశ్వర్లు, కంచర్లపల్లి రమేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. విజయవాడలో లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. విపరీతమైన పనిభారంతో ఉక్కిరి బిక్కిరవుతున్న రెవెన్యూశాఖకు జనాభా ప్రాతిపదికన మండలాల్లో సరిపడా సిబ్బంది లేరన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం ఆయా జిల్లాల్లో మండలాల సంఖ్య తగ్గినప్పటికీ జిల్లా కలెక్టరేట్‌లలో సిబ్బందినే కొత్త జిల్లాలకు సర్దుబాటు చేయడంతో ఉద్యోగులు పనిభారాన్ని ఎదుర్కొంటున్నారన్నారు. తహశీల్దార్/రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల్లో రికార్డులకు భద్రత లేదని, ప్రతి రెవెన్యూ కార్యాలయానికి ఒక రెవెన్యూ అసిస్టెంట్, నైట్ వాచ్‌మెన్‌లను నియమించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఎపి రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఏలూరు డిప్యూటీ తహశీల్దారు రామిశెట్టి వెంకట రాజేష్ ఎన్నికైనట్లు అసోసియేషన్ ప్రకటించింది.

అభియోగాల సొమ్ము మినహా మిగిలిన బెనిఫిట్స్ చెల్లించాలి : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

రిటైర్మెంటుకు కేవలం 25 రోజుల ముందు ఒక వినియోగదారుడి లాకర్‌లోని బంగారాన్ని కాజేసిన ఉద్యోగి నుంచి ఆ మొత్తాన్ని మినహాయించి మిగిలిన రిటైర్మెంట్ బెనిఫిట్స్ విడుదల చేయాలని హైకోర్టు ఆదేశించింది. సిసి పుటేజీ ఆధారంగా సదరు ఉద్యోగిపై నర్సరావుపేట పిఎస్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. రిటైర్మెంటు అయ్యాక శాఖా పరమైన విచారణ ప్రారంభించింది. అతని ప్రొవిజినల్ పెన్షన్ మినహా మిగిలిన పదవీ విరమణ ప్రయోజనాలను బ్యాంకు అధికారులు నిలిపేశారు. గ్రాట్యూటీ, ప్రొవిడెంట్ ఫండ్ మొత్తాలున్న బ్యాంకు ఖాతాను కూడా జప్తు చేశారు.

దీనిపై హైకోర్టును ఉద్యోగి ఆశ్రయించగా, శాఖాపరమైన విచారణ ముగించకపోవడంతో అతనికి అనుకూలంగా సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై బ్యాంకు అప్పీల్ దాఖలు చేసింది. బంగారం దొంగతనం వల్ల ఏర్పడిన నష్టం రూ.4.42 లక్షలు మినహా మిగిలిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను విడుదల చేయాలని ద్విసభ్య ధర్మాసనం కూడా తాజాగా తీర్పు చెప్పింది. పల్నాడు జిల్లా, నర్సరావుపేట పట్టణానికి చెందిన బిఎం నాయక్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉద్యోగం చేస్తుండగా 2019 మార్చిలో లాకర్‌లోని బంగారం దొంగతనం చేసినట్లుగా సిసి పుటేజీ ద్వారా వెలుగులోకి వచ్చింది. అదే ఏడాది, అదే నెల 31న రిటైర్డు అయ్యాడు. దీనిపై శాఖాపరమైన విచారణ చేపట్టిన బ్యాంకు ఉన్నతాధికారులు, సదరు ఉద్యోగి ప్రొవిజినల్ పెన్షన్ మినహా మిగిలిన ప్రయోజనాలను నిలిపేశారు. నాయక్ బ్యాంకు ఖాతాల జప్తునకు సంబంధిత కోర్టు కూడా అనుమతి ఇచ్చింది.

బంగారం మాయంతో తనకు సంబంధం లేదంటూ 2022లో నాయక్ కోర్టును ఆశ్రయించారు. నాయక్ ఉద్యోగ విరమణ ప్రయోజా లను నిలిపేయడాన్ని గతంలో సింగిల్ జడ్జి తప్పు పట్టారు. దీనిపై యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్పీల్ దాఖలు చేయగా దీనిని చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ నైనాల జయసూర్యతో కూడిన ధర్మాసనం కొట్టేసింది. బ్యాంకు ఖాతాల జప్తును ఆక్షేపించింది. రూ.4.42 లక్షలు మినహా మిగిలిన ఉద్యోగ విరమణ ప్రయోజనాలను విడుదల చేయాలని బ్యాంకును ఆదేశించింది.

సంపాదకీయం


మరో జిమ్మిక్కు!

కేంద్ర ప్రభుత్వోద్యోగులకు ప్రస్తుతం ఉన్న నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పిఎస్) స్థానంలో యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యుపిఎస్)ను తెస్తూ నరేంద్ర మోడీ కేబినెట్ శనివారం తీసుకున్న నిర్ణయం మరో ఎన్నికల జిమ్మిక్కు. ఈ ఏడాదిలో జరగనున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఎర. హర్యానా, జమ్మూ కాశ్మీర్ ఎన్నికలకు షెడ్యూల్ వెలువడగా మహారాష్ట్ర ఎన్నికలూ ఇప్పుడే ఉన్నాయి. ఈ సంవత్సరంలోనే ఢిల్లీ, జార్ఖండ్ ఎన్నికలు కూడా. రెండు దశాబ్దాల నుంచి ఎన్‌పిఎస్‌కు నిరసగా ఉద్యోగులు ఆందోళనలు చేస్తుండగా, పదేళ్లుగా కేంద్రంలో తామే అధికారం వెలగబెడుతూ, హఠాత్తుగా పెన్షన్ అంశం మోడీ ప్రభుత్వానికి గుర్తుకు వచ్చిందంటేనే తెర మాటు రహస్యమేంటో తెలుస్తుంది. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి పట్ల ఉద్యోగుల్లో వ్యక్తమైన తీవ్ర వ్యతిరేకత నేపథ్యంలో వారిని ఎలాగైనా జో కొట్టేందుకు పన్నిన పన్నాగంగా అర్థమైపోతుంది. ఇంత డ్రామాకూ ఒడిగట్టి మోడీ సర్కారు ఉద్యోగులకు కొత్తగా ఒరగబెట్టిందేమీ లేదు. ఎన్‌పిఎస్‌లో ఉద్యోగులు తప్పనిసరిగా తమ కంట్రిబ్యూషన్ చెల్లించాలి. చందా లేకుండా పాత పెన్షన్ స్కీం (ఒపిఎస్) ఉద్యోగుల ప్రధాన డిమాండ్. ఆ మౌలిక అంశాన్ని అంటుకోలేదు మోడీ సంకీర్ణ ప్రభుత్వం. అందుకే యుపిఎస్ పట్ల ఉద్యోగుల నిరసనలు ఎగసిపడుతున్నాయి.


ఏకీకృత పెన్షన్ అంటున్నా ఎక్కడా ఏకీకృతం కనిపించదు. పాతిక సంవత్సరాల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే బేసిక్‌లో 50 శాతం పెన్షన్ వస్తుంది. మిగిలిన వారికి సర్వీస్ బట్టి పెన్షన్ ఖరారు చేస్తారు. పెన్షన్ పొందాలంటే ఉద్యోగికి కనీసం పదేళ్ల సర్వీస్ నిండి ఉండాలి. కనీస పెన్షన్ రూ.10 వేలే. బేసిక్‌లో యాభై శాతం పెన్షన్‌కు 20 ఏళ్ల సర్వీస్ ఉంటే సరిపోతుంది. కానీ 25 ఏళ్లు నిండాలన్నారు. ఈ నిబంధనలు ఉద్యోగులకు పెన్షన్ గ్యారంటీ ఇచ్చేవేమీ కాదు. ఇదేనా ఉద్యోగులకు కల్పించే ఆర్థిక భద్రత? వారి గౌరవాన్ని పెంచే పద్ధతి? ఎన్‌పిఎస్‌లో ఉన్న 23 లక్షల మంది యుపిఎస్‌లోకి మారితే గొప్ప ప్రయోజనం అంటోంది మోడీ సర్కారు. రాష్ట్రాలూ కలిస్తే 90 లక్షల మందికి మేలు జరుగుతోందంటోంది. ఇదంతా తాము తీసుకొచ్చే యుపిఎస్ స్కీంకు ప్రమోషన్ వర్క్. ఉద్యోగులను మభ్యపెట్టే ఎత్తుగడ.

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సిపిఎస్) అనేది నాటి వాజ్‌పేయి సర్కారు హయాంలో పురుడు పోసుకొని మన్మోహన్‌సింగ్ ప్రభుత్వంలో అమల్లోకొచ్చింది. సైనిక రంగ ఉద్యోగులు మినహా 2004 ఏప్రిల్ 1 తర్వాత సర్వీసులో చేరిన వారిని కేంద్రం ఎన్‌పిస్‌లోకి చేర్చింది. అప్పటి నుంచి ఉద్యోగులు ఒపిఎస్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ మధ్యనే రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఒపిఎస్‌కు వెళ్లాయి. దాంతో కేంద్రంతో పాటు బిజెపి పాలిత రాష్ట్రాలు రాజకీయంగా ఇబ్బందుల్లో పడ్డాయి. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి సోమనాథన్ నేతృత్వంలో గతేడాది మోడీ సర్కారు కమిటీ వేయగా, అది యుపిఎస్‌ను సిఫారసు చేసింది. ఆ నివేదికకు మోడీ సర్కారు పచ్చజెండా ఊపింది. రాష్ట్రంలో సిపిఎస్‌ను రద్దు చేస్తామన్న వైసిపి ప్రభుత్వం మాట తప్పి జిపిఎస్ పేరిట విన్యాసాలు చేసింది. అందుకే మొన్నటి ఎన్నికల్లో సిపిఎస్ రద్దు ప్రధాన ఎజెండాగా ముందుకొచ్చింది. టిడిపి ప్రభుత్వం సైతం సిపిఎస్ రద్దు అనకుండా ఉద్యోగులకు ఆమోదయోగ్యమైన పెన్షన్ స్కీం తెస్తామంది. కేంద్రం ప్రతిపాదించిన యుపిఎస్‌పై టిడిపి కూటమి ప్రభుత్వం మౌనం దాల్చింది. ఇదీ దేశ, రాష్ట్ర అభివృద్ధిలో, పాలనలో జీవితాంతం సేవ చేసే ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి. సిపిఎస్, రిక్రూట్‌మెంట్ నిలిపివేత, కాంట్రాక్టు, ఔట్‌సోర్స్ అనేవి ప్రపంచబ్యాంక్ ఆదేశిత, నయా ఉదారవాద విధానాలు. వాటి అడుగు జాడల్లో నడిచే ప్రభుత్వాలకు ఆ విధానాలే శిలా శాసనాలు. ఉద్యోగులకు పెన్షన్ అనేది భిక్ష కాదు, హక్కు. ఈ తత్వాన్ని పాలకులు అంగీకరించి తీరాలి. ప్రభుత్వాల మెడలు వంచేందుకు ఉద్యోగులు సమైక్యంగా ఉద్యమించాలి.

మహనీయుల మాట



కార్మిక వర్గ పోరాటం వారి విముక్తి కోసమే కాదు. అణచివేత నుండి, దోపిడీ నుంచి మొత్తంగా మానవాళి విముక్తి కోసం అది పోరాడుతుంది.
- హోచిమిన్




స్వల్పకాలిక 'అద్భుతాలు'



> ఈ నయా ఉదారవాద విధానాల ఉక్కు చట్రాన్ని బద్దలు కొట్టుకుని అధిగమించాలంటే ప్రజలలో కేవలం ప్రభుత్వాల మీద అసంతృప్తి పెరిగితే చాలదు. ఈ విధానాలకు ప్రత్యామ్నాయంగా ఉండే ఆర్థిక వ్యూహాన్ని ప్రజల ముందుంచి దాని సాధన లక్ష్యంగా వారిని సమీకరించాలి.

బంగ్లాదేశ్‌లో ఇటీవల చోటు చేసుకున్న రాజకీయ అస్తవ్యస్త పరిస్థితులమీద చాలా విశ్లేషణలు వచ్చాయి. వాటిలో ఎక్కువ భాగం షేక్ హసీనా ప్రభుత్వం అవలంబించిన పెత్తందారీ, నియంతృత్వ విధానాల మీద దృష్టిని ప్రధానంగా కేంద్రీకరించాయి. ఆ దేశ ఆర్థిక పరిస్థితిలో వచ్చిన మార్పుల గురించి చాలా తక్కువగా చెప్పాయి. కొన్ని విశ్లేషణలలో ఆర్థిక స్థితి గురించిన చర్చే మొత్తంగా లేకుండా పోయింది. కేవలం కొద్ది నెలల క్రితమే ఒక ఆర్థిక 'అద్భుతం'గా ప్రశంసలు పొందిన బంగ్లాదేశ్ ఆర్థిక వ్యవస్థ ఉన్నట్టుండి పతనమైంది. అక్కడి ప్రజల్లో అధిక సంఖ్యాకుల జీవన పరిస్థితులు హఠాత్తుగా దిగజారిపోయాయి. షేక్ హసీనా ప్రభుత్వం ప్రజల్లో తనకున్న పలుకుబడిని చాలా వేగంగా కోల్పోవడం వెనుక ప్రధాన కారణం ఈ దిగజారిన ప్రజల స్థితిగతులే. ఆ పరిస్థితులు ఆ విధంగా తయారవడానికి ప్రభుత్వమే ప్రధాన కారణంగా భావించిన ప్రజలు తమలో పెల్లుబుకుతున్న ఆగ్రహాన్ని వీధుల్లో నిరసనల రూపంలో వ్యక్తం చేశారు.

2021 వరకూ బంగ్లాదేశ్ ఆర్థిక వృద్ధిలో విజయం సాధించిన దేశంగా పరిగణించబడేది. నయా ఉదారవాద ఆర్థిక విధానాల చట్రం పరిధిలో ఎగుమతులను బాగా పెంచడం ద్వారా ఈ వృద్ధి సాధించారు. ఆ దేశ ఎగుమతుల్లో దాదాపు 80 శాతం దుస్తుల ఎగుమతులే. ఆ ఎగుమతుల వృద్ధి వేగం ఎంత ఎక్కువగా ఉండేదంటే, అతి స్వల్ప కాలంలోనే ప్రపంచం మొత్తం మీద దుస్తుల మార్కెట్ లో 10 శాతం డిమాండ్‌ను బంగ్లాదేశ్ ఎగుమతులే అందుకుంటాయని భావించేవారు. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంక్ వంటి సంస్థలు కోట్లాది మందికి పేదరికం నుంచి విముక్తి కలిగించిన దేశంగా బంగ్లాదేశ్ ను ప్రశంసిస్తూ వుండేవి. 2024 ఏప్రిల్ 2 న విడుదల చేసిన నివేదికలో సైతం బంగ్లాదేశ్ జిడిపి వృద్ధి రేటు 5.6 దాకా ఉంటుందని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. ఏ విధంగా చూపినా, ఆ వృద్ధిరేటు చెప్పుకోదగ్గదే.



ప్రభాత్ పట్నాయక్

ఒకసారి కరోనా మహమ్మారి ప్రభావం చూపడం ప్రారంభించాక బంగ్లాదేశ్ ఎగుమతులు దెబ్బతిన్నాయి. ఐతే ఇది తాత్కాలికమేనంటూ ప్రపంచ బ్యాంక్ భావించింది. అందుకే 2024 నివేదికలో వృద్ధి రేటు మీద తన అంచనాలను ప్రకటించింది. కాని ఆర్థిక పతనం కొనసాగుతూ వచ్చింది. ఇందులో ఆశ్చర్యం ఏమీ లేదు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మాంద్యం నెలకొని కొనసాగుతున్నప్పుడు ఒకానొక దేశంలో పతనమైన ఆర్థిక వ్యవస్థ కోలుకోవడం అంత తేలికేమీ కాదు. బంగ్లాదేశ్‌కి విదేశీ మారకద్రవ్యం గణనీయంగా అందే మరొక మార్గం ప్రవాస బంగ్లాదేశీయులు. వారి నుంచి వచ్చే చెల్లింపులు కూడా ఆర్థిక మాంద్యం ప్రభావం వలన దెబ్బ తిన్నాయి. బంగ్లాదేశ్ తన విద్యుత్ ఉత్పత్తికి ప్రధానంగా చమురు మీద ఆధారపడతుంది. ఆ చమురును దిగుమతి చేసుకుంటుంది. ఉక్రెయిన్ యుద్ధం కారణంగా చమురు ధరలు పెరిగాయి. దాంతో తీవ్ర స్థాయిలో విదేశీ మారక ద్రవ్యానికి కొరత ఏర్పడింది. ఫలితంగా విద్యుత్ కోతలు పెరిగాయి. పైగా విద్యుత్ ధరలు పెరిగాయి. దాని పర్యవసానంగా విద్యుత్ మీద ఆధారపడి ఉత్పత్తి అయ్యే సరుకుల ధరలూ పెరిగాయి. ఇదంతా కలిసి దేశ ఆర్థి వ్యవస్థలో తీవ్ర సంక్షోభానికి కారణమైంది. ఆగస్టు నెలలో ద్రవ్యోల్బణం 9.52 శాతానికి ఎగబాకింది. ఇది గత దశాబ్దంలోకెల్లా అత్యధికం. కొందరైతే ఈ అంచనాలు తక్కువ చేసి చూపారని కూడా అంటున్నారు.

> "బొమ్మ పడితే గెలుపు నాది, బొరుసు పడితే ఓటమి నీది" అన్నట్టుగా సామ్రాజ్యవాదం పరిస్థితి ఇప్పుడు ఉంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ప్రజల్లో తలెత్తే అసంతృప్తి ఫలితంగా ఆ ఉదారవాద విధానాల చట్రాన్ని బద్దలు కొట్టుకుని బైట పడడం జరగదు సరికదా, అవే విధానాలను నయా ఫాసిస్టు నియంతృత్వ ప్రభుత్వాల ఆధ్వర్యంలో మరింత పటిష్టంగా ప్రజల మీద రుద్దే పరిస్థితి వస్తుంది.

ఈ ద్రవ్యోల్బణానికి దోహదం చేసినవి రెండు కారణాలు ఉన్నాయి. మొదటిది: బంగ్లాదేశ్ కరెన్సీని డాలర్‌తో పోల్చి మారకపు రేటు తగ్గించడం. అమెరికన్ ప్రభుత్వం తన దేశంలో ద్రవ్యోల్బణాన్ని అరికట్టడానికి వడ్డీ రేట్లు పెంచింది. దాంతో డాలర్లు అమెరికాకు ఎక్కువగా ప్రవహించడం మొదలైంది. దాని ఫలితంగా ఇతర దేశాల్లో డాలర్లకు కొరత ఏర్పడి వాటి డిమాండ్ పెరిగింది. దానివలన డాలర్ మారకపు రేటు పెరిగింది. దీనికి బంగ్లాదేశ్‌కు ఏర్పడిన విదేశీ మారకపు ద్రవ్య కొరత తోడైంది. ఇక రెండో కారణం: నయా ఉదారవాద చట్రంలో ఆర్థిక వ్యవస్థ నడుస్తున్నందున ప్రభుత్వం ధరల పెరుగుదలతో బాధపడే ప్రజలకు ఏ విధంగానూ ఊరట కలిగించే చర్యలు చేపట్టడానికి కుదరదు. అలా ఊరట కలిగించాలంటే ప్రభుత్వం ప్రజలకిచ్చే సబ్సిడీలను పెంచాలి. అలా పెంచేందుకు ప్రపంచబ్యాంక్ షరతులు అనుమతించవు.

ఆర్థిక వ్యవస్థ వృద్ధి వేగం మందగించడంతో దేశంలో నిరుద్యోగం తీవ్ర సమస్యగా మారింది. మరోపక్క ద్రవ్యోల్బణం వలన ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచుదామంటే అప్పుడు ఎగుమతి చేసే సరుకుల ధరలను పెంచాల్సి వుంటుంది. అలా పెంచితే అంతర్జాతీయ మార్కెట్ లో పోటీలో నిలదొక్కుకోవడం సాధ్యం కాదు. ఒక వేళ నిలదొక్కుకోవడం కోసం బంగ్లాదేశ్ కరెన్సీ మారకపు రేటును తగ్గించాలనుకుంటే దాని వలన దిగుమతి చేసుకునే చమురు ధరలు పెరిగిపోతాయి. దాని వలన మళ్ళీ ధరలు పెరిగిపోతాయి.

ఈ చిక్కుల మధ్య బంగ్లాదేశ్ ఐఎంఎఫ్ ను, ఇతర అంతర్జాతీయ రుణదాతలను అప్పుల కోసం అభ్యర్థించింది. అలా పొందిన అప్పులతో విదేశీ చెల్లింపుల లోటు సమస్య మరింత పెరిగింది. తెచ్చిన అప్పులకు వడ్డీలు, వాయిదాలు చెల్లించవలసి వుంటుంది. వాటి మొత్తం పెరిగిపోయింది. అది విదేశీ చెల్లింపులలో లోటుకు దారి తీసింది. పైగా ఐఎంఎఫ్ షరతుగా విధించిన కొత్త పొదుపు చర్యలతో నిరుద్యోగం మరింత పెరిగింది.

షేక్ హసీనా ప్రభుత్వం దెబ్బ తినడం వెనుక ఈ ఆర్థిక సంక్షోభం ప్రభావం ప్రధానంగా పని చేసింది. ఈ సంగతిని కొందరు గుర్తించారు. కాని దానికి కారణం హసీనా ప్రభుత్వం కొందరు ఆశ్రిత పెట్టుబడిదారులను వెనకేసుకు రావడమేనంటూ విశ్లేషిస్తున్నారు. మరికొందరు ప్రభుత్వం అమలు చేసిన రిజర్వేషన్ విధానం ముఖ్య కారణం అంటున్నారు. బంగ్లాదేశ విముక్తి పోరాటంలో పాల్గొన్న సైనికుల సంతానానికి రిజర్వేషన్లు ఉద్యోగాలలో కల్పించడం పట్ల వ్యతిరేకత తలెత్తింది. ఐతే దీనినే ప్రధాన కారణంగా చూపించడం అంటే అసలు సమస్యను పక్కకు తప్పించడమే. అసలు రిజర్వేషన్లకు వ్యతిరేకత రావడానికి కారణం అక్కడ పెరిగిపోతున్న నిరుద్యోగం. సంక్షోభానికి కారణం బంగ్లాదేశ్ తన ఆర్థిక వ్యూహాన్ని మొత్తంగా ఎగుమతుల పెంపు అనే అంశం చుట్టూ రూపొందించడం. అది కూడా నయా ఉదారవాద చట్రానికి లోబడిన వ్యూహం. సంక్షోభానికి మూల కారణం ఈ ఆర్థిక వ్యూహంలోనే ఉంది.

ఈ వ్యూహం కొద్ది కాలం పాటు చాలా నాటకీయంగా విజయవంతమైన ఫలితాలను రాబట్టవచ్చు. కాని ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తంగానే మందగిస్తున్నప్పుడు ఎగుమతులు దెబ్బ తినకమానవు. ఇక ఉక్రెయిన్ యుద్ధం వంటి ప్రతికూల పరిణామాలు అంతర్జాతీయ రంగంలో తలెత్తితే దాని పర్యవసానాలు కూడా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి. ఆర్థిక వ్యూహం విజయవంతంగా నడిచిన కాలంలో వేసిన ముందడుగులు కూడా నిష్ప్రయోజనమై, ఆర్థిక వ్యవస్థ చాలా వెనక్కి జారిపోతుంది.

బంగ్లాదేశ్ అనుభవం నుండి నేర్చుకోవలసినవి రెండు గొప్ప గుణపాఠాలు ఉన్నాయి. మొదటిది: విజయవంతంగా పురోగమిస్తున్న ఒక మూడవ ప్రపంచదేశ ఆర్థిక వ్యవస్థ ఒక విఫలమైన వ్యవస్థగా పడిపోవడం ఒక హఠాత్ పరిణామంగా జరగడం. రెండవది: దేశ ఆర్థిక వ్యవస్థలో ఒక రంగంలో ఎదురయ్యే సమస్యలు అక్కడికే పరిమితం కాకుండా అన్ని రంగాలనూ కష్టాల్లోకి నెట్టడం.

కేవలం ఎగుమతును పెంచుకోవడం మీదనే బంగ్లాదేశ్ కేంద్రీకరించడం వల్లనే ఈ కష్టాలు వచ్చాయని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. పైగా ఆ ఎగుమతుల్లో కూడా కేవలం దుస్తుల ఎగుమతుల మీదే కేంద్రీకరించడం వల్ల ఈ పరిస్థితి వచ్చిందంటున్నారు. దుస్తులతోబాటు ఎగుమతుల్లో వివిధ సరుకులను చేర్చివుంటే ఇలా జరిగేది కాదంటున్నారు. మరికొందరు ఎగమతుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని దేశంలో వివిధ పరిశ్రమల ఏర్పాటుకు మళ్ళించి మొత్తంగా ఆర్థిక వ్యవస్థను బలపరిచి వుండాల్సిందని అంటున్నారు. ఈ విమర్శలు చేసేవారు ఒక విషయాన్ని విస్మరిస్తున్నారు. నయా ఉదారవాద ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం జోక్యం కల్పించుకోగల సామర్ధ్యాన్ని కోల్పోతుంది. దేశీయంగా పరిశ్రమలను ప్రోత్సహించాలంటే అంతర్జాతీయ పోటీ నుండి ఆ పరిశ్రమ లకు రక్షణ కల్పించాలి. కాని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి అటువంటి రక్షణ చర్యల పట్ల కన్నెర్ర చేస్తుంది. ఆ అంతర్జాతీయ పెట్టుబడి సహకారం లేకపోతే ఎగుమతులు కాస్తా దెబ్బ తింటాయి. అంతే కాదు. అంతర్జాతీయ మార్కెట్ లో ఏ యే సరుకుల ఎగుమతులు నిలదొక్కుకోవాలన్నది అంతర్జా తీయ పెట్టుబడి నిర్ణయిస్తుందే తప్ప ఆ యా దేశాల ప్రభుత్వా లు కావు. అందుచేత బంగ్లాదేశ్‌లో అనుసరించిన ఎగుమతుల-ఆధారిత అభివృద్ధి వ్యూహం దెబ్బ తినిపోడానికి కేవలం అక్కడి ప్రభుత్వమే కారణం అని నిందించడం సరి కాదు.

ఇప్పుడు మహమ్మద్ యూనస్ ఉద్దేశాలేమైనా, విద్యార్థుల ఉద్దేశాలేమైనా, అక్కడ జరగబోయే ఎన్నికల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్ పార్టీని పోటీ చేయడానికి అనుమతించకపోతే...ప్రస్తుత రాజకీయ సంక్షోభ పరిస్థితుల నుండి లాభం పొందేది మాత్రం అక్కడి మితవాద పార్టీలే. అక్కడ మితవాద శక్తులు బలపడితే అది అమెరికాకి ఆనందదాయకంగా ఉంటుంది. దేశీయ కార్పొరేట్ గద్దలకూ అది ఆనందదాయకమే. ప్రస్తుతం ప్రపంచంలో ఆవిష్కరించ బడుతున్న కొత్త దృశ్యాన్ని బంగ్లాదేశ్ పరిస్థితులు మన ముందు చూపిస్తున్నాయి.

ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభం వలన నయా ఉదారవాద విధానాలను అమలు చేసే మూడో ప్రపంచ దేశాల్లో ఎక్కువ భాగం ఆర్థిక మాంద్యంలోకి నెట్టబడుతున్నాయి. నిరుద్యోగం తీవ్ర స్థాయికి చేరడం, విదేశీ రుణాలు పెరిగిపోవడం కనిపిస్తున్నది. ఏవైనా దేశాల్లో సాపేక్షంగా స్వయం నిర్ణయాధికారాన్ని నెరపగలిగే స్థితిలో మధ్యేవాద ప్రభుత్వాలు ఉన్నా, అవి ప్రజా బాహుళ్యంలో తమ పలుకుబడిని కోల్పోతున్నాయి. వాటిని దించి ఆ స్థానాల్లో తనకు అనుకూలంగా ఉండే మితవాద ప్రభుత్వాలను తీసుకురాగల శక్తి సామ్రాజ్యవాదానికి పెరిగింది. ఇలా ఏర్పడే కొత్త ప్రభుత్వాలు అంతకు ముందున్న ప్రభుత్వాలకన్నా నియంతృత్వంగా నడిచేవే. ఇవి నయా ఉదారవాద మార్గాన నడవడంతోబాటు, ప్రజల ఆలోచనలను మతతత్వం వైపో, మరో విధంగా ప్రజల్లోనే ఒక మైనారిటీ తరగతిని మెజారిటీ ప్రజలకు శత్రువులుగా చిత్రీకరించే విద్వేష రాజకీయాల వైపో మళ్ళిస్తాయి. "బొమ్మ పడితే గెలుపు నాది, బొరుసు పడితే ఓటమి నీది" అన్నట్టుగా సామ్రాజ్యవాదం పరిస్థితి ఇప్పుడు ఉంది. నయా ఉదారవాద విధానాల ఫలితంగా ప్రజల్లో తలెత్తే అసంతృప్తి ఫలితంగా ఆ ఉదారవాద విధానాల చట్రాన్ని బద్దలు కొట్టుకుని బైట పడడం జరగదు సరికదా, అవే విధానాలను నయా ఫాసిస్టు నియంతృత్వ ప్రభుత్వాల ఆధ్వర్యంలో మరింత పటిష్టంగా ప్రజల మీద రుద్దే పరిస్థితి వస్తుంది. నయా ఉదారవాదం అనే పిశాచపు అణచివేతను గుర్తించినా, దానిని వదలగొట్టుకోవడం అంతకంతా కష్టతరమౌతుంది.

> సంక్షోభానికి కారణం బంగ్లాదేశ్ తన ఆర్థిక వ్యూహాన్ని మొత్తంగా ఎగుమతుల పెంపు అనే అంశం చుట్టూ రూపొందించడం. అది కూడా నయా ఉదారవాద చట్రానికి లోబడిన వ్యూహం. సంక్షోభానికి మూల కారణం ఈ ఆర్థిక వ్యూహంలోనే ఉంది.

ఈ నయా ఉదారవాద విధానాల ఉక్కు చట్రాన్ని బద్దలు కొట్టుకుని అధిగమించాలంటే ప్రజలలో కేవలం ప్రభుత్వాల మీద అసంతృప్తి పెరిగితే చాలదు. ఈ విధానాలకు ప్రత్యామ్నాయంగా ఉండే ఆర్థిక వ్యూహాన్ని ప్రజల ముందుంచి దాని సాధన లక్ష్యంగా వారిని సమీకరించాలి. ఆ వ్యూహంలో ప్రభుత్వ జోక్యానికి ఎక్కువ అవకాశం ఉండాలి. దేశీయ మార్కెట్‌ను బలోపేతం చేసే దిశగా అది ఉండాలి. దేశంలోని ఖనిజాలు, ఇతర సహజవనరుల మీద జాతికి పూర్తి అదుపు ఉండాలి. బంగ్లాదేశ్ మరీ చిన్న దేశం ఏమీ కాదు. 17 కోట్ల జనాభా ఉన్న దేశం. కేవలం బైటనుంచి ఒత్తిడి చేయడం ద్వారా అటువంటి దేశంలో నయా ఉదారవాద చట్రంలో ఎగుమతి-ఆధారిత వృద్ధి వ్యూహాన్ని అమలు చేయడం అంత తేలికేమీ కాదు. అక్కడ పాలక వర్గాల సహకారంతోటే దానిని అమలు చేశారు. ఐతే, దానికి ప్రత్యామ్నాయంగా అమలు చేయాల్సిన, దేశీయ మార్కెట్-ఆధారిత అభివృద్ధి వ్యూహాన్ని అమలు చేయడం కూడా అంత తేలికేమీ కాదు. ఇందుకు ప్రజల మద్దత్తు చాలా అవసరం. ప్రస్తుతం ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక సంక్షోభపు ప్రతికూల పర్యవసానాలను అనుభవిస్తున్న మూడవ ప్రపంచ దేశాల ముందు ఇంతకన్నా వేరే మార్గం లేదు.

(స్వేచ్ఛానుసరణ)


ఎన్నికల కమిషన్-'మహా' ఎన్నికల రాజకీయం!

విశ్లేషణ

- సత్య

హర్యానా, ఎట్టకేలకు జమ్ము కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియకు తెర లేచింది. పోయినసారి హర్యానాతో పాటు మహారాష్ట్ర ఎన్నికలు జరిగినా ఈసారి జరగటం లేదు. శుక్రవారం నాడు కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రధాన అధికారి రాజీవ్ కుమార్ విలేకర్లతో మాట్లాడుతూ మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రకటన ఎందుకు చేయలేదన్న ప్రశ్నకు తరువాత వెల్లడిస్తామన్నారు. పార్లమెంటు, అసెంబ్లీ, ఇతర ఎన్నికలన్నింటినీ ఒకేరోజు జరపాలంటూ బిజెపి చెబుతున్న కబుర్లకు మద్దతు ఇస్తున్న ఎన్నికల కమిషన్ తన దాకా వచ్చే సరికి కుంటి సాకులు చెబుతున్నది. వర్షాలు, భద్రతా సమస్యలంటూ మహారాష్ట్ర ఎన్నికలను తరువాత జరుపుతామంటున్నది. ఈ సమస్యలు హర్యానాలో ఉండవా? మహారాష్ట్రలో వినాయకచవితి, దసరా, దీపావళి పండుగలు వరుసగా వస్తాయన్న కారణం కూడా ఎన్నికల కమిషన్ చూపింది. 2019లో కూడా ఇవన్నీ ఉన్నాయిగా అప్పుడెలా సాధ్యమైంది. ఉదాహరణకు వినాయకచవితి 2019లో సెప్టెంబరు రెండున వస్తే ఈ ఏడాది ఏడవ తేదీ వస్తున్నది. మిగతా పండగలు కూడా అదే మాదిరి కొద్ది రోజుల తేడాతో ఉంటాయి. ఈ పండగలు హర్యానాలో, జమ్మూ ప్రాంతంలో కూడా జరుగుతాయి కదా? అక్కడ లేని ఆటంకాలు మహారాష్ట్రలోనే ఎలా ఉంటాయి? ఇలాంటి కారణాలు బిజెపి కూటమిని ఓటమి నుంచి గట్టెక్కిస్తాయా!

అధికార దాహం, రాజకీయ అవకాశవాదానికి మహారాష్ట్రలో మారు పేరుగా తయారైన అజిత్ పవార్ ఎన్నికల్లో పోటీ చేసే ఆసక్తి తనకు లేదని, ఇప్పటికే ఏడెనిమిది ఎన్నికల్లో పోటీ చేశానని చెప్పాడు. ఇదొక ఎత్తుగడని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తన భార్య సునేత్రను సోదరి సుప్రియా (శరద్ పవార్ కుమార్తె) మీద పోటీకి నిలిపి తప్పు చేశానని గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన స్థానంలో (బారామతి) తన కుమారుడు జయ్ పవార్ పోటీ చేసేదీ లేనిదీ పార్టీయే నిర్ణయిస్తుందన్నారు. ప్రజాస్వామ్యంలో జనం, మద్దతుదార్లు కోరితే జయ్‌ను పోటీకి నిలుపుతారు, పార్టీ పార్లమెంటరీ బోర్డు దాన్ని చర్చిస్తుంది అన్నారు. లోక్‌సభ ఎన్నికలలో బారామతి అసెంబ్లీ నియోజకవర్గంలో సుప్రియకు 47 వేల మెజారిటీ వచ్చింది. అందువలన అజిత్ పవార్ పోటీ చేసినా గెలిచే అవకాశం అనుమానమే గనుక మర్యాద నిలుపుకొనేందుకుగాను తనకు ఆసక్తి లేదని ప్రకటించినట్లు స్పష్టం అవుతోంది. ఒకవేళ శరద్ పవార్‌తో సయోధ్య కుదిరితే కుమారుడికి అక్కడ మద్దతు కోసం బేరమాడవచ్చు. అసలా నియోజకవర్గంలో శరద్ పవార్ కుటుంబ సభ్యులెవరూ పోటీ చేయకుండా ఉంటే మంచిదనే సంకేతాలు పంపుతున్నట్లు కూడా చెబుతున్నారు. రాజకీయాల్లో ఒకసారి అడుగు జారితే ఎంత గొప్పవారికైనా పట్టు వుండదు, ఇప్పుడు అజిత్ పవార్ కూడా అదే స్థితిలో ఉన్నారు. ఎన్నికల ప్రకటన వెలువడక ముందే రాజకీయ పార్టీలు తమ తురుపు ముక్కలను ప్రయోగిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికల్లో శివసేన నేత ఉద్ధవ్ థాకరే ఎంతో కష్టపడ్డారని కానీ ఫలితం కాంగ్రెస్, ఎన్.సి.పి కి ఎక్కువ దక్కిందని బిజెపి వ్యాఖ్యానించింది. ఎన్.సి.పి ఓట్లను చీల్చేందుకు అజిత్ పవార్ పార్టీని విడిగా పోటీ చేయించే అవకాశం ఉందని శరద్ పవార్ ఎన్.సి.పి భావిస్తోంది. ఎన్నికల నాటికి ఏం జరుగుతుందో, అనూహ్య పరిణామాలు ఏం జరుగుతాయో చూడాల్సి ఉంది. అసెంబ్లీలోని 288 స్థానాలకు గాను తమ కూటమికి 225 వస్తాయని నెల రోజుల క్రితమే శరద్ పవార్ జోశ్యం చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్ల ప్రాతిపదికన ఈ అంచనాకు వచ్చి ఉండవచ్చు.



> బిజెపితో విడిపోవాలనుకుంటున్నట్లు అజిత్ పవార్ గురించి వార్తలు వస్తున్నాయి. అతగాడి బలం, బలహీనతలేమిటో వెల్లడైనందున అతను బిజెపితో ఉన్నా ఆ ఓటింగ్ ఈసారి రాదు. 'ఇండియా' వేదిక సీట్ల సంఖ్యను గణనీయంగా పెంచుకోగా ఓట్ల రీత్యా 43.71 శాతంతో స్వల్పంగా ఆధిక్యతలో ఉంది. ఈ ఓటింగ్‌ను చూసే బిజెపి భయపడుతోంది. రైతులు, ఇతర తరగతులు కూడా ఆ పార్టీకి దూరమైన తీరు వెల్లడైంది. అందుకే అసెంబ్లీ ఎన్నికలను కుంటి సాకులతో విడిగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ద్వారా పావులు కదిపింది.

2019లో ఒకేసారి ఫలితాలు వెలువడినా బిజెపి కూటమిలో సిఎం పదవి ఎవరికి అనే కుమ్ములాటల కారణంగా ఎన్నికల్లో కూటమిగా పోటీ చేసిన బిజెపి-శివసేన విడిపోయాయి. ఎవరూ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశం లేకపోవటంతో అదే ఏడాది నవంబరు 23న రాష్ట్రపతి పాలన విధించారు. యుపిఎ కూటమిలోని ఎన్.సి.పి లో చీలిక తెచ్చి బిజెపి నేత దేవేంద్ర ఫడ్నవిస్ సి.ఎం, అజిత్ పవార్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అవసరమైన మెజారిటీ లేకపోవటంతో బల నిరూపణ గడువుకు ముందే నవంబరు 26న ఆ ప్రభుత్వం రాజీనామా చేసింది. రెండు రోజుల తరువాత శివసేన, కాంగ్రెస్, మిగిలిన ఎన్.సి.పి నేతలు ఉద్ధవ్ థాకరే సి.ఎం గా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రభుత్వాన్ని ఫిరాయింపులతో పడగొట్టి ఎన్‌సిపి ని చీల్చి షిండే నాయకత్వంలో ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. లోక్‌సభ ఎన్నికలలో ఈ కూటమి దారుణంగా పరాజయం పాలైన సంగతి తెలిసిందే. ఇదే భయం ఇప్పుడూ వెంటాడుతోంది. అసెంబ్లీ గడువు ఈ ఏడాది నవంబరు 26 వరకు ఉంది. మరోవైపున హర్యానాలో 2019లో నూతన ప్రభుత్వం వెంటనే ఏర్పడిన కారణంగా 2024 నవంబరు మూడవ తేదీతో రాష్ట్ర అసెంబ్లీ గడువు పూర్తి కానుంది. ఈ వివరాలను చూసినపుడు మహారాష్ట్ర ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే నాటికి హర్యానా, కాశ్మీరు ఎన్నికల ఫలితాలు వస్తాయి. అక్కడ బిజెపి గెలిస్తే వాటిని చూపి బరిలోకి దిగేందుకు తప్ప మరొకటి దీని వెనుక కనిపించటం లేదు. ఒకవేళ ఓడితే...తరువాత వెంటనే ఢిల్లీ, జార్ఖండ్ రాష్ట్రాల ఎన్నికలు ఉన్నాయి. సాధ్యమైన మేరకు బిజెపి ప్రయోజనాలను కాపాడేందుకు అన్ని వ్యవస్థలను వినియోగించుకొనేందుకు చూస్తున్నది. పోగాలము దాపురించినపుడు అంటారు కదా అదే జరుగుతుంది.

మధ్యలో రెండున్నర సంవత్సరాలు తప్ప మహారాష్ట్రలో రెండింజన్ల పాలనే సాగింది. గడచిన పది సంవత్సరాలలో జరిగిన ఎన్నికలను చూసినపుడు బిజెపి-శివసేన కూటమి ఓట్లు, సీట్లు తగ్గిపోవటం తప్ప పెరిగిన తీరు కనిపించదు. లోక్‌సభ ఎన్నికలు జరిగిన తరువాతే అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ బిజెపి విజయ ప్రభావం అసెంబ్లీ మీద కనిపించలేదు. అవిభక్త శివసేన-బిజెపి కలసి ఉన్న 2014 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డిఏకు 57.86 శాతం ఓట్లు రాగా తరువాత 51.34 శాతానికి, 2024లో ఒక ముక్కతో కలసి 43.55 శాతం తెచ్చుకుంది. సీట్ల రీత్యా 42 నుంచి 17కు పడిపోయాయి. ఎన్.సి.పి అజిత్ పవార్ వర్గానికి 3.60 శాతం ఓట్లు వచ్చాయి. బిజెపితో విడిపోవాలనుకుంటున్నట్లు అజిత్ పవార్ గురించి వార్తలు వస్తున్నాయి. అతగాడి బలం, బలహీనతలేమిటో వెల్లడైనందున అతను బిజెపితో ఉన్నా ఆ ఓటింగ్ ఈసారి రాదు. 'ఇండియా' వేదిక సీట్ల సంఖ్యను గణనీయంగా పెంచుకోగా ఓట్ల రీత్యా 43.71 శాతంతో స్వల్పంగా ఆధిక్యతలో ఉంది. ఈ ఓటింగ్‌ను చూసే బిజెపి భయపడుతోంది. రైతులు, ఇతర తరగతులు కూడా ఆ పార్టీకి దూరమైన తీరు వెల్లడైంది. అందుకే అసెంబ్లీ ఎన్నికలను కుంటి సాకులతో విడిగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ ద్వారా పావులు కదిపింది. రాష్ట్రంలో 'ఇండియా' వేదిక పటిష్టంగా ఉండటం, దేశమంతటా బిజెపి పూర్తి మెజారిటీని తెచ్చుకోవటంలో విఫలం కావటం, కాంగ్రెస్ పుంజుకున్న స్థితి, శివసేన, నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ విచ్ఛిన్నాలను ఎదుర్కొని తమ స్థానం పదిలమే అని నిరూపించుకోవటాన్ని చూశాము. ఈ పూర్వ రంగంలో మరింత ఉత్సాహంతో 'ఇండియా' వేదిక బరిలోకి దిగనుంది. సీట్ల సర్దుబాటు ఇంకా పూర్తి కాలేదు. లోక్‌సభ ఎన్నికలలో పోటీలో లేని వామపక్షాలు, ఇతర పార్టీలను కూడా అసెంబ్లీ ఎన్నికల్లో సర్దుబాటు చేసుకోవాల్సి ఉంది.

హర్యానాతో పాటు జరిగే జమ్ము కాశ్మీరు ఎన్నికలు బిజెపికి ఇష్టం లేకపోయినా సెప్టెంబరు 30వ తేదీలోగా జరపాలన్న సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు తప్పలేదు. హర్యానా విషయానికి వస్తే గడచిన 2014 లోక్‌సభ ఎన్నికలలో త్రిముఖ పోటీ కారణంగా బిజెపి 34.7 శాతం ఓట్లతో పదికి గాను ఏడు సీట్లు తెచ్చుకుంది. 2019లో 58.21 శాతం ఓట్లతో పదికి పది స్థానాలను గెలుచుకుంది. 2024లో 46.11 శాతంతో ఐదు స్థానాలతో సరిపెట్టుకుంది. లోక్‌సభ తరువాత జరిగిన గత రెండు అసెంబ్లీ ఎన్నికలలో త్రిముఖ పోటీలో బిజెపి 33.2 శాతం, 2019లో 36.49 ఓట్లు తెచ్చుకుంది. మరోవైపున కాంగ్రెస్ 2024 లోక్‌సభ ఎన్నికలలో తొమ్మిది సీట్లకు పోటీ చేసి 43.67 శాతం ఓట్లు ఐదు సీట్లు, మిత్రపక్షం ఆమ్ ఆద్మీ ఒక చోట 3.68 ఓట్లు, కూటమిగా 47.61 శాతం తెచ్చుకుంది. బిజెపి 2014లో 90కి గాను 47, తదుపరి ఎన్నికల్లో 40 సీట్లు మాత్రమే తెచ్చుకుంది. జననాయక్ జనతా పార్టీ పది సీట్లు తెచ్చుకోవటంతో ఫలితాల తరువాత దానితో కలసి సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. తాజా లోక్‌సభ ఎన్నికల నాటికి బిజెపితో విడిపోయి పది సీట్లకు పోటీ చేసి నామమాత్రంగా ఓట్లు తెచ్చుకుంది. అసెంబ్లీ ఎన్నికలలో ఎలా ఉండేది చూడాల్సి ఉంది. బిజెపి గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటున్నది. ◆

పాడి రైతులకు పరిహారం ఏదీ?

- మూడేళ్లు గడిచినా అందని బీమా డబ్బులు
- సాంకేతిక ఇబ్బందులే కారణమని చెప్తున్న అధికారులు
- ప్రభుత్వం చొరవ చూపాలని కోరుతున్న పెంపకందారులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మృత్యువాత పడిన పశువులకు చెల్లించే పరిహారం అందకపోవడంతో మూడేళ్లుగా పాడి రైతులు కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్థకశాఖ అధికారుల చుట్టూ పాడి రైతులు తిరుగుతున్నారు. గత ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమాకు మొదటి సంవత్సరం సొమ్ములు చెల్లించినా ఆ తర్వాత నుంచి ఆపేసింది. ఆర్‌బిఐలో సాంకేతిక సమస్యలంతో డబ్బులు నిలిచిపోయాయంటూ చెప్తూ వచ్చింది. వైసిపి అధికారంలో ఉన్నన్నాళ్లు ఈ సమస్యకు పరిష్కారం చూపించలేకపోయింది. దీంతో టిడిపి కూటమి ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. పరిహారం చెల్లింపులకు ఉన్న సాంకేతిక ఇబ్బందులు పరిష్కారానికి చొరవ చూపాలని పశుపెంపకందారులు కోరుతున్నారు.

వైఎస్సార్ పశు బీమా పథకం అమలుకు ముందు వైఎస్సార్ పశునష్ట పరిహారం పేరుతో 2019 నుంచి అమలు చేసింది. నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు మృత్యువాత పడిన పశువులకు ఎటువంటి డబ్బులు తీసుకోకుండానే పరిహారం కోసం పేర్లను నమోదు చేసుకున్నారు. తొలత కొంతమందికి డబ్బులు చెల్లించినా మిగిలిన వారికి రెండేళ్లుగా డబ్బులు చెల్లించడం లేదు. జిల్లాలో 4,458 పశువులకు పరిహారం సొమ్ము చెల్లించాల్సి ఉంది. 2021 జూన్ నుంచి పరిహారం చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి. తాము బిల్లులు పంపినా రిజర్వు బ్యాంకు



కార్డ్‌లతో క్లియరెన్స్ కావడం లేదని అధికారులు చెప్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ అంశాన్ని పట్టించుకోకపోవడంతో రెండున్నరేళ్లుగా రైతులు పరిహారానికి నోచుకోవడం లేదు. ఇన్సూరెన్స్ సొమ్ములు ఎప్పుడు వస్తాయంటూ పశుసంవర్థకశాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. అనేక పర్యాయాలు ప్రజాప్రతినిధులను కలిసి తమ సమస్యను మొరపెట్టుకున్నారు. కొత్తగా పశువు కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు.

రూ.12.50 కోట్ల మేర బకాయిలు

పాడి రైతులు పశువుల బీమాకు ఎటువంటి ప్రీమియం చెల్లించనవసరం లేదని, ప్రభుత్వమే చెల్లిస్తుందని చెప్పడంతో ఆ రైతా సొంతంగా బీమా చేయించుకోలేదు. 2020 నుంచి ఈ పథకం ద్వారా ఎవరికీ లబ్ధి చేకూరడం లేదు. పశువుల బీమా ఉంటే మేలుజాతి పశువు మృతి చెందితే రూ.30 వేలు, సాధారణ రకమైతే రూ.15 వేలు చెల్లిస్తారు. పశువు మృతి చెందిన 24 గంటల్లో రైతు పశువైద్యాధికారికి సమాచారం ఇస్తే, 48 గంటల్లో పోస్టుమార్టం పూర్తి చేసి ఆ పై సంబంధిత డాక్యుమెంట్లను ఆన్‌లైన్ చేసేవారు. పశుసంవర్థకశాఖ డీడీ, ఎడి, ఇద్దరు పశువైద్యుల బృందం క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసేవారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత ఆమోదం తెలిపేవారు. పశువులకు సంబంధించి రూ. 12.50 కోట్ల బకాయిలు ఉన్నాయి.

కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు

క్లయిమ్‌లను పరిష్కరించాలని పశుపెంపకందారులు, రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం కనిపించడం లేదు. దీంతో వారు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, రైలు, రోడ్డు ఇతర ప్రమాదాలు, ఇతర వ్యాధుల బారిన పడి వేలాది పశువులు మృత్యువాత పడ్డాయి. కొత్తగా పశువుల కొనుగోలుకు చేతిలో చాలినంత డబ్బులు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. పశువుల పెంపకం మీదే ఆధారపడి బతుకుతున్న కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులను చవిచూస్తున్నారు. కనీసం ఇన్సూరెన్స్ డబ్బులు వచ్చినా కొంతమేర ఉపయోగపడేవని రైతులు వాపోతున్నారు. మండలాల్లోని వెటర్నరీ ఆస్పత్రులు, పశుసంవర్థకశాఖ కార్యాలయం చుట్టూ క్లయిమ్‌దారులు ప్రదక్షిణలు చేస్తున్నా ఫలితం ఉండడం లేదు.

రెండు పూటలా తాగునీరందిస్తాం

- కలామ్ పార్క్‌లో బోటు షికారు ఏర్పాటు
- మంత్రి నిమ్మల రామానాయుడు

ప్రజాశక్తి - పాలకొల్లు (పశ్చిమగోదావరి జిల్లా)

పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణ ప్రజలకు రెండు పూటలా తాగునీరందిస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఆయన సోమవారం ఎపిజె అబ్దుల్ కలామ్ హెల్త్ పార్క్, కుళాయి చెరువు, ఎంఎల్ డి.ఫిల్టరేషన్ ప్లాంటును మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. పార్కు చెరువుకు జెట్టీలు ఏర్పాటు చేసి బోటు షికారు ఏర్పాటు చేసి పర్యాటకులను మరింత ఆకర్షించేలా అభివృద్ధి చేయాలని మున్సిపల్ అధికారులను మంత్రి ఆదేశించారు.

కుళాయి చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలు, చెత్తాచెదారం తొలగించాలని, తాగునీటి చెరువును పరిశుభ్రంగా ఉంచి, పాదచారులకు ఏ ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ సురక్షితమైన తాగునీటితోనే ఆరోగ్యం సాధ్యమని, తాగునీటి పథకాలపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. ప్రస్తుత జనాభాకు అనుగుణంగా తాగునీటిని అందించాలనే ఉద్దేశంతో ఆనాడు రూ.15 కోట్లతో పంపులు, ఫిల్టర్ బెడ్లు, రెండు ఓవర్‌హెడ్ ట్యాంకులు పూర్తి చేశామని చెప్పారు. అయితే దానికి అనుగుణంగా పైపులైను విస్తరణ జరగకపోవడం వల్ల గంట మాత్రమే తాగునీరు వస్తుందని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. భవిష్యత్తులో పెరగబోయే జనాభాను దృష్టిలో పెట్టుకుని మరో 10 ఎంఎల్‌డి కెపాసిటీ పెంచడానికి అంచనాలు సిద్ధం చేయమని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి.విజయసారథి, మున్సిపల్ ఇంజినీర్ కె.రాజకుమార్, ఎఇ ఎం.సాంబశివుడు, నాయకులు జివి, పెచ్చెట్టి బాబు, ఉన్నమట్ల కబర్ధి, రావూరి సుధ, కర్నేని గౌరునాయుడు, మహ్మద్ జానీ, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, బుగ్గే ఆనంద్, పొట్నూరి శ్రీనివాస్, సిడగం సూర్య, బత్తుల నిర్మలాకుమారి, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మంత్రి రామానాయుడు

యోగా శిక్షకులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రభుత్వ హోమియో వైద్యశాల ఆధ్వర్యాన రాకోడులోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో యోగా శిక్షకులుగా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ పి. సత్యేంద్ర కుమార్ తెలిపారు. యోగా శిక్షకులుగా పనిచేసేవారు ఎమ్మెస్సీ యోగా, పీజీ డిప్లొమో ఇన్ యోగా , డిప్లొమో ఇన్ యోగాలో అనుభవం ఉన్నవారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి గంటకు రూ 250 గౌరవవేతనం చెల్లిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 31 లోగా ప్రభుత్వ హోమియో వైద్యశాల రాకోడులో అందజేయాలని తెలిపారపు. మరిన్ని వివరాలకు 9440996888, 8639097379 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

పారదర్శకంగా బదిలీలు

- ఎవరూ దళారులను ఆశ్రయించొద్దు
- త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్, కోటబొమ్మాళి

ప్రభుత్వ ఉద్యోగులకు చేపడుతున్న సాధారణ బదిలీలను జిల్లాలో పారదర్శకంగా చేపడతామని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. టెక్కలి, కోటబొమ్మాళిలో అన్న క్యాంటీన్లను సోమవారం మంత్రి ప్రారంభించి స్వయంగా వడ్డించారు. అనంతరం టెక్కలిలో మూడు కొత్త ఆర్‌టిసి బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బదిలీల కోసం దళారులను ఆశ్రయించి మోసపోద్దని సూచించారు. అర్హత, నిబంధనల ప్రకారం అందరికీ బదిలీల్లో న్యాయం చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం రూ.13 లక్షల కోట్ల అప్పులు చేసిందని, ప్రస్తుతం ఆదాయం కనిపించే పరిస్థితి లేదన్నారు. అయినా ఇచ్చిన మాట తప్పకుండా హామీలన్నీ అమలు చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా ఇప్పటికే పెన్షన్లను రూ.నాలుగు వేలకు పెంచామని, అన్న క్యాంటీన్లు, ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేశామన్నారు. టెక్కలి నియోజకవర్గంలో ఒక పూట ప్రజల నుంచి వినతులు స్వీకరించడానికి, మరో పూట క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించేందుకు నిర్ణయించుకున్నానని తెలిపారు. ప్రతి వీధి తిరుగుతూ సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

త్వరలోనే మహిళలకు ఉచిత ప్రయాణం

తెలుగుదేశం ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు త్వరలోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేస్తుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. కర్ణాటక, తెలంగాణలో అమలవుతున్న విధానాన్ని ఇప్పటికే అధ్యయనం చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలోనూ త్వరలోనే అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పేదలకు రూ.ఐదుకే కడుపు నిండా భోజనం పెట్టే సంకల్పంతో అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గతంలో టిడిపి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేసి, రూ.ఐదుకే నాణ్యమైన భోజనం అందించిందని గుర్తుచేశారు.

2019లో అధికారం చేపట్టిన జగన్ ప్రభుత్వం వాటిని మూసివేసి పేదల పొట్ట కొట్టిందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్న క్యాంటీన్ల ప్రారంభంతో నిరూపితమైందన్నారు. కోటబొమ్మాళిలో ప్రతిరోజూ 400 మందికి, టెక్కలిలో 300 మందికి సరిపడేలా రూ.5కే మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించినట్లు తెలిపారు. త్వరలో ఉదయం అల్పాహారం, రాత్రి భోజనాన్నీ ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజా ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. అన్న క్యాంటీన్లకు రూ.లక్ష ఆర్థికసాయం అందించిన కోటబొమ్మాళికి చెందిన డాక్టర్ బలగ మురళి, రూ.పది వేలు అందించిన జామి చలపతిరావును మంత్రి అభినందించారు. దాతలు అన్న క్యాంటీన్లకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని మంత్రి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా ప్రజారవాణాధికారి విజయ్ కుమార్, ఆర్‌టిసి టెక్కలి డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు, టిడిపి టెక్కలి, నందిగాం, కోటబొమ్మాళి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు, పినకాన అజయ్ కుమార్, బోయిన రమేష్, తెలుగు మహిళ మండల అధ్యక్షులు మెండ దమయంతి, నాయకులు ఎల్.ఎల్ నాయుడు, చాపర గణపతిరావు, హనుమంతు రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, టి.రామకృష్ణ, కర్రి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయు రిజిస్ట్రార్‌గా ధనుంజయరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా జియాలజీ విభాగం ఆచార్యులు ఇఎన్.ధనుంజయరావు నియమితులయ్యారు. ఈ మేరకు ఎయు వీసీ ఆచార్య జి.శశిభూషణరావు నుంచి ఉత్తర్వులను స్వీకరించారు. ఎయు రెక్టార్‌గా ఆచార్య ఎన్.కిషోర్‌బాబు, అకడమిక్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య కె.ఈశ్వర్‌కుమార్, ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్‌గా ఆచార్య చల్లా రామకృష్ణ, సీడీసీ డీన్‌గా ఆచార్య టివి.కృష్ణ, స్టూడెంట్ ఎఫైర్స్ ఇంచార్జి డీన్‌గా డాక్టర్ జి.రాంబాబు, ఎఇఆర్‌సి గౌరవ డైరెక్టర్‌గా డాక్టర్ బి.లిల్లీ గ్రేస్, కంప్యూటర్ సెంటర్ అసోసియేట్ డీన్‌గా డాక్టర్ కె.వెంకటరమణ, స్టూడెంట్ ఎఫైర్స్ అసోసియేట్ డీన్‌లుగా డాక్టర్ ఎస్ఎం.యుగంధర్, డాక్టర్ ఎస్.హరనాథ్, గాంధీ అధ్యయన కేంద్రం డైరెక్టర్‌గా డి.రామారావు, ఐఎఎస్ఇ ఇంచార్జి ప్రిన్సిపల్‌గా డాక్టర్ డి.నాగరాజకుమారిలు నియమితులయ్యారు.

బాధ్యతల స్వీకరణ

ఆంధ్రవిశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా ఆచార్య ఇఎన్.ధనుంజయరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు వర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రస్తుతం ఆచార్య ధనుంజయరావు ఎయు అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల డీన్‌గా సుదీర్ఘ కాలం నుంచి సేవలందిస్తున్నారు. విభిన్న దేశాలకు చెందిన విద్యార్థులు ఏయూలో ఉన్నత విద్యను అభ్యసించే విధంగా అవసరమైన చర్యలు తీసుకోవడం, జాతీయ స్థాయిలో ఎయు ఇమేజ్ పెంపొందించడంలో ఆయన చేసిన కృషి ఎంతో ప్రత్యేకం. ఆచార్య ధనుంజయరావు ప్రత్యేక చొరవతో ఎయు వెయ్యి మందికిపైగా విదేశీ విద్యార్థులకు స్థానం కల్పించడం సాధ్యపడింది. ఆచార్య ధనుంజయరావు గతంలో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌గా, ఇంచార్జి వీసీగా సేవలందించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఓషన్ డెవలప్‌మెంట్, ఒఎన్‌జిసి, డిఎస్‌టికి సంబంధించిన విభిన్న ప్రాజెక్టులను ఆయన నిర్వహించారు.

రెక్టార్‌గా కిషోర్‌బాబు

ఆంధ్రవిశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆచార్యులు ఎన్.కిషోర్‌బాబు రెక్టార్‌గా నియమితులయ్యారు. ఆయన 30 సంవత్సరాల బోధన అనుభవం కలిగి ఉన్నారు. ఏయూ అకడమిక్ డీన్‌గా, రిజిస్ట్రార్‌గా, రీసెర్చ్ స్కాలర్స్ హాస్టల్ చీఫ్ వార్డెన్‌గా గతంలో పనిచేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ఏపి ఐసెట్ కన్వీనర్‌గా కూడా పనిచేశారు. ఆయన పర్యవేక్షణలో 36 మంది పిహెచ్‌డిలు అందుకున్నారు. ఆచార్య కిషోర్ బాబు 11 పుస్తకాలను రచించారు, 60 కిపైగా పరిశోధన పత్రాలను వివిధ జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురించారు. ఐఎస్‌టిడి నేషనల్ కౌన్సిల్ సభ్యునిగా ఉన్నారు.

డిఆర్‌డిఒ శాస్త్రవేత్తలకు సర్టిఫికెట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ విశాఖపట్నం రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) శాస్త్రవేత్తలకు ఆర్ అండ్ డి మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను సోమవారం ప్రారంభించింది. భారత్‌లోని 36 డిఆర్‌డిఒ ల్యాబ్‌లకు చెందిన 39 మంది అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ప్రోగ్రాం డైరెక్టర్ ప్రొఫెసర్ బి.శ్రీరంగాచార్యులు పాల్గొనేవారికి శిక్షణ మాడ్యూల్స్, ప్రోగ్రామ్ ఫలితాల వివరాలు తెలియజేసారు. ఆర్ అండ్ డి మేనేజ్ మెంట్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్, సిమ్యులేషన్, ఆర్గనైజేషన్ బిహేవియర్ అండ్ హ్యూమన్ రిలేషన్స్ మేనేజ్ మెంట్, ఆర్ అండ్ డి ప్రాసెస్, ఆర్ అండ్ డి సపోర్ట్ ఫంక్షన్స్, టెక్నాలజీ మేనేజ్‌మెంట్, వాణిజ్యీకరణ, వినియోగం, ఇన్నోవేషన్ అండ్ క్రియేటివిటీని పెంపొందించడం, రిస్క్ మేనేజ్‌మెంట్ వంటి కాన్సెప్ట్ అండ్ ప్రిన్సిపల్స్‌తో సహా వివిధ మాడ్యూల్స్‌ను ఈ ప్రోగ్రామ్ లో పొందుపరిచారు.

ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖ)

ఆర్మీ రిక్రూట్మెంట్ ర్యాలీ సోమవారం తెల్లవారుజామున విశాఖ ఆర్‌కె.బీచ్ వద్ద ప్రారంభమైంది. ఈ ర్యాలీ నిర్వహణకు పోర్టు స్టేడియంలో అన్ని ఏర్పాట్లూ చేసినప్పటికీ రాత్రి కురిసిన వర్షం కారణంగా ట్రాక్ అంతా తడిసిపోయింది. బురదగా ఉండటంతో జారుతుందని భావించి జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సూచనతో అధికారులు ఈ ర్యాలీని బీచ్ రోడ్డులో నిర్వహించారు.

పడవ బోల్తాపడి 13 మంది మృతి


- 14మంది గల్లంతు

యెమెన్ : యెమెన్ తీరంలో వలసదారులతో వెళుతున్న పడవ ప్రమాదవశాత్తూ బోల్తాపడి మునిగిపోవడంతో 13 మంది మరణించారు. 14 మంది గల్లంతయ్యారు. ఒక దశాబ్దంగా అంతర్యుద్ధం కొనసాగుతుండటంతో యెమెన్ ప్రజలు ఉపాధి కోసం ధనిక గల్ఫ్ దేశాలకు ఆశ్రయించారు. తూర్పు ఆఫ్రికా నుండి వలస వచ్చినవారు ఈ దేశాలకు చేరుకోవడానికి ఇది ఒక్కటే ప్రధాన మార్గం. 13మంది మృతదేహాలు లభ్యమైనట్లు ఐక్యరాజ్యసమితి మైగ్రేషన్ ఏజెన్సీ ఆదివారం ప్రకటించింది. గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌ను ఎర్ర సముద్రానికి కలిపే బాబ్ అల్-మాండెబ్ జలసంధి ఒడ్డున 11 మంది పురుషులు, ఇద్దరు మహిళల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యెమెన్ జాతీయులతో సహా మరో 14 మంది కనిపించలేదని, వలసదారులు జిబౌటి నుండి బయలుదేరినట్లు ఐఒఎం తెలిపింది.

ఐఓఎం వివరాల ప్రకారం ... జిబౌటి నుండి 25 మంది ఇథియోపియన్లు, ఇద్దరు యెమెన్ జాతీయులతో బని అల్-హకామ్ సబ్‌డిస్ట్రిక్ట్‌లో మంగళవారం యెమెన్‌లోని తైజ్ గవర్నరేట్ తీరంలో దుబాబ్ అనే వలస పడవ బోల్తా పడిందని ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) ఆదివారం తెలిపింది. ఈ ప్రమాదంలో 13 మంది చనిపోయారు. ఓడ మునిగిపోవడానికి గల కారణాలు తెలియరాలేదు. గత జూన్, జూలై నెలల్లో కూడా ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయి.

ప్రత్యామ్నాయ విత్తనాల ధర ఖరారు

- నేటి నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొదలు
- ఏర్పాట్లు చేసిన అధికారులు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎట్టకేలకు ప్రత్యామ్నాయ విత్తనాల ధరాను ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు మంగళవారం నుంచి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను ప్రారంభించనుంది. ఆగస్టులో ఇప్పటికే పదును అయిన సమయంలో ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వలేదని ప్రజాశక్తిలో కథనం ఇచ్చింది. దీనికి వ్యవసాయ శాఖ స్పందించి విత్తన పంపిణీకి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ప్రభుత్వమూ విత్తన ధరలతోపాటు, ఏ రైతుకు ఎంత విత్తనమివ్వాలన్నది నిర్ణయించింది. ఈ ఏడాది ఖరీఫ్‌లో జులై నెలలో వర్షాభావంతో అత్యధిక విస్తీర్ణంలో పంటలు సాగవలేదు. 5.54 లక్షల ఎకరాలు ఖాళీగా ఉంది. ప్రత్యామ్నాయ విత్తనాలను ఇందులో విత్తుకునేందుకు వీలుగా ప్రభుత్వం ప్రత్యామ్నాయం కింద సజ్జ, జొన్న, కొర్రలు, పెసలు, మినుపులు 27,907 క్వింటాళ్లను 80 శాతం సబ్సిడీతో ఇవ్వాలని నిర్ణయించింది.

ఏ రైతుకు ఎంత

ప్రత్యామ్నాయ విత్తనాలను ఏ రైతుకు ఎంతన్నది నిర్ణయించింది. మినుములు, పెసలు నాలుగు కిలోల ప్యాకెట్లు ఇవ్వనున్నారు. అర ఎకరంలోపు భూమి ఉన్న రైతుకు ఒక ప్యాకెట్ ఇస్తారు. అపైన ఎకరంలోపు ఉంటే రెండు ప్యాకెట్లు, ఒకటిన్నర ఎకరంలోపు ఉంటే మూడు ప్యాకెట్లు, రెండు ఎకరాల వరకుంటే నాలుగు ప్యాకెట్లు, రెండున్నర ఎకరాల్లోపుంటే ఐదు, మూడు ఎకరాల్లోపు ఉంటే ఆరు, మూడున్నర ఎకరాలోపు ఉంటే ఏడు, నాలుగు ఎకరాల్లోపుంటే ఎనిమిది, నాలుగున్నర ఎకరాల్లోపుంటే తొమ్మిది, ఐదు ఎకరాల్లోపుంటే పది ప్యాకెట్లు ఇస్తారు. అదే రకంగా కొర్రలు రెండు కిలోల ప్యాకెట్లు ఒకటి నుంచి గరిష్టంగా ఐదు ప్యాకెట్లు ఇస్తారు. జొన్నలు మూడు కిలో ఒక ప్యాకెట్ చొప్పున ఉంటాయి. ఒక ప్యాకెట్ నుంచి ఐదు ప్యాకెట్లు గరిష్టంగా ఇస్తారు. సజ్జలు ఒకటిన్నర కిలో ప్యాకెట్ ఉంటాయి. ఇవి కూడా ఒకటి నుంచి గరిష్టంగా ఐదు ఇస్తారు.

సబ్సిడీ ధరలు ఇలా

ప్రత్యామ్నాయ విత్తనాల సబ్సిడీ ధరలనూ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర మేరకు పెసలు పూర్తి ధర కిలో రూ.130 కాగా 80 శాతం సబ్సీడీ కింద రూ.104 పోనూ రైతుకు కిలోకు రూ.26 చొప్పున చెల్లించాలి. మినుములు పూర్తి ధర కిలో రూ.140 కాగా, సబ్సిడీ రూ.112 ఉంది. రైతుకు కిలో 28తో ఇస్తారు. కొర్రలు కిలో పూర్తి ధర రూ.87.40 కాగా, సబ్సిడీ రూ.69.92 పోనూ రైతుకు రూ.17.82కు అందజేస్తారు. హైబ్రీడ్ రకం జొన్న మూడు కిలోల ప్యాకెట్ ధర రూ.700 కాగా, సబ్సిడీ రూ.560 పోనూ రూ.140కు అందజేస్తారు. పెన్నా, ప్రియ జొన్న రకాలు మాత్రం మూడు కిలోల ప్యాకెట్ ధర రూ.650 కాగా సబ్సిడీ రూ.50 పోనూ, రూ.125 రైతు చెల్లించాల్సి ఉంటుంది. సజ్జలో తారా, మాయ రకాలు పూర్తి ధర ఒకటిన్న కిలో ప్యాకెట్ ధర రూ.370 కాగా సబ్సిడీ 296 పోనూ రైతుకు రూ.74 చెల్లించి ఉంది. సజ్జ పెన్నా, ప్రియ రకాలు మూడు కిలోల ప్యాకెట్ రూ.385కుగానూ రూ.308 సబ్సిడీ రైతుకు రూ.77కి అందజేస్తారు. ఈ విత్తనాలు అవసరమైన రైతులు మంగళవారం నుంచి తమ పేర్లు నమోదు చేసుకునేందుకు వీలుగా అధికారులు ఏర్పాట్లు చేశారు.

సూడాన్‌లో కొట్టుకుపోయిన డ్యామ్ ..

కైరో : సూడాన్‌లో భారీ వర్షాలకు ఓ డ్యామ్ కొట్టుకుపోయింది. వరదనీరు ముంచెత్తడంతో నలుగురు మరణించారని స్థానిక మీడియా తెలిపింది. సూడాన్‌లోని రెడ్ సీ స్టేట్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు అక్కడి అర్బాత్ డ్యామ్ కొట్టుకుపోయినట్లు సూడాన్ ఆరోగ్య మంత్రి ఓ ప్రకటనలో తెలిపారు. పదుల సంఖ్యలో ప్రజలు గల్లంతయ్యారని అన్నారు. వరదలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు సహాయక బృందాలను పంపామని చెప్పారు. సుమారు 60 మంది మరణించారని, చాలా మంది గల్లంతయ్యారని స్థానిక అధికారి ఒకరు స్థానిక మీడియా అల్ ట్యాగ్‌కి తెలిపారు. ప్రమాద తీవ్రత అధికంగా ఉందని రెడ్ సీ స్టేట్ ఉన్నతాధికారి పేర్కొన్నారు.

ఒపిఎస్ తప్ప మరే పెన్షన్ స్కీమ్ అంగీకరించం

- 30న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు
- యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరించాల్సిన ప్రభుత్వం సిపిఎస్ రద్దు చేయకుండా యునిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) తీసుకురావడం దారుణమని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి అన్నారు. తక్షణం దేశమంతటా పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్) అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నిరసిస్తూ ఈ నెల 30న అన్ని తాలూకా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో ఈ నిరసన ప్రదర్శనల్లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిపిఎస్ రద్దు చేయాలని, పాత పెన్షన్ పునరుద్ధరించాలని వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఇలా యుపిఎస్‌ను ముందుకు తీసుకురావడం తీవ్ర ఆక్షేపణీయమని పేర్కొన్నారు. సిపిఎస్ కంటే మెరుగైనది యుపిఎస్ అంటూ కేంద్రం అంకెల గారడీ చేసిందని విమర్శించారు. ఉద్యోగుల, ఉపాధ్యాయుల వాటాతో సంబంధం లేకుండా అన్ని రకాల సదుపాయాలు ఉండే పాత పెన్షన్ కంటే మరేదీ అంగీకారం కాదని పేర్కొన్నారు. గత రాష్ట్ర ప్రభుత్వం 2022 ఏప్రిల్ 25న సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకొచ్చిందని, దీనిని యుటియఫ్, ఇతర ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం జిపిఎస్ అమలుకు ముందుకొస్తే నిరసనలు వెల్లువెత్తడంతో తాత్కాలికంగా నిలుపుదల చేసిందని పేర్కొన్నారు. సిపిఎస్, జిపిఎస్, యుపిఎస్ ఏదైనా పెన్షన్ ఉద్యోగుల హక్కు, భిక్షకాదు అని చెప్పిన సుప్రీంకోర్టు తీర్పునకు భిన్నమైనవని విమర్శించారు. తక్షణం పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని కోరారు.



గోపిక, కృష్ణుడు వేషధారణలో నిరసన తెలుపుతున్న చిన్నారులు

'ఇఒ అంకుల్' మా కుటుంబాలను ఆదుకోండి

- కృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారుల వినూత్న నిరసన

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

శ్రీవారి మెట్టు మార్గంలో ఉండే చిరు వ్యాపారస్తుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని కోరుతూ తిరుమల తిరుపతి దేవస్థానం పరిపాలన భవనం ముందు గత ఆరు రోజుల నుండి ఆందోళన జరుగుతోంది. వారికి మద్దతుగా ఆయా కుటుంబాల్లో ఉన్న చిన్నపిల్లలు కృష్ణాష్టమి జయంతి సందర్భంగా కృష్ణులు, గోపికలు వేషధారణలో వచ్చి 'ఇఒ అంకుల్ మా కుటుంబాలను ఆదుకోండి' అంటూ ప్లకార్డులతో నిరసనలో పాల్గొన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.జయచంద్ర మాట్లాడుతూ... చిరు వ్యాపారుల సమస్యలను టిటిడి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. చిన్నారులు సైతం నిరసనలో భాగస్వాములైనా యాజమాన్యానికి దయలేకుండా పోయిందన్నారు. ఎర్రచందనం దొంగలను పట్టించడంలో, సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో వీరి పాత్ర మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో యుగంధర్, చిట్టిబాబు, మల్లికార్జున, లోకనాథం పాల్గొన్నారు.

షాదీ కబ్ కరేంగే..!


- రాహుల్‌కు కాశ్మీరీ యువతుల ప్రశ్న
- 20-30 ఏండ్లుగా భరిస్తున్నా' రాహుల్ గాంధీ

శ్రీనగర్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ముందు మరోసారి పెళ్లి ప్రస్తావన వచ్చింది. షాదీ కబ్ కరేంగే (వివాహం ఎప్పుడు చేసుకుంటారు) అంటూ కాశ్మీరీ యువతులు అడిగారు. ఈ ప్రశ్నకు సమాధానమిస్తూ.. 20, 30 ఏళ్లుగా ఈ ఒత్తిడిని భరిస్తున్నానని రాహుల్ చెప్పుకొచ్చారు.

జమ్ముకాశ్మీర్‌లో పర్యటించిన రాహుల్.. శ్రీనగర్‌కు చెందిన పలువురు విద్యార్థినులతో ముచ్చటించారు. ఈ సందర్భంలో పెళ్లి చేసుకోవడంపై కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి వస్తోందా? అని రాహుల్‌ను ప్రశ్నించారు. అదే సమయంలో మీ పెళ్లి ఎప్పుడు అంటూ రాహుల్‌నే ఎదురు ప్రశ్న వేశారు. దానికి నవ్వుతూ పై విధంగా బదులిచ్చారు. వివాహం గురించి తదుపరి ప్రణాళికలు ఏంటని రాహుల్‌ని ప్రశ్నించగా.. ప్రస్తుతానికి అటువంటిదేమీ లేదని, వాటిని తోసిపుచ్చలేమని చెప్పారు. అయితే మీ వివాహానికి మమ్మల్నీ ఆహ్వానించండి అంటూ అక్కడున్న విద్యార్థినులు కోరగా.. తప్పకుండా పిలుస్తానంటూ రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించిన వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేశారు.

ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల సమయంలో సోదరి ప్రియాంకా గాంధీతో కలిసి రాయ్‌బరేలీలో ప్రచారంలో పాల్గొన్న ఆయనకు.. పార్టీ అభిమానుల నుంచి ఇదే ప్రశ్న ఎదురైంది. పెండ్లి ఎప్పుడు చేసుకుంటారు? అన్న ప్రశ్నకు.. 'ఇక తొందరగా చేసుకోవాలి' అని బదులిచ్చిన విషయం తెలిసిందే.

యుపిఎస్ వద్దు...



- ఒపిఎస్ కొనసాగించాలని ఉద్యోగ సంఘాల డిమాండ్
- ఉద్యోగుల భాగస్వామ్య వాటా ఎందుకని నిలదీత

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఏకీకృత పెన్షన్ పథకం (యుపిఎస్)ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘాలు తిరస్కరించాయి. పాత పెన్షన్ పథకం (ఒపిఎస్)ను కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నాయి. అందుకోసం పోరాటానికి సంసిద్ధమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న నేషనల్ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పిఎస్), ఇప్పుడు కొత్తగా తెచ్చిన యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యుపిఎస్) వద్దని, గతంలో రద్దు చేసిన పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను తిరిగి పునరుద్ధరించేవరకూ పోరాటం కొనసాగుతుందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు స్పష్టం చేశాయి. కేంద్ర ప్రభుత్వ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ సంఘాలు, ఎస్‌టిఎఫ్‌ఐ, బిఎస్‌ఎన్‌ఎల్, ఇన్సూరెన్స్, రైల్వే, బ్యాంక్, రక్షణ, పోర్టు, స్టీల్‌ప్లాంట్, ట్రాన్స్‌ఫోర్టు, పోస్టల్, డాక్‌యార్డ్, ఎలక్ట్రిసిటీ, యూనివర్సిటీ, ఉపాధ్యాయ తదితర రంగాల ఉద్యోగ సంఘాలు వ్యతిరేకించాయి. సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి వంటి కార్మిక సంఘాలు యుపిఎస్‌ను వ్యతిరేకించగా, బిజెపి అనుబంధ బిఎంఎస్ ఒక్కటే యుపిఎస్‌ను స్వాగతించింది.

కేంద్ర మంత్రి వర్గం ఆమోదించిన యుపిఎస్‌పై కేంద్ర, రాష్ట్ర ఉద్యోగ సంఘాల ఉమ్మడి వేదిక నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్ స్పష్టమైన వైఖరిని వెల్లడించింది. ఎన్‌పిఎస్‌కు యుపిఎస్ ప్రత్యామ్నాయంగా ప్రచారం చేస్తోందని, ఎన్‌పిఎస్‌కు యుపిఎస్ ఎన్నటికీ ప్రత్యామ్నాయం కాదని స్పష్టం చేసింది.

ఒపిఎస్ ఉన్నప్పుడు ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులు చివరిగా డ్రా చేసిన ప్రాథమిక జీతం, డియర్‌నెస్ అలవెన్స్ (డిఎ)లో సగానికి సమానమైన పెన్షన్‌కు అర్హులు. యుపిఎస్‌లో అలాంటిదేమీ లేదని పేర్కొంది. 2004లో ప్రవేశపెట్టిన ఎన్‌పిఎస్ కింద ఉద్యోగులు ప్రాథమిక జీతంలో 10 శాతం, డిఎను పెన్షన్ ఫండ్‌కు జమ చేయగా, ప్రభుత్వం 14 శాతం జమ చేస్తుంది. ఎన్‌పిఎస్ కింద పెన్షన్ మొత్తం, ఒపిఎస్ కంటే తక్కువగా ఉంటుంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన యుపిఎస్ కింద, ఒక ఉద్యోగి ప్రాథమిక జీతంలో 10 శాతం కంట్రిబ్యూట్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ వాటా 18.5 శాతానికి పెరుగుతుంది. పెన్షన్ చివరి 12 నెలల జీతం, డిఎ సగటులో సగానికి సమానంగా ఉంటుంది. దీనివల్ల ఉద్యోగికి నష్టం వాటిళ్లుతుంది.

యుపిఎస్ కింద కాంట్రిబ్యూట్ చేసిన మొత్తం రిస్క్ ప్రొఫైల్‌లు తెలియని ఆస్తులలో పెట్టుబడి పెట్టబడతాయని ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన డెమోక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ (డిటిఎఫ్) తెలిపింది. 'యుపిఎస్‌ను ఎంచుకున్న సర్వీస్‌లో ఉన్న ఉద్యోగులు తప్పనిసరిగా మరింత కంట్రిబ్యూట్ చేయాల్సి ఉంటుంది. యుపిఎస్ కార్పస్ అంటే నేటి పెన్షన్ చెల్లించడానికి రేపటి పెన్షన్ త్యాగం చేయబడుతుంది. యుపిఎస్ కార్పస్ మూలధన నష్టాలకు దారితీయవచ్చు. ఇప్పటికే ఉన్న పెన్షనర్లకు పెన్షన్, డియర్నెస్ రిలీఫ్ (డిఆర్) చెల్లించడంలో విపరీతమైన జాప్యం జరుగుతుంది' అని డిటిఎఫ్ తెలిపింది. 'ఒపిఎస్ కింద ఉద్యోగులు 20 సంవత్సరాల సర్వీసు తరువాత పూర్తి పెన్షన్‌కు అర్హులయ్యారు. అదే యుపిఎస్‌లో 25 సంవత్సరాలు ఎందుకు? ఒపిఎస్ కోసం మేము పోరాటం కొనసాగిస్తాం' అని ఉద్యోగ సంఘం నేత విజయ్ కుమార్ బంధు అన్నారు.

అకడమిక్స్ ఫర్ యాక్షన్ అండ్ డెవలప్‌మెంట్ టీచర్స్ అసోసియేషన్ '40 ఏళ్ల తరువాత నియమితులైన ఉద్యోగులకు యుపిఎస్ అర్థం లేనిది' అని పేర్కొంది. ఎందుకంటే వారు 25 సంవత్సరాల సర్వీసును పూర్తి చేయలేరు. 'అకడమిక్స్‌లో ప్రవేశ వయసు సాధారణంగా ఎక్కువగా ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి ఉపాధ్యాయులు, ఉద్యోగుల విషయంలో వారి ఉద్యోగ విరమణ కాలం చాలా తక్కువగా ఉంటుంది' అని పేర్కొంది. ఒపిఎస్ కింద పెన్షన్‌లను సమీక్షించే, పే కమిషన్‌తో యుపిఎస్ లింక్ చేయబడుతుందనే విషయంలో స్పష్టత లేదని పేర్కొంది.

ఆలిండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎఐఎస్‌జిఇఎఫ్) ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేసింది. ఎన్‌పిఎస్‌కు మరో రూపమే యుపిఎస్ అని పేర్కొంది. యుపిఎస్ కూడా ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఆమోదించిన గ్యారెంటీ పెన్షన్ స్కీమ్ (జిపిఎస్) లాంటిదేనని, కేంద్ర ప్రభుత్వం కూడా అదే ఫార్ములాను ఆమోదించిందని విమర్శించింది. కేంద్ర ప్రభుత్వం కంట్రిబ్యూట్ చేసిన 18.5 శాతం షేర్ మార్కెట్‌లో పెట్టడం వల్ల కార్పొరేట్లకు సహాయ పడుతుందని, గతేడాదిలో ఎన్‌పిఎస్ ద్వారా రూ.పది లక్షల కోట్లు షేర్ మార్కెట్‌లో పెట్టారని తెలిపింది.

కుదిరిన సర్దుబాట్లు

- జమ్ము కాశ్మీర్‌లో 51 స్థానాల్లో ఎన్‌సి, 32 స్థానాల్లో కాంగ్రెస్ పోటీ
- సిపిఐ (ఎం), పాంథర్ పార్టీ చెరో స్థానంలో పోటీ
- ఐదు స్థానాల్లో స్నేహపూర్వక పోరుకు అంగీకారం

శ్రీనగర్ : జమ్మూ కాశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్, కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకంపై రాజీ కుదిరింది. రెండు పార్టీలు 85 స్థానాల్లో తమ అభ్యర్థులను బరిలోకి దించనున్నాయి. ఇందులో ఫరూక్ అబ్దుల్లా నేషనల్ కాన్ఫరెన్స్ 51 స్థానాల్లో, కాంగ్రెస్ 32 స్థానాల్లో పోటీ చేయనున్నాయి. సిపిఐ (ఎం), పాంథర్స్‌కు ఒక్కో సీటు ఇచ్చేందుకు అంగీకారం కుదిరిందని, సీట్ల పంపకం కోసం కాంగ్రెస్‌తో చర్చలు పూర్తయ్యాయని ఫరూక్ అబ్దుల్లా ప్రకటించారు. ఐదు సీట్లు స్నేహపూర్వక పోరుకు మిగిలాయని అంగీకారం కుదిరింది. జమ్ము కాశ్మీర్‌ను కాపాడటమే ఇండియా బ్లాక్ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ అన్నారు. కలిసికట్టుగా పోరాడి విజయం సాధించి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. పార్టీ పోటీ చేసే స్థానాల జాబితా, అభ్యర్థుల పేర్లను తగిన సమయంలో విడుదల చేస్తామని జమ్ము కాశ్మీర్ కాంగ్రెస్ అధ్యక్షుడు తారిఖ్ హమీద్ కర్రా తెలిపారు.

లఢక్‌లో ఐదు కొత్త జిల్లాలు : కేంద్ర హోం శాఖ ప్రకటన

కేంద్రపాలిత ప్రాంతం లఢక్‌లో ఐదు కొత్త జిల్లాలను కేంద్రం ఏర్పాటుచేసిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా సోమవారం ప్రకటించారు. జంస్కర్, డ్రాస్, షామ్, నుబ్రా, ఛాంగ్‌థంగ్ జిల్లాలను ఏర్పాటు చేసినట్లు సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. లఢక్ ప్రజలకు సమృద్ధిగా అవకాశాలను కల్పించేందుకు మోడీ ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు.

తొలి జాబితాతోనే బిజెపిలో లుకలుకలు

జమ్ముకాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బిజెపి సోమవారం 44 మంది అభ్యర్థులతో తొలి జాబితాను విడుదల చేసింది. ఈ జాబితాతోనే బిజెపి పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, లుకలుకలు బయటపడ్డాయి. అభ్యర్థులపై కొంతమంది కార్యకర్తలు, నాయకులు అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేయడంతో తరువాత ఈ సంఖ్యను 16కు బిజెపి తగ్గించింది. ఈ 16 మందిలో ముగ్గురు మాజీ ఎమ్మెల్యేలు, ఒక మహిళా అభ్యర్థి ఉన్నారు. పాంపోర్, షోపియాన్, అనంత్‌నాగ్ వెస్ట్, అనంత్‌నాగ్ వంటి స్థానాలకు బిజెపి అభ్యర్థులను ప్రకటించింది. ఇక్కడ మొత్తం 90 అసెంబ్లీ స్థానాలు ఉండగా, సెప్టెంబరు 18న తొలి దశ ఎన్నికలు జరగనున్నాయి.

25 మంది మావోయిస్టుల లొంగుబాటు

బీజాపూర్ : ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో 25 మంది మావోయిస్టులు లొంగిపోయినట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు సోమవారం తెలిపారు. వీరిలో ఐదుగురు మావోయిస్టులపై రూ. 28 లక్షల రివార్డు ఉందని అన్నారు. గంగ్లూర్, భైరామ్‌గఢ్ ప్రాంతాల్లో వీరు యాక్టివ్‌గా ఉండేవారని, వారిలో ఇద్దరు మహిళలు కూడా ఉన్నట్లు తెలిపారు. శంబటి మడ్కం (23), జ్యోతి పునెం (27) ఇద్దరు మహిళలతో పాటు మహేష్ తేలంలు ఒక్కొక్కరిపై రూ.8 లక్షల రివార్డు ఉందని చెప్పారు. విష్ణు కార్తమ్ అలియాస్ మోనూ (29), జయదేవ్ పొడియమ్ (18)ల ఒక్కొక్కరిపై రూ. 3 లక్షలు, లక్ష రూపాయల రివార్డు ఉన్నట్లు తెలిపారు. గుడ్డు కకేమ్ (20), సుద్రు పూణెం (32)లపై చెరో రూ.10,000 చొప్పున రివార్డు ఉందని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు ఒక్కొక్కరికి రూ. 25,000 సాయం, ప్రభుత్వ పాలసీ ప్రకారం పునరావాస సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. వీరితో కలిపి మొత్తం 170 మంది మావోయిస్టులు లొంగిపోయారని, మరో 306 మందిని అరెస్ట్ చేశామని ఎస్పి వివరించారు.

ఓపెన్ జైళ్లపై పూర్తి సమాచారం ఇవ్వండి

- రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సుప్రీం ఆదేశం

న్యూఢిల్లీ : ఓపెన్ జైళ్ల పనితీరుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని నాలుగు వారాల్లోగా అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. సెమీ-ఓపెన్ లేదా ఓపెన్ జైళ్లు అనేవి ఖైదీలు జీవనోపాధిని సంపాదించడానికి పగటిపూట ప్రాంగణం వెలుపల పనిచేసి సాయంత్రం తిరిగి రావడానికి ఖైదీలను అనుమతిస్తాయి. ఖైదీలు సమాజంతో కలిసిపోవడానికి, బయట సాధారణ జీవితాలను గడపడానికి, ఖైదీలు ఎదుర్కొంటున్న మానసిక ఒత్తిడిని తగ్గించడానికి ఈ ఓపెన్, సెమీ-ఓపెన్ జైళ్లను ప్రవేశపెట్టారు. జైళ్లలో రద్దీకి సంబంధించిన సమస్యల విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జులై 15న విచారణలో కూడా ఇలాంటి ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపింది. గుజరాత్, హర్యానా, జమ్మూకాశ్మీర్, మహారాష్ట్ర, మణిపూర్, నాగాలాండ్, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, దాద్రా అండ్ నగర్ హవేలీ, డామన్ అండ్ డయ్యూ, లక్షద్వీప్, పుదుచ్చేరి, లడఖ్ వంటి రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు ఇంకా తమ స్పందన తెలియజేయలేదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. మే 9న విచారణ సందర్భంగా ఖైదీల పునరావాస సమస్యను కూడా పరిష్కరించేందుకు ఓపెన్ జైళ్లను ఏర్పాటు చేయడం ఒక పరిష్కారమని సుప్రీం కోర్టు పేర్కొంది.

రైతుల ఆందోళనపై బిజె.పి ఎంపి కంగనా చౌకబారు వ్యాఖ్యలు

- క్షమాపణలు చెప్పాల్సిందేనన్న ఎస్‌కెఎం



న్యూఢిల్లీ : మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ పొలిమేరల్లో రైతులు ఏడాదిపాటు సాగించిన మహోన్నత పోరాటంపై బాలీవుడ్ నటి, మండి ఎంపీ కంగనా రనౌత్ మరోసారి నోరుపారేసుకున్నారు. ఆమె వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతుండడం, అందులోనూ హర్యానా ఎన్నికల్లో బిజెపికి ఇది ఎక్కడ బూమరాంగ్ అవుతుందోనన్న భయంతో బిజెపి నాయకత్వం ఆమె ప్రకటనతో పార్టీకి సంబంధం లేదని విడగొట్టుకునే యత్నం చేసింది. కంగనా ఇంతకుముందు ఒకసారి ఇలాగే రైతు ఉద్యమంపై నోరు పారేసుకున్నారు. అప్పుడామెను ఎగడోసిన బిజెపి నాయకత్వం ఇప్పుడు ఆమె ప్రకటనతో విడగొట్టుకోడానికి ప్రయత్నించడానికి హర్యానా అసెంబ్లీ ఎన్నికలే కారణం. రాజకీయ అవతారమెత్తిన ఈ బాలీవుడ్ నటి రైతు ఉద్యమాన్ని ఎదుర్కోవడంలో బిజెపి అగ్ర నాయకత్వం దృఢంగా వ్యవహరించబట్టి సరిపోయింది. లేకుంటే భారత్ మరో బంగ్లాదేశ్‌గా మారిపోయేదన్నారు. బంగ్లాదేశ్‌లో హసీనా ప్రభుత్వ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా అక్కడ విద్యార్థులు పెద్దయెత్తున ఉద్యమించడంతో, ఆమె తన పదవికి రాజీనామా చేసి దేశం వీడి పారిపోయిన సంగతి తెలిసిందే. రైతు ఉద్యమాన్ని అప్రతిష్ట పాల్జేసేందుకు బిజెపి అదే పనిగా ఆనాడు దుష్ప్రచారం సాగించింది. విదేశీ శక్తులు రైతుల సాయంతో భారత్‌ను నాశనం చేయాలని కుట్ర పన్నాయని, మన నాయకత్వానికి దూరదృష్టి లేకుంటే వారు విజయం సాధించి ఉండేవారని కంగనా బాధ్యతారహిత వ్యాఖ్యలు చేశారు. మూడు వ్యవసాయ చట్టాలను మోడీ ప్రభుత్వం రద్దు చేస్తుందని రైతులు ఊహించి ఉండరని ఆమె చెప్పుకొచ్చారు. ఇప్పటికీ ఆందోళనల పేరుతో వారు సరిహద్దుల్లో కూర్చుంటున్నారని అన్నారు. అక్కడితో ఆమె ఆగలేదు. రైతుల ఆందోళనల కారణంగానే మహిళలపై దాడులు, లైంగికదాడులు జరుగుతున్నాయంటూ పచ్చి అబద్ధాలను ప్రచారం చేశారు. కంగనా రనౌత్ చేసిన నేలబారు వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో బిజెపి దిక్కుతోచని స్థితిలో పడింది.

కంగనావి సిగ్గు చేటు వ్యాఖ్యలు ! సిపిఎం ఖండన

మూడు వ్యవసాయ చట్టాలకు నిరసనగా రైతులు సాగించిన పోరాటాన్ని విదేశీ శక్తుల సాయంతో దేశాన్ని అస్థిరపాల్జేసేందుకు సాగించిన జాతి వ్యతిరేక శక్తుల కుట్రగా పేర్కొనడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండించింది. కంగనావి సిగ్గుచేటు వ్యాఖ్యలని పేర్కొంది. దేశంలో జరుగుతున్న అత్యాచారాలు, హత్యలను రైతుల ఉద్యమంతో ముడిపెట్టడానిన్ని తప్పుపట్టింది. నిజానికి రైతులు ఆందోళన సాగిస్తున్న సమయంలో లఖింపూర్ ఖేరిలో రైతులను హత్య చేసింది బిజెపి నేతలేనన్న విషయాన్ని సిపిఎం గుర్తు చేసింది. రైతుల నిరసనల సందర్భంగా మొత్తంగా 736మంది రైతులు అమరవీరులయ్యారని తెలిపింది. ఇటువంటి ప్రమాదకరమైన వ్యాఖ్యలు చేసినందుకు కంగనా రనౌత్ మాత్రమే కాదు, ప్రధాని మోడీ కూడా రైతులకు క్షమాపణలు చెప్పాలని సిపిఎం డిమాండ్ చేసింది.

మోడీ క్షమాపణ చెప్పాలి : ఎఐకెఎస్

కంగనా రనౌత్ వ్యాఖ్యలను అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఖండించింది. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆమె వ్యాఖ్యలు తీవ్రంగా ఖండించతగినవని ఎఐకెఎస్ అధ్యక్షులు డాక్టర్ అశోక్ ధావలే తెలిపారు. వ్యవసాయాన్ని కబళించాలనుకునే అంతర్గత - బాహ్య యాజమాన్యాలను మెప్పించేందుకే కంగనా ఈ వ్యాఖ్యలు చేశారని అన్నారు. దేశ సార్వభౌమత్వాన్ని, ఆహార భద్రతను దెబ్బతీసేందుకు ప్రవేశపెట్టిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా కఠినమైన వాతావరణ పరిస్థితులు, కరోనా మహమ్మారి, ప్రభుత్వాల దౌర్జన్యాల మధ్య రైతుల ఉద్యమం సాగిందని ఎఐకెఎస్ గుర్తు చేసింది. 736 మంది రైతులు ప్రాణత్యాగం చేశారని తెలిపింది. స్వాతంత్ర్య పోరాటానికి ద్రోహం చేసి బ్రిటీష్ శక్తులకు తలవంచిన పచ్చి మితవాద మత శక్తులకు రైతాంగాన్ని, కార్మిక ప్రజలను ప్రశ్నించే నైతిక అధికారం లేదని ధావలే మండిపడ్డారు. కంగనా వ్యాఖ్యలు రైతుల మధ్య విభేదాలను సృష్టించే లక్ష్యంతో ఉన్నందున ఈ వ్యాఖ్యలపై బేషరతుగా ప్రధాని మోడీ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ వ్యాఖ్యలను సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టాలని అన్నారు.

ఆర్‌జి కర్ మాజీ ప్రిన్సిపాల్, మరో ఐదుగురికి రెండో రౌండ్ పాలిగ్రాఫ్ పరీక్షలు

కొల్‌కతా : ఆర్‌జి కర్ ఆసుపత్రి మాజీ ప్రిన్సిపాల్ సందీప్ ఘోష్, మరో ఐదుగురికి సోమవారం సిబిఐ రెండో దశ పాలిగ్రాఫ్ (అబద్ధాలను నిర్ధారించే) పరీక్షలను నిర్వహించింది. మహిళా డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసు విచారణలో భాగంగా వీటిని నిర్వహించింది. ఇటీవల తొలి దశ పాలిగ్రాఫ్ పరీక్షల్లో సందీప్ ఘోష్, ఇతరులు సక్రమమైన జవాబులివ్వలేదని, అందుకే రెండో దశ పరీక్షలు నిర్వహించినట్లు సిబిఐ అధికారి ఒకరు చెప్పారు. సందీప్ ఘోష్ నివాసంలో సిబిఐ అధికారులు సోమవారం 11 గంటల సోదాలు నిర్వహించారు. నివాసం నుండి పలు డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు సిబిఐ అధికారులు తెలిపారు. ఆదివారం మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్ నివాసానికి చేరుకున్న సిబిఐ అధికారులు సోదాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. సోమవారం కూడా ఈ సోదాలు కొనసాగాయి. కీలకమైన ఆధారాలు లభించినట్లు సిబిఐ అధికారి ఒకరు తెలిపారు. మాజీ మెడికల్ సూపరింటెండెంట్ సంజయ్ వశిష్ట్‌తో పాటు కొల్‌కతాలో, బయట ఉన్న మరో 13 మంది నివాసాల్లోనూ సోమవారం సోదాలు చేపట్టినట్లు సిబిఐ అధికారులు చెప్పారు. రోగుల భద్రత, నిర్వహణ కోసం అవసరమైన పరికరాలను సరఫరా చేసే వారి నివాసాలు, కార్యాలయాల్లోనూ సిబిఐకి చెందిన అవినీతి నిరోధక విభాగం సోదాలు జరిపింది.

బెంగాల్‌లో ఆరు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులే పనిచేస్తున్నాయి మమతా లేఖకు కేంద్రం సమాధానం

పశ్చిమ బెంగాల్‌లో టిఎంసి ప్రభుత్వం మహిళలకు, బాలికలకు భద్రతను కల్పించడంలో విఫలమయిందని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. అత్యాచారాలు, పోక్సోకు సంబంధించిన 48,600 కేసులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ రాష్ట్రంలో కేవలం ఆరు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు మాత్రమే పని చేస్తున్నాయని తెలిపింది. మిగిలిన 11 ఫాస్ట్ ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని కేంద్రం తెలిపింది. ఈ నెల 25న ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధానమంత్రి నరేంద మోడీకి రాసిన లేఖకు కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణదేవి సమాధానం ఇస్తూ పై విషయాలను తెలిపారు. మహిళా హెల్ప్‌లైన్, ఎమెర్జెన్సీ రెస్పాన్స్ సపోర్టు సిస్టమ్, చైల్డ్ హెల్ప్‌లైన్ వంటి కీలకమైన అత్యవసర హెల్ప్‌లైన్లను అమలు చేయడంలో మమతా ప్రభుత్వం విఫలమైందని చెప్పారు.

ఎఫ్‌ఐఆర్ నమోదు

ఆర్‌జి కర్ ఆసుపత్రిలో ఆర్థిక అక్రమాల కేసులో ముగ్గురిపై సిబిఐ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసింది. సందీప్ ఘోష్‌తో పాటు, జోరేహట్, బనిపూర్, హౌరాల్లో ఉన్న తారా ట్రేడర్స్, బెల్గాచియాలోని ఈషాన్ కేఫ్, ఖామ లౌహా పేర్లను ఎఫ్‌ఐఆర్‌లో చేర్చింది. రాష్ట్ర ఆరోగ్య శాఖ ప్రత్యేక కార్యదర్శి దేబల్ కుమార్ ఘోష్ లిఖితపూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ ఎఫ్‌ఐఆర్ నమోదైంది. ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజీనామా చేయాలని కోరుతూ మంగళవారం నిర్వహించ తలపెట్టిన 'నబన్న అభిజన్' ర్యాలీ చట్ట విరుద్ధమని పశ్చిమ బెంగాల్ పోలీసులు సోమవారం పేర్కొన్నారు.

బాల రాముడి ప్రాణ ప్రతిష్ట వేడుకకు రూ.113 కోట్లు

- శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ వెల్లడి

న్యూఢిల్లీ : అయోధ్య గుడిలో బాల రాముడి ప్రాణ ప్రతిష్ట కార్యక్రమానికి రూ.113 కోట్లు ఖర్చయ్యాయి. శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ఈ విషయాన్ని వెల్లడించినట్టు ఒక ఆంగ్ల వార్త సంస్థ నివేదించింది. ఈ ఏడాది జనవరి 22న అట్టహాసంగా జరిగిన ఈ వేడుకకు పలు రంగాలకు చెందిన ప్రముఖులు హాజరైన విషయం విదితమే. గుడి నిర్మాణం కోసం రూ.1800 కోట్లు ఖర్చు చేసినట్టు ట్రస్ట్ ఇటీవలి సమావేశంలో వెల్లడించింది. ఈ ఏడాది చివరి నాటికి రూ.670 కోట్లు అదనంగా ఖర్చవుతాయని అంచనా. 2023-24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక ఖాతాలను బోర్డు ట్రస్టీలు చూస్తున్నారు. సెప్టెంబర్‌లో ట్రస్ట్ ఆదాయపు పన్నును దాఖలు చేయనున్నది. గత నాలుగేళ్లలో రాముడి గుడికి దాదాపు 20 కిలోల బంగారం, 13 క్వింటాళ్ల వెండిని భక్తులు సమర్పించినట్టు ట్రస్ట్ వెల్లడించింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 మధ్య అంచనా వ్యయం రూ.850 కోట్లని ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరం కోసం మొత్తం రూ.676 కోట్లు ఖర్చైనట్టు ట్రస్ట్ వివరించింది. ఇదే కాలానికి మొత్తం రూ.363.34 కోట్లు ఆదాయం వచ్చినట్టు తెలిపింది. ఇందులో రూ.204 కోట్లు బ్యాంకు వడ్డీలు, రూ.58 కోట్లు విరాళాల ద్వారా వచ్చి చేరినట్టు ట్రస్ట్ ప్రకటించింది.

గుజరాత్ నుంచి త్రిపుర వరకూ... బెంగాల్ నుంచి మహారాష్ట్ర వరకూ

దంచికొడుతున్న భారీ వర్షాలు



భారీ వర్షాలకు మునిగిన రాజ్‌కోట్ (గుజరాత్)

న్యూఢిల్లీ : రుతుపవనాల సీజన్‌తో పాటు మధ్యప్రదేశ్, రాజస్థాన్‌ల్లో విస్తరించిన తీవ్ర అల్పపీడనం కారణంగా దేశంలో అనేక రాష్ట్రాల్లో భారీ వర్షాలు దంచికొడుతున్నాయి. గుజరాత్ నుంచి త్రిపుర వరకూ, బెంగాల్ నుంచి మహారాష్ట్ర వరకూ భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. ఈ నెల 19 నుంచి కురుస్తున్నా ఈ భారీ వర్షాలు ఈ నెల 30 వరకూ కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. రుతుపవనాల ప్రభావం నుంచి ఢిల్లీ కూడా బయటపడలేదు. ఢిల్లీలో ప్రధాన రహదారులన్నీ జలమయ్యాయి. ఉత్తర బంగాళాఖాతంలో ఏర్పడిన తుపాను వాయుగుండం వలన బెంగాల్‌లో అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. త్రిపురలో భారీ వర్షాలకు ఈ నెల 19 నుంచి 26 మంది మరణించారు. కనీసం 1.17 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. త్రిపురలో పూర్తిస్థాయి సంక్షోభ పరిస్థితి నెలకొంది. భారీ వర్షాల కారణంగా మౌలిక సదుపాయాలు, ఆస్తులు, పంటలకు రాష్ట్రంలో దాదాపు రూ.15 వేల కోట్ల నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేస్తున్నారు. మహారాష్ట్రలో భారీ వర్షాలకు గోదావరి నది పొంగిపొర్లుతోంది.

నర్మదా నదికి రూ. 3.9 క్యూసెక్కుల నీరు విడుదల

గుజరాత్‌లో భారీ వర్షాల కారణంగా సర్దార్ సరోవర్ డ్యామ్ నుంచి నర్మదా నదిలోకి దాదాపు 4 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ కారణంగా భరూచ్ నగరంలోని లోతట్టు ప్రాంతాల నుంచి 280 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వస్తున్న నీటి ప్రవాహం కారణంగా సర్దార్ సరోవర్ నీటి నిల్వ సోమవారానికి 135.20 మీటర్లకు చేరుకుంది. డ్యామ్ పూర్తి సామర్థ్యానం (138.68 మీటర్లు) కంటే కేవలం 3.48 మీటర్లు తక్కువ. డ్యామ్‌కు రోజుకు 3.68 క్యూసెక్కుల నీరు చేరుతుందని అధికారులు తెలిపారు. మొత్తం 30 గేట్లలో సోమవారానికి 23 గేట్లను అధికారులు ఎత్తివేశారు. నది పరివాహక ప్రాంతాల్లో ప్రజలు నదీ ఒడ్డుకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరించారు.

ఉద్యోగాల కోసం ఫేక్ కుల సర్టిఫికెట్లు


- తొమ్మిదేళ్లలో ప్రభుత్వానికి 1084 ఫిర్యాదులు
- 2010-19 మధ్య 92 మందికి ఉద్వాసన
- అత్యధికం రైల్వే శాఖ నుంచే ఆర్‌టిఐ సమాచారం

న్యూఢిల్లీ : ప్రభుత్వ ఉద్యోగాల కోసం అభ్యర్థులు నకిలీ కుల సర్టిఫికెట్లు అందిస్తున్న ఘటనలు ఆందోళనను కలిగిస్తున్నాయి. 2010 నుంచి 2019 వరకు, తొమ్మిదేండ్లలో ఇలాంటి ఘటనలకు సంబంధించి 1084 ఫిర్యాదులు అందినట్టు ఒక అధికారిక పరిశీలనలో తేలినట్టు సమాచార హక్కు చట్టం (ఆర్‌టిఐ) కింద ఒక ఆంగ్ల వార్త సంస్థ నివేదించింది. ఈ కేసులలో 92 మంది సిబ్బందిని సర్వీసు నుంచి తొలగించినట్టు సిబ్బంది మరియు ట్రైనింగ్ డిపార్ట్‌మెంట్ (డిఒపిటి) రికార్డులనుబట్టి తెలుస్తున్నది. ఇక శాఖల వారీగా చూస్తే అత్యధికంగా ఫిర్యాదులు, ఉద్వాసనలు రైల్వే డిపార్ట్‌మెంట్ నుంచి ఉన్నాయి. ఇందులో 349 ఫిర్యాదులు అందగా.. 27 మంది డిస్మిస్ అయ్యారు. పోస్టల్ డిపార్ట్‌మెంట్ నుంచి 259 ఫిర్యాదులు, 24 డిస్మిస్‌లు నమోదయ్యాయి. షిప్పింగ్ మినిస్ట్రీ నుంచి 202 కంప్లైంట్లు అందగా, నలుగురు సర్వీసుల నుంచి తొలగించబడ్డారు. ఆహార మరియు ప్రజా పంపిణీ విభాగం నుంచి 138 ఫిర్యాదులు, రెండు డిస్మిస్‌లు, హౌజింగ్ అండ్ అర్బన్ అఫైర్స్ మినిస్ట్రీ నుంచి 26 కంప్లైంట్లు రాగా, ఇద్దరు సర్వీసుల నుంచి తొలగించబడ్డారు. కాగా, ట్రైనీ ఐఎఎస్ పూజా ఖేద్కర్ ఉదంతం బయటపడిన నేపథ్యంలో ఆర్‌టిఐ కింద ఈ సమాచారం బహిర్గతం కావటం గమనార్హం.

బస్సులు, ట్రక్కులు ఆపి, ప్రయాణికులను దింపి...

బెలూచిస్తాన్‌లో సాయుధుల దాడులు

- 39మంది మృతి



ఇస్లామాబాద్ : నైరుతి పాకిస్తాన్‌లోని బెలూచిస్తాన్ ప్రావిన్స్‌లో సాయుధులు జరిపిన దాడుల్లో 39 మంది మరణించారు. సాయుధులైన కొందరు వ్యక్తులు ఆదివారం రాత్రి పలుచోట్ల అనేక బస్సులను, ట్రక్కులను నిలిపివేసి, ప్రయాణికుల గుర్తింపు కార్డులను పరిశీలించి మరీ 23మందిని చంపేశారు. పది వాహనాలకు నిప్పంటించారు. అనంతరం ముసాహిల్ జిల్లాలోని మారుమూల ప్రాంతమైన రారషామ్ వద్ద సాయుధులు తప్పించుకుని పారిపోయారు. మూడుచోట్ల దాడులతో పాటూ పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఖలత్ జిల్లాలో జరిగిన ఘటనల్లో నలుగురు పోలీసు అధికారులతో సహా తొమ్మిది మంది మరణించారు. మరో ఐదుగురు సామాన్య పౌరులు చనిపోయారు. అదే రోజు బోలన్‌లో రైల్వే ట్రాక్‌ను పేల్చివేయడంతో ఆరుగురు మరణించారు. మత్సంగ్‌లో పోలీసు స్టేషన్‌పై దాడికి పాల్పడ్డారు. బెలూచిస్తాన్‌లోని గవాదర్ నగరంలో అనేక వాహనాలను దగ్ధం చేశారు. బెలూచిస్తాన్‌లో గత కొన్నేళ్లుగా అనేక సాయుధ గ్రూపులు పనిచేస్తున్నాయి. పంజాబ్ ప్రావిన్స్‌ను కలిపే హైవే పొడవునా ఈ దాడులు చోటు చేసుకున్నాయి. హైవేలకు దూరంగా వుండాల్సిందిగా ప్రజలను బెలూచిస్తాన్ లిబరేషన్ ఆర్మీ (బిఎల్ఎ) హెచ్చరించిన నేపథ్యంలోనే ఈ దాడులు చోటు చేసుకున్నాయి. పౌర దుస్తుల్లో ప్రయాణిస్తున్న సైనిక సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నట్లు లిబరేషన్ ఆర్మీ ఒక ప్రకటనలో తెలిపింది. అలాంటి వారిని గుర్తించిన వెంటనే కాల్చివేసినట్లు పేర్కొంది. పంజాబ్‌కు వెళ్లే వచ్చే వాహనాలన్నింటినీ సోదా చేశారని, కొంతమందిని గుర్తించారని, కాల్చేశారని ముసాహిల్ సీనియర్ అధికారి తెలిపారు. గాయపడిన వారిని డేరా ఘాజి ఖాన్‌లోని ఆస్పత్రికి తరలించారు.

ముసాహిల్ దాడి ఆటవిక చర్య అని పాకిస్తాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ, హోం మంత్రి మొహిసిన్ నక్వీలు వేర్వేరు ప్రకటనల్లో తీవ్రంగా ఖండించారు. దోషులను పట్టుకుని శిక్షిస్తామని హామీ ఇచ్చారు. ఇవి తీవ్రంగా ఆందోళన కలిగించే దాడులుగా పంజాబ్ ప్రభుత్వ ప్రతినిధి ఉజ్మా బుఖారి వ్యాఖ్యానించారు. బిఎల్ఎ తీవ్రవాదులను సమూలంగా నిర్మూలిస్తామని చెప్పారు. గత 24గంటల్లో 12మంది రెబెల్ కార్యకర్తలను భద్రతా బలగాలు హతమార్చాయని స్థానిక మీడియా తెలిపింది.

షేక్ హసీనాపై మరో 4 కేసులు

ఢాకా : బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాతో పాటు మాజీ కేబినెట్ మంత్రులు, సహాయకులపై మరో నాలుగు హత్య కేసులు నమోదయ్యాయని ఆదివారం మీడియా తెలిపింది. రిజర్వేషన్‌పై చెలరేగిన ఆందోళనలు నిరసనలకు దారితీయడంతో షేక్ హసీనా బంగ్లాదేశ్ ప్రధాని పదవికి రాజీనామా చేసి, దేశాన్ని విడిచి వెళ్లిపోయిన సంగతి తెలిసిందే.

2010లో అప్పటి బంగ్లాదేశ్ రైఫిల్స్ (బిడిఆర్) అధికారి అబ్దుల్ రహీమ్ మృతిపై హసీనా, బంగ్లాదేశ్ బోర్డర్ గార్డ్ మాజీ డైరెక్టర్ జనరల్ జనరల్ అజీజ్ అహ్మద్‌తో పాటు మరో 11 మందిపై ఆదివారం హత్య కేసు నమోదైంది. 2010లో పిల్ఖానాలో జరిగిన మారణహోమంపై నమోదైన కేసులో మాజీ బిడిఆర్ డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్ రహీమ్ నిందితుడిగా ఉన్నాడు. అదే ఏడాది జులై 29న జైలు కస్టడీలో మరణించాడు. రహీమ్ కుమారుడు అడ్వకేట్ అబ్దుల్ అజీజ్ ఢాకా మేజిస్ట్రేట్ ముందు కేసు దాఖలు చేశారు.

జులై 18న వివక్ష వ్యతిరేక విద్యార్థి ఉద్యమంలో మిలిటరీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఎంఐఎస్‌టి విద్యార్థిని హత్య చేసినందుకు హసీనాతోపాటు మరో 48 మందిపై ఆదివారం మరో హత్య కేసు నమోదైంది. బాధితుడు షేక్ అషాబుల్ యెమిన్ మామ అబ్దుల్లా అల్ కబీర్ ఢాకా సీనియర్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఎండీ సైఫుల్ ఇస్లాం కోర్టులో 49 మంది నిందితులపై కేసు నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు. పిటీషన్ స్వీకరించిన కోర్టు ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసుల్ని ఆదేశించింది. ఈ కేసులో అవామీ లీగ్ ప్రధాని కార్యదర్శి, రోడ్డు రవాణా, వంతెలన శాఖ మాజీ మంత్రి ఒబైదుల్ క్వాదర్, మాజీ హోంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్ తదితరులను నిందితుగా చేర్చారు.

ప్రస్తుతం షేక్ హసీనాపై 53 కేసులు నమోదయ్యాయి. ఇందులో 44 హత్యలు, ఏడు మానవత్వం, మారణహోమం కేసులు ఉన్నాయి. మరొకటి కిడ్నాప్, ప్రతిపక్ష బిఎస్‌పి ఊరేగింపుపై దాడి కేసులు ఉన్నాయి.

నేడు సుప్రీం ముందుకు కవిత బెయిల్ పిటిషన్

- ఢిల్లీలోనే కెటిఆర్, హరీష్, ముఖ్య నేతలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కేసులో బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం సుప్రీంకోర్టులో విచారణ జరగనుంది. లిక్కర్ కేసులో ఇడి, సిబిఐ కేసుల్లో కవిత దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లను రౌస్ అవెన్యూ కోర్టు (ట్రయల్), ఢిల్లీ హైకోర్టు తిరస్కరించాయి. దీంతో ఈ కేసుల్లో మధ్యంతర బెయిల్ కోరుతూ ఈ నెల 8న ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో రెండు సార్లు ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ కెవి విశ్వనాథన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం కవితకు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. దర్యాప్తు సంస్థలు ఇడి, సిబిఐ కౌంటర్ దాఖలు చేసిన తర్వాతే మధ్యంతర బెయిల్‌పై నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నాయి. కాగా, గత వారం విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ... ఇడిని కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, కవిత తంపున అడ్వకేట్‌కు రిజాయిండర్ వేసేందుకు అనుమతినిచ్చింది. తదుపరి విచారణ ఈ నెల 27కు వాయిదా వేసింది.

కవిత బెయిల్ పిటిషన్ మంగళవారం సుప్రీం ముందుకు రానున్న నేపథ్యంలో మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్‌రావు ఆదివారం ఉదయమే ఢిల్లీ చేరుకున్నారు. కవిత తరపున వాదనలు వినిపిస్తోన్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది ముకుల్ రోహిత్గి, విక్రమ్ చౌదరితో భేటీ అయ్యారు. ఇప్పటికే కవిత భర్త అనిల్ ఢిల్లీలో ఉండగా, ఆ పార్టీ ఎంపి వద్ది రాజు రవిచంద్ర.. కెటిఆర్, హరీష్‌రావుతోనే ఉంటున్నారు. సోమవారం సాయంత్రం పలువురు ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, పార్టీ ముఖ్యనేతలు ఢిల్లీకి చేరుకున్నారు.



మీకోసం

బాగా జిడ్డు పేరుకుపోయిన ఇనుప పెనాన్ని పొయ్యి మీద పెట్టి, సాల్ట్ వేసి బాగా వేడిచేయాలి. ఒక గరిటెతో ఉప్పునంతటినీ పెనం మీద పేరుకుపోయిన జిడ్డుతో కలిపి గట్టిగా తిప్పుతూ ఉండాలి. కాసేపటికి నల్లని జిడ్డంతా పెచ్చుపెచ్చులుగా ఊడిపోతుంది. ఇలా రెండు మూడు సార్లు చేస్తే, పెనం చక్కగా శుభ్రపడుతుంది.

జీవన సౌరభం

గెలవకపోవడం ఓటమి కాదు. మళ్లీ ప్రయత్నించకపోవడవే ఓటమి.

జోరీగలు



అది ఒక అడవి. అక్కడ ఎన్నో రకాల సాధు జంతువులు ఎంతో సంతోషంగా ఉంటున్నాయి. ఒక రోజు ఒక పులి, నక్క ఎక్కడి నుండో వచ్చాయి. వచ్చీ రాగానే 'ఇన్నాళ్లు మీరు ఎంతో సంతోషంగా ఉన్నారు. ఇక మీదట మీ ఆటలు సాగవు. ఈ క్షణం నుండే ఈ పులి మీకు రాజు, నేను మంత్రిని' అని అంది నక్క. 'అవును నేను ఇష్టం వచ్చినట్టు వేటాడితే మీకే నష్టం. అందుకని రోజు నా ఆకలిని తీర్చడానికి మీలో ఎవరిని పంపుతారో మీరే నిర్ణయించుకోండి. ఈ పూటకు నాకు ఆహారం అవసరం లేదు' అంది పులి.

అందరికీ మంచి నేస్తం అయిన అంజి అనే కోతి కలగ జేసుకుని 'అలాగే రాజా! మీరు ఆ పక్కగా ఉన్న గుహలో విశ్రాంతి తీసుకోండి' అంది. పులి, జింక గుహ వైపు వెళ్ళాయి. ఇదంతా ఒక చెట్టు కొమ్మ మీద ఉన్న జోరీగల గుంపు చూసింది. అందులో అందరికీ పెద్ద దిక్కుగా ఉన్న ఒక జోరీగ, అంజి వద్దకు వచ్చి 'మామా! మనవాళ్లు ఎవ్వరూ కంగారూ పడవలసిన పని లేదు. పులి సంగతి మేము చూసుకుంటాము' అని అంది.

గుహలో పులి, నక్క బాగా ఆదమరచి నిద్ర పోతున్నాయి. జోరీగలు వాటి చెవుల వద్దకు వెళ్లి రెక్కలతో చప్పుడు చేయసాగాయి. 'ఏంటి ఈ వింత రకం ఈగలు ... చెవి దగ్గర ఒకటే రొద' అని పులి, నక్క తమ ముందరి కాళ్లతో, నోటితో వాటిని పట్టుకోవడానికి ప్రయత్నించాయి కానీ ఒక్కటి కూడా దొరక లేదు. జోరీగలు ఆ పులిని, నక్కను గుహ మొత్తం తిప్పాయి.


ఈ చప్పుడు వినడం నా వల్ల కాదు అని పులి గుహ నుండి బయటకు వచ్చింది, నక్క కూడా పులి వెనకాలే వచ్చింది. అంజి పులికి ఎదురయ్యింది. 'రాజుగా చెబుతున్నాను ఈ ఈగలను వెంటనే ఇక్కడ నుండి వెళ్లిపొమ్మని చెప్పు' అంది పులి. 'అయ్యో! రాజా, వాటిని జోరీగలు అని అంటారు. అవి చాలా ప్రమాదకరమైనవి. ఈ చెవిలో నుండి దూరి మరో చెవి నుండి బయటకు వెళతాయి. అవి ఎవరి మాటా వినవు' అంది అంజి. ఈ లోగా మరిన్ని జోరీగలు పులిని, నక్కను చుట్టుముట్టాయి.

'ఆహారం కోసం చూసుకుంటే ఒక్క పూట కూడా పడుకో లేము. అమ్మో! ఇక్కడ నేను ఒక్క క్షణం కూడా ఉండ లేను' అని పులి పరుగు తీసింది 'ఆగండి మహారాజా! మీరు లేకుండా నేను మాత్రం ఇక్కడెలా ఉంటాను' అని నక్క కూడా పరుగు తీసింది. జంతువులన్నీ జోరీగలకు కృతజ్ఞతలు చెప్పాయి.

– యు.విజయశేఖర రెడ్డి,
99597 36475.

చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఇంగ్లీషు అక్షరాలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.







ఘంటసాల యోగ నందిని,
5వ తరగతి,
ఎంపిపిఎస్, చటాకాయ,
కైకలూరు మండలం,
ఏలూరు జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

నడవలేని స్థితి నుంచి నిలబడి, నవ్విస్తోంది..



'నేను నిలబడగలనా? నా వైపు జాలిగా చూడడం మాని, నా మాటలు ఎవరైనా వింటారా?' అన్న స్థితి నుండి లేచి నుంచొన్న వాళ్లని చాలా అరుదుగా చూస్తుంటాం. కానీ నడవలేక, కర్రల సాయంతో నడిచే ఓ అమ్మాయి ఆ పరిస్థితిని దాటుకుని వచ్చింది. తాను ఎదుర్కొన్న అవమానాలు, అవహేళనలతోనే హాస్యం పుట్టిస్తోంది. 8 ఏళ్లుగా స్టాండప్ కమెడియన్‌గా కొనసాగిస్తున్న తన ప్రయాణంలో ఎదురుగా కూర్చొనవాళ్లనే కాదు, తన చుట్టూ ఉన్న వాళ్లకి కూడా ఆ అవమానాలు, హేళనల బాధను మంచి హాస్య చతురతతో చెబుతోంది. అయితే ఆ సందర్భాలేవీ పగలబడి నవ్వేవి కావు, కన్నీటి పొరల్లో దాగున్న నీటిచుక్కలను అదిమిపట్టి పంటి బిగువున బాధను దిగమింగుకుని చెబుతున్న నగ్న సత్యాలు.

36 ఏళ్ల శ్వేతా మంత్రి పుట్టుకతోనే స్పైనా బిఫిడా అనే వెన్నెముక వ్యాధితో పుట్టింది. సరిగ్గా ఎదగని వెన్నెముకతో ఆమె అందరిలా ఎదగలేదు. 4.6 అంగుళాల ఎత్తుకే ఆగిపోయింది. స్కూల్లోను, ఇంట్లోనూ ఎప్పుడూ ఆమె వైకల్యంపైనే చర్చలు ఉండేవి. 'క్లాసు రూంలో అందరూ బయటికి వెళ్లి ఆడుకుంటుంటే నన్ను మాత్రం టీచర్లు వెళ్లనిచ్చేవారు కాదు. ఇంట్లో కూడా అంతే, వీధులోకెళ్లి ఆడుకోవాలని ఎంత ఉన్నా, గుమ్మం దాటనిచ్చేవారు కాదు. అయితే ఇదంతా నా మీద ద్వేషం కాదు, ప్రేమ, జాలి మాత్రమే. కానీ నాక్కావల్సింది ఇది కాదు. నన్ను నన్నులా గుర్తించగలగాలి' అంటున్న శ్వేత, స్వతహాగానే కాస్తంత హాస్య చతురత కలిగిన అమ్మాయి. కామెడీ వీడియోలు చూస్తూ తన ఒంటరితనాన్ని పోగొట్టుకునేది. అవే ఏదో ఒక రోజు తనని ఉన్నత స్థానంలో నిలబెడతాయని ఆమె అస్సలు అనుకోలేదు.

'యూట్యూబ్‌లో చాలా కామెడీ వీడియోలు చూసేదాన్ని. నేను కూడా వారిలాగా హాస్య ప్రదర్శనలు ఇవ్వాలని అనుకునేదాన్ని. అయితే నేను ఒక చోట నుండి మరో చోటికి నడవలేను. నా వల్ల సాధ్యమేనా? అనుకున్నాను. కానీ సోషల్ మీడియాలో నా బాధలు, కష్టాలనే వినోదంగా చెప్పడం ప్రారంభించాను. వాటిని చాలామంది వీక్షించేవారు. నా లక్ష్యం అదే. వైకల్యంతో బాధ పడుతున్న మాలాంటి వాళ్లు, జోక్ చేయడానికే కాదు, జోక్స్ వేయడానికి కూడా అర్హులేనని నిరూపించాలనుకున్నాను' అని చెబుతున్నప్పుడు శ్వేత మాటల్లో ఎంతో ఆత్మవిశ్వాసం తొణికిసలాడింది.

చేదు అనుభవం

2016లో తన సొంత ఊరు పూణెలో మొదటిసారి ప్రదర్శన ఇచ్చినప్పుడు శ్వేతకి చేదు అనుభవం ఎదురైంది. తను స్టేజి ఎక్కగానే ప్రేక్షకుల్లో చాలామంది లేచి వెళ్లిపోయారు. 'అసలు నేను ఆ స్టేజి ఎక్కగలనా? అన్న అనుమానం వచ్చింది. అందరిలా నేను మెట్లు ఎక్కలేను. అదేమో మామూలు వ్యక్తులు వెళ్లడానికి వీలుగా ఉంది. అయినా ఎంతో కష్టపడి స్టేజి ఎక్కాను. చేతుల కింద కర్రలు పెట్టుకుని అతికష్టం మీద స్టేజి ఎక్కిన నన్ను చూసి చాలామంది జాలి పడ్డారు. వైకల్యంతో బాధపడుతూ కామెడీ చేయడం అవసరమా? అన్నారు. అయినా నేను బాధపడలేదు. ఒకప్పుడు నా ప్రదర్శనలు చూసి లేచివెళ్లిపోయిన వారే ఇప్పుడు నేను చెబుతున్న జోక్స్‌కి లేచి నుంచొని చప్పట్లు కొడుతున్నారు. ఇది నేను సాధించిన విజయం కాదు, నాలాంటి వారందరూ ఆత్మవిశ్వాసంతో తల ఎత్తుకునే సందర్భం' అంటున్నారు శ్వేత.

స్టేజి ఎక్కడానికి మొదట్లో ఎంతో ఇబ్బంది పడ్డ శ్వేత, ఆ తరువాత స్టేజి ఎక్కడం ఎక్కడంతోనే 'మీరెందుకు నా చేతి కర్రలను చూస్తున్నారు. వాటిని వదిలేయండి. నేను చెప్పే విషయాలపై శ్రద్ధ పెట్టండి. మధ్యమధ్యలో నా చేతికర్రలను మిమ్మల్ని డిస్టర్బ్ చేసినా మీ ఫ్రక్షని వదిలేసినట్లు వాటిని పట్టించుకోకండి' అని మంచి హ్యూమరస్‌గా చెబుతున్నప్పుడు అప్పటి వరకు ఆమెవైపు చూస్తున్న జాలి చూపులన్నీ ఒక్కసారిగా సంతోషంతో మెలికలు తిరిగాయి.

స్టేజి ప్రదర్శనలు ఇవ్వడంతోనే శ్వేత ఆగిపోలేదు. న్యాయవిద్యార్థిగా, సామాజిక కార్యకర్తగా తనకంటూ ప్రత్యేక గుర్తింపుని సాధించుకుంది. 'నేను మొదటిసారి ముంబయి నగరానికి వెళ్లినప్పుడు లిఫ్ట్ ఉన్న అద్దె ఇంటి కోసం ఎంతో వెతికాను. నాలాంటి వాళ్లకి వీలైన మరుగుదొడ్లు ఉన్న ఇంటి కోసం కూడా అన్వేషించాను. కానీ అవేమీ నాకు కనిపించలేదు. అసలు వైకల్య బాధితుల కోసం ప్రత్యేక సదుపాయాలు కల్పించే వ్యక్తులు చాలా అరుదుగా కనిపించారు.

'వైకల్య బాధితులపై జాలి చూపించడమో, ఆకాశానికి ఎత్తేయడమో చాలామంది తరచూ చేస్తుంటారు. అవి రెండూ అవసరం లేదు. మమ్మల్ని మమ్మల్నిగా గుర్తించండి. వైకల్యం సమస్య కాదు. చూసే మీకే సమస్య. మేము దాన్ని ఎప్పుడు అధిగమించాలనుకుంటూనే ఉంటాం. కానీ మీరు పదే పదే మా వైకల్యాన్ని గుర్తుచేసేలా మమ్మల్ని తక్కువచేసి చూస్తుంటారు. ఈ ధోరణి మార్చాలనే నేను ప్రయత్నిస్తున్నాను' అంటున్న శ్వేత, కామెడీ షోల నుండి విశ్రాంతి దొరికినప్పుడల్లా న్యాయవాదిగా తన వారి హక్కుల కోసం పోరాడుతోంది. భారతదేశంలోనే మొట్టమొదటి స్పైనా బిఫిడా వైకల్య బాధిత స్టాండప్ కమెడియన్‌గా శ్వేత పేరు చరిత్రలో నిలిచిపోనుంది.

గుడ్డు.. ఖనిజాల గని

శరీరానికి ఉపయోగపడే ధాతువులు 45 అయితే గుడ్డులో 44 ధాతువులు ఉన్నాయి. గుడ్డులో మరీ ముఖ్యంగా పచ్చసొనలో 12 ఖనిజాలు, 8 లవణాలు ఉంటాయి. ప్రోటీన్లు, కొవ్వులు, ఇనుము, ఫోలిక్ యాసిడ్, కాల్షియం, మాంసకృత్తులు ఉన్నాయి. పచ్చసొనలో ఉండే కొలెస్ట్రాల్ అన్ని రకములైన జీవక్రియకు ఉపయోగపడుతుంది.

- గుడ్డులో ఖోలిన్ అనే పోషకపదార్థం మెదడుకు ఆరోగ్యంగా ఉంచుతుంది.
- గుడ్డులో ఉన్న ఇనుము ఖనిజ పదార్థాన్ని శరీర కండరాలు దృఢంగా ఉంచేందుకు సహాయపడతాయి. అందుకే ఎదిగేపిల్లలకు, అనారోగ్యానికి గురైన వారు, ప్రతి రోజూ ఒక కోడిగుడ్డు తింటుండాలి.
- గుడ్డులో ఉన్న రైబోఫ్లేవిన్ చర్మం ఆరోగ్యానికి, సరిగా జీర్ణం కావడానికి దోహదపడుతుంది .
- ల్యూటిన్ అనే రంగు యాంటీ ఆక్సిడెంట్లు కంటి ఆరోగ్యానికి మేలు చేస్తాయి.
- గుడ్డులో బి 12 అనే విటమిన్ ఉంటుంది. ఇది ఎర్రరక్త కణాలు వృద్ధి చెందడానికి, నాడీవ్యవస్థ పనితీరు మెరుగుపరుస్తుంది.
- గుడ్డును ఆహారంగా తీసుకోవడం వలన మానసిక ఆందోళనను, గుండె వ్యాధులను, కాలేయంలో కొవ్వు ఉత్పత్తిని తగ్గిస్తుంది. అలాగే కాలేయ పనితీరును పెంచుతుంది .
- వెంట్రుకలు, గోళ్ళు ఆరోగ్యంగా పెరగడానికి ఉపయోగపడే బయోటిన్ గుడ్డులో లభిస్తుంది. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధీకరిస్తుంది.
- కొవ్వులో కరిగే ఎ, డి, ఇ, కె అనే విటమిన్లు, నీటిలో కరిగే 'బి' కాంప్లెక్స్ విటమిన్లు గుడ్డు యొక్క పచ్చసొనలో ఎక్కువగా ఉంటాయి. అందుకే గర్భవతులకు గుడ్డు చాలా ఆరోగ్యకరం. గుడ్డులో ఉండే ఫోలిక్ యాసిడ్, ఇనుము పుట్టబోయే బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.





కన్నప్ప 'తిన్నడు'గా అవ్రామ్

మంచు విష్ణు కుమారుడు అవ్రామ్ 'కన్నప్ప'లో ఓ కీలకమైన పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సోమవారం అవ్రామ్ లుక్ విడుదల చేశారు. ఇందులో అతను 'తిన్నడు'గా నటించనున్నట్లు తెలిపారు. మంచువిష్ణు చిన్నప్పటి పాత్రను అవ్రామ్ పోషించనున్నాడు. ఈ పోస్టర్‌ను మోహన్ బాబు పోస్ట్ చేసి కృష్ణాష్టమి శుభాకాంక్షలు చెప్పారు. మంచు విష్ణు టైటిల్ పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. పాన్ ఇండియా స్థాయిలో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని మోహన్‌బాబు నిర్మిస్తున్నారు. ప్రీతి ముకుందన్ కథానాయిక. ప్రభాస్, అక్షయ్ కుమార్, శరత్‌కుమార్, మోహన్‌లాల్, మధుబాల తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. షూటింగ్ దాదాపుగా పూర్తయింది.




నారా రోహిత్ సుందరకాండ' టీజర్ విడుదల

నారా రోహిత్ హీరోగా వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'సుందరకాండ'. సందీప్ పిక్చర్ ప్యాలస్ పతాకంపై సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్ రెడ్డి, రాకేష్ మహంకాళి సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వృతి వాఘని కథానాయిక. సెప్టెంబర్ 6న ఇది ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా చిత్రబృందం టీజర్‌ను విడుదల చేసింది.

7న 'ఉరుకు పటేలా' సినిమా విడుదల

తేజస్ కంచెర్ల, ఖుష్బూ చౌదరి జంటగా నటిస్తున్న తాజా చిత్రం 'ఉరుకు పటేలా'. వివేక్‌రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. లీడ్ ఎడ్జ్ పిక్చర్స్ బ్యానర్‌లో కంచెర్ల బాల భాను నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్‌ను మేకర్లు విడుదల చేశారు. పూర్తిగా గ్రామీణ నేపథ్యంలో లవ్‌స్టోరీతోపాటుగా హారర్ కామెడీతో తెరకెక్కించారు. సెప్టెంబర్ ఏడోతేదీన ఈ సినిమా విడుదల కానుంది. ఈ సినిమాకు ప్రవీణ్ లక్కరాజు సంగీతాన్ని అందజేశారు.

'ముఫాసా : ది లయన్ కింగ్' ట్రైలర్ విడుదల



'ది లయన్ కింగ్' చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'ముఫాసా : ది లయన్ కింగ్' నుండి ట్రైలర్ విడుదలైంది. 20 డిసెంబర్ 2024న ఈ చిత్రం విడుదలకు సిద్ధంగా ఉంది. మహేష్ బాబు ముఫాసాకు వాయిస్ ఓవర్ అందిస్తున్నారు. ప్రముఖ హాలీవుడ్ నిర్మాణసంస్థ డిస్నీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం నుండి తాజాగా విడుదలైన తెలుగు ట్రైలర్‌లో మహేష్ వాయిస్ అభిమానులతో పాటు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. అద్భుతమైన విజువల్స్‌తో ట్రైలర్ ఆద్యంతం అలరించేలా సాగింది. మనకు తెలిసిన, ఇష్టపడే పాత్రకు కొత్త అంకం. తెలుగులో 'ముఫాసా'కు వాయిస్‌ని అందించినందుకు చాలా సంతోషిస్తున్నా. ఈ క్లాసిక్‌కి నేను విపరీతమైన అభిమానిని కావడంతో ఇది నాకెంతో ప్రత్యేకంగా ఉందని ముఫాసా'కు వాయిస్ ఓవర్ అందించడంపై మహేశ్ ట్వీట్ చేసారు. హిందీ వెర్షన్‌లో ముఫాసా పాత్రకు షారుక్ ఖాన్ ముఫాసా చిన్నప్పటి పాత్రకు ఆయన తనయుడు అబ్రం వాయిస్ ఓవర్ అందించారు.

దళపతి విజయ్ ఆర్థిక సహాయం



తమిళనాడులోని కోవిల్ పట్టికి చెందిన ఓ నిరుపేద విద్యార్థి కుటుంబానికి దళపతి విజయ్ ఆర్థిక సహాయం చేశారు. ఓ టీవీ ఛానల్ చర్చా కార్యక్రమంలో పాఠశాల విద్యార్థి తన కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కాలేజీకి వెళ్తూనే కూలి పనికి వెళ్తున్నట్లుగా చెప్పాడు. ఆ వీడియో కాస్త హీరో విజయ్‌కు చేరింది. దీంతో ఆ విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చుల కోసం రూ.25 వేలు అందజేశారు. ఆ విద్యార్థి చదువుకు పూర్తి బాధ్యత తనే తీసుకుంటానని విజయ్ ప్రకటించారు. ఈ విద్యార్థి కుటుంబానికి విజయ్ తవేక ఆలయ నిర్వాహకుల ద్వారా సహాయం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి తల్లి వీడియోలో మాట్లాడుతూ తన కుమారుడు చదువుకు విజయ్ రూ.25 వేలు ఇచ్చారు. మా కుటుంబానికి నెలకు సరిపడా ఇంటి వస్తువులను కూడా పంపించారు. ఇంకా చదువు కూడా ఆర్థిక సహాయం చేస్తానని చెప్పారన్నారు. అదే వీడియోను చూసిన ప్రముఖ సంగీత దర్శకులు థమన్ కూడా సాయం చేసేందుకు ముందుకొచ్చారు. మోటార్‌బైక్ కొనిస్తానని తన సోషల్ మీడియా పేజీలో పోస్టుచేశారు.

వద్దు బాబోయ్... వద్దు : తాప్సీ




'నేను నటిని మాత్రమే. పబ్లిక్ ప్రాపర్టీని కాదు. రెండింటికీ చాలా తేడా ఉంది. కెమెరాలతో నా పైకి దూసుకురావటం, ఫిజికల్ హ్యాండిల్ చేయడం చాలా తప్పు. ఎవరైనా నో అని చెబితే వారి అభిప్రాయానికి గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలి. నేను ఇలా అంటున్నానని కొందరు నన్ను తప్పుగా అర్థం చేసుకోవచ్చు. అలాంటప్పుడు ఎందుకు హీరోయిన్‌గా చేస్తున్నావ్' అని కామెంట్ చేయొచ్చు. కానీ నటన నాకు నచ్చిన వృత్తి. అందుకే సినిమాలు చేస్తున్నాను' అంటున్నారు హీరోయిన్ తాప్సీ. కె.రాఘవేంద్రరావు దర్శకత్వంలో మంచు మనోజ్ హీరోగా నటించిన 'ఝుమ్మందినాదం' (2010) సినిమాతో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ తర్వాత పలు తెలుగు చిత్రాలతోపాటు తమిళ, మలయాళ, హిందీ చిత్రాల్లో నటించారు. ఆ తర్వాత కొన్నేళ్లుగా బాలీవుడ్‌పైనే ఫోకస్ పెట్టారు. వరుస హిందీ చిత్రాల్లో ఆమె నటిస్తున్నారు. తాజాగా ఆమె చేసిన కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సాధారణంగా సెలబ్రిటీలను చూసినప్పుడు వారి ఫోటోలు తీయటం కోసం యువత ఉత్సాహం చూపుతుంటారు. దీనికి ఆమె నో చెబుతూ పై విధంగా వ్యాఖ్యానించారు.

మహిళా అథ్లెట్లు గత రికార్డులను బ్రేక్ చేస్తారా..?

32మందితో భారత మహిళల బృందం • పారిస్ పారా ఒలింపిక్స్ రేపటినుంచే..


దీపా మాలిక్


అవని లేఖరే


భావినా పటేల్

పారిస్: 17వ పారా ఒలింపిక్స్‌లో భారత మహిళా అథ్లెట్లు అత్యధిక పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నారు. 1968నుంచి భారత మహిళా అథ్లెట్లు పారా ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహిస్తున్నా.. ఇప్పటివరకు దక్కింది కేవలం నాలుగు పతకాలే. ఇందులో ఒక్క 2021 టోక్యోలోనే మూడు పతకాలు లభించగా.. అందులో అవని లేఖరే షూటింగ్ విభాగంలో ఏకంగా రెండు పతకాలు సాధించడం మరో విశేషం. 2024 పారిస్ పారా ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి మొత్తం 84మంది అథ్లెట్లు ప్రాతినిధ్యం వహిస్తుండగా.. వీరిలో 32మంది మహిళా అథ్లెట్లు ఉన్నారు. 1968లో మెక్సికో వేదికగా జరిగిన 3వ పారా ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి తొలిసారి 10మంది మహిళా అథ్లెట్లు ప్రాతినిధ్యం వహించారు. ఆ ఒలింపిక్స్‌లో ఒక్క మహిళా అథ్లెట్ కూడా పతకాన్ని సాధించలేదు. ఆ తర్వాత 1972(పశ్చిమ జర్మనీ), 1976(కెనడా), 1980(నెదర్లాండ్స్).. ఇలా వరుస పారా ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి మహిళా అథ్లెట్ల ప్రాతినిధ్యం పెరుగుతున్నా.. పతకాల వేటలో వెనుకబడిపోయారు.

2024 పారా ఒలింపిక్స్‌లో భారత బృందం

క్రీడాంశం	పురుషులు	మహిళలు	మొత్తం
ఆర్చరీ	3	3	6
అథ్లెటిక్స్	28	10	38
బ్యాడ్మింటన్	7	6	13
సైక్లింగ్	1	1	2
జూడో	1	1	2
పారాకనోయింగ్	1	2	3
పవర్‌లిఫ్టింగ్	2	2	4
రోయింగ్	1	1	2
షూటింగ్	7	3	10
స్విమ్మింగ్	1	0	1
టేబుల్‌టెన్నిస్	0	2	2
తైక్వాండో	0	1	1
మొత్తం	52	32	84

2016 రియోలో తొలిసారి..

2016 రియో పారా ఒలింపిక్స్‌లో మహిళా విభాగంలోభారత్‌కు తొలిసారి ఒక పతకం దక్కింది. షాట్‌పుట్‌లో దీపా మాలిక్ సుదీర్ఘ పతకాల సాధన నిరీక్షణకు తెర దించింది. ఆ పారా ఒలింపిక్స్‌లో దీపా మాలిక్ షాట్‌పుట్ ఎఫ్-53 విభాగంలో రజత పతకంతో మెరిసింది. దీంతో పారా ఒలింపిక్స్‌లో భారత్‌కు మహిళల కేటగిరీలో తొలి పతకం అందించిన మహిళా అథ్లెట్‌గా ఆమె రికార్డుపుటల్లోకెక్కింది.

పారా ఒలింపిక్స్‌లో మహిళా అథ్లెట్లకు దక్కిన పతకాలు..

2016(రియో) : దీపా మాలిక్ (రజత పతకం) షాట్‌పుట్ ఎఫ్-53
2021(టోక్యో): అవని లేఖరే (స్వర్ణం) 10మీ. ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1
భావినా పటేల్ (రజతం) టేబుల్ టెన్నిస్ సింగిల్స్ సి-4
అవని లేఖరే (కాంస్యం) 50మీ. రైఫిల్-3పొజిషన్ ఎస్‌హెచ్-1

టోక్యోలో మరో మూడు...

రియో ఒలింపిక్స్‌లో ఒక పతకం సాధించిన జోష్‌తో 2021 టోక్యో పారా ఒలింపిక్స్‌లో భారత మహిళల బృందం ఏకంగా మూడు పతకాలతో మెరిసారు. ఆ ఒలింపిక్స్‌లో షూటింగ్ విభాగంలో అవని లేఖరే ఏకంగా రెండు పతకాలు కైవసం చేసుకోగా.. టేబుల్ టెన్నిస్ విభాగంలో భావినా పటేల్ మరో పతకం అందించింది.

అవని లేఖరే 10మీ. ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్-1 విభాగంలో స్వర్ణం, 50మీ. రైఫిల్-3 పొజిషన్‌లో కాంస్య పతకం కైవసం చేసుకుంది. దీంతో ఒక పారా ఒలింపిక్స్‌లో రెండు పతకాలు అందించిన భారత మహిళా షూటర్‌గా అవని రికార్డుల్లోకెక్కింది. ఇక భావినా పటేల్ టేబుల్ టెన్నిస్ సింగిల్స్ సి-4 విభాగంలో రజత పతకం ముద్దాడింది. 2024 పారా ఒలింపిక్స్ పారిస్ వేదికగా ఆగస్టు 28నుంచి సెప్టెంబర్ 8వరకు జరగనున్నాయి.

షకీబ్‌కు జరిమానా



రావల్పిండి: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్-అల్-హసన్ జరిమానాకు గురయ్యాడు. పాకిస్తాన్‌తో జరిగిన తొలి టెస్ట్‌లో షకీబ్ ఐసిసి నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలడంతో అతడి మ్యాచ్ ఫీజులో 10 శాతం కోత పడింది. పాక్ వికెట్ కీపర్ మహ్మద్ రిజ్వాన్‌ను రెచ్చగొట్టే ధోరణితో అతడిపైకి బంతిని విసరడడం.. ఆ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న మ్యాచ్ రిఫరీ ఐసిసికి ఫిర్యాదు చేశాడు. పాకిస్తాన్ 4 వికెట్ల నష్టానికి 101పరుగులు చేసి క్రీజులో మహ్మద్ రిజ్వాన్(18), నాన్ స్ట్రయికింగ్‌లో అబ్దుల్లా(37) ఉన్నారు. ఇక రనప్ పూర్తి చేసి షకీబ్ బంతిని విసిరేందుకు సిద్ధమయ్యాడు. అయితే బంతిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా లేని పక్కకు జరిగాడు. దాంతో, చిర్రెత్తుకొచ్చిన షకీబ్ బంతిని రిజ్వాన్ తల మీదుగా వికెట్ కీపర్ వైపు విసిరాడు. ఊహించని పరిణామంతో షాక్ తిన్న అంపైర్ ఇదేంటీ.. ఏం చేస్తున్నావ్ అంటూ షకీబ్ తీరును తప్పు పట్టాడు. అంతేకాదు ఆ బంతిని రద్దు చేస్తున్నట్టు ప్రకటించాడు. మ్యాచ్ అనంతరం షకీబ్ దురుసు ప్రవర్తనను ఐసిసి దృష్టికి తీసుకెళ్లాడు. షకీబ్ వీడియో పరిశీలించిన ఐసిసి క్రమశిక్షణ కమిటీ అతడు నియమాలను ఉల్లంఘించినట్టు తేల్చింది.

పాకిస్తాన్‌కు డబ్ల్యూటిసి పాయింట్లు కోత: ఐసిసి

దుబాయ్: బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో అనూహ్యంగా ఓటమిపాలైన పాకిస్తాన్‌కు మరో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఆ టెస్ట్‌లో స్లో ఓవర్ రేట్‌కు దీంతో రెండు జట్లకు ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2023-25 పాయింట్లలో ఐసిసి కోత విధించింది. మ్యాచ్ జరుగుతున్నప్పుడు నిర్ణీత సమయంలో పాకిస్తాన్ ఆరు ఓవర్లు తక్కువ వేసినట్లు తేలింది. దీంతో ఆ జట్టులో ఖాతాలో ఆరు పాయింట్లు కట్ చేయడంతోపాటు మ్యాచ్ ఫీజులో 30 శాతం జరిమానాగా విధించింది. బంగ్లాదేశ్ కూడా స్లో ఓవర్ రేట్ కారణంగా మూడు పాయింట్లు కోల్పోయింది. బంగ్లా జట్టుకు ఐసిసి 15 శాతం జరిమానా విధించింది. తాజా పరిణామాలతో డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో బంగ్లాదేశ్ (40.00%) ఐదో స్థానం నుంచి (35.00%) ఏడో స్థానానికి, పాకిస్థాన్ (30.56%) నుంచి (22.22%)తో ఎనిమిదో స్థానానికి పడిపోయాయి. ఈ టెస్ట్‌లో బంగ్లాదేశ్ 10 వికెట్ల తేడాతో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించింది. టెస్టుల్లో పాకిస్తాన్‌పై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి విజయం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68